# ది క్రైమ్ న్యూస్
Crime News
తెలుగు దినపత్రిక

గురువారం, నవంబర్ 21, 2024 | సంపుటి - 20 | సంచిక 53 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## కాంగ్రెస్ నేత చిదంబరానికి హైకోర్టులో ఊరట

### జనవరి 22కి వాయిదా



న్యూఢిల్లీ : ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ దాఖలు చేసిన ఎయిర్ సెల్ మ్యాక్సిస్ కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత పీ.చిదంబరానికి ఢిల్లీలో హైకోర్టు ఊరటనిచ్చింది. ట్రయల్ కోర్టు విచారణపై ఢిల్లీ హైకోర్టు బుధవారం స్టే విధించింది. కాంగ్రెస్ నేత పిటిషన్‌పై 2లో






# అసెంబ్లీకి వచ్చే దమ్ముందా కెసిఆర్

## రుణమాఫీపై చర్చ చేద్దామా

నీవెంత అభివృద్ధి చేశావో..నేనెంత చేశానో చర్చిద్దాం
వేములవాడ రాజనన్ననూ మోసం చేసిన కెసిఆర్
పదేళ్లలో చేయలేని పనులు చేస్తుంటే నొప్పెందుకు
స్థానిక ఎన్నికల్లో మీ సంగతి మరోమారు చూస్తాం
కెటిఆర్ ఎందాక ఎగురుతాడో చూస్తా
రంగనాయక్ సాగర్ భూముల్లో హరీష్ రావు ఫామ్‌హౌజ్
అందిరి లెక్కలు తీస్తున్నాం...అవినీతికి పాల్పడ్డవారి భరతం పడతాం
వేములవాడ విజయోత్సవ సభలో సిఎం రేవంత్ విమర్శలు

**ప్రజలనే కాదు.. వేములవాడ రాజన్ననూ కేసీఆర్ మోసం చేశారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రుణమాఫీని అభినందించాల్సింది పోయి విమర్శిస్తారా? మీరు చేసిన రుణమాఫీ.. మేము చేసిన రుణమాఫీ వివరాలు బయటకు తీసి చర్చకు పెడదాం. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే రుణమాఫీ లెక్కలు తీసి చూపిస్తాం. పదేళ్లలో మీరు చేయలేని పని మేం చేస్తుంటే మీకు నొప్పి ఎందుకు? మీ నొప్పికి మా కార్యకర్తల దగ్గర మందు ఉంది.. త్వరలోనే పెడతారు.**



వేములవాడ : స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ సంగతి తేలుస్తాం అంటూ సిఎం రేవంత్ రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. తెలంగాణను దోచుకున్న కేసీఆర్‌ను గద్దె దించాలని సిరిసిల్ల పాదయాత్రలో నిర్ణయించుకున్నానని తెలిపారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా వేములవాడ గుడిచెరువులో ఏర్పాటు చేసిన బహిరంగసభలో సీఎం రేవంత్ మాట్లాడారు. రూ.11వేల కోట్ల రుణమాఫీకి కేసీఆర్ ఐదేళ్లు తీసుకున్నారు. 25 రోజుల్లో 23 లక్షల కుటుంబాలకు రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేశాం అని వివరించారు. మిడ్ మానేరు నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో వాయిదా పడుతూ వస్తున్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. 2లో

# సీఎం రేవంత్ నిర్లక్ష్యానికి 42 విద్యార్థులు బలి

### గురుకులాల్లో కానరాని వసతులు : హరీశ్‌రావు



హైదరాబాద్ : నల్లగొండ జిల్లా కేతెపల్లి మండల పరిధిలోని బీసీ గురుకులంలో ఓ విద్యార్థి పాముకాటుకు గురయ్యాడు. ఈ ఘటనపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో పాము కాటుకు గురై మరో గురుకుల విద్యార్థి ఆసుపత్రి పాలైన వార్త తీవ్రంగా కలిచివేసిందన్నారు. కాంగ్రెస్ పాలనలో బడిలో పాఠాలు నేర్చుకోవాల్సిన పిల్లలు ప్రాణాపాయ స్థితిలో ఆసు పత్రుల్లో చేరుతుండడం సిగ్గుచేటన్నారు. గురుకులాల్లో కుక్కకాట్లు, ఎలుక కాట్లు, పాము కాట్లు సాధారణంగా మారడం దురదృష్టకరమన్నారు. విద్యాశాఖ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖలు 2లో

## వరంగల్ జిల్లాలో ఎస్బీఐ బ్యాంకుకు కన్నం..

### రూ.13 కోట్ల విలువ చేసే బంగారం లూటీ



వరంగల్ : వరంగల్ జిల్లాలోని ఓ ఎస్బీఐ బ్రాంచ్‌లో భారీ దోపిడీ జరిగింది.. దొంగలు బీభత్సం సృష్టించారు.. సోమవారం రాత్రి దొంగలు బ్యాంకు వెనుక ఉన్న కిటికీని గ్యాస్ కట్టర్ తో కట్ చేసి బ్యాంకులోకి చొరబడ్డారు.. అనంతరం దుండగులు భారీ ఎత్తున 19 కిలోల బంగారం అపహరించుకువెళ్లారు. 2లో

# గద్దెనెక్కేందుకు ఇష్టారీతిన హామీలు

### హిమాచల్ సర్కార్ తీరుపై కెటిఆర్ విమర్శలు



హైదరాబాద్ : గ్యారెంటీల పేరుతో గద్దెనెక్కి రాష్ట్రాన్ని దివాలా తీయించిన హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ సర్కారుకు మరో భంగపాటు ఎదురైన సంగతి తెలిసిందే. ఓ విద్యుత్తు సంస్థకు చెల్లించాల్సిన రూ.150 కోట్లను రికవరీ చేసేందుకు ఢిల్లీలోని హిమాచల్ భవన్ జప్తుకు హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ భవనాన్ని వేలం వేసి బకాయిలు తీర్చేసుకోవాలని సదరు కంపెనీకి సూచించిన విషయం విదితమే. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 2లో

# రాబోయే వారం రోజులపాటు ఎముకలు కొరికే చలి

### హెచ్చరిస్తున్న వాతావరణశాఖ అధికారులు

### హైదరాబాద్ వాసులు అప్రమత్తంగా ఉండాలని సూచన



హైదరాబాద్ : హైదరాబాద్ వాసులకు హైఅలర్ట్ .. రాబోయే వారం రోజుల పాటు ఎముకలు కొరికే చలి గ్యారంటీ.. ఇప్పటికే గత రెండు మూడు రోజుల నుంచి సిటీతో పాటు నగర శివారుని కోల్డ్ వేవ్స్ కమ్మేశాయి. ఇదే వెదర్ మరో ఏడెనిమిది రోజుల పాటు ఉంటుందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. దీంతో ఇటు చలి..మరోవైపు సీజనల్ వ్యాధులు విజృంభించే ఛాన్స్ ఉండటంతో నగరవాసులు బెంబేలెత్తిపోతున్నారు. హైదరాబాద్‌పై చలి పగబట్టింది. జంటనగరాల్లో చలి తీవ్రత పెరిగింది. నగరశివారులో గత రెండు, మూడు రోజుల నుంచి కోల్డ్ వేవ్స్ వణికిస్తున్నాయి. ఇది మరో వారం రోజుల పాటు కొనసాగే అవకాశం ఉంది. చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. 2లో



# వ్యవసాయాభివృద్ధికి చేయూత

## మంత్రి పొంగులేటి వెల్లడి



ఖమ్మం : వ్యవసాయం బాగుంటేనే అన్ని బాగుంటాయని, రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి ఇంకా బాగుంటుందని రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రైతు రుణమాఫీ మొదలు ఉచిత కరెంట్ ధాన్యం సేకరణ వంటి విషయాల్లో ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. ధాన్యం సేకరణ, సంచులు, సకాలంలో చెల్లింపులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. రైతుల నుంచి ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని, అప్పటి వరకూ కేంద్రాలు ఉంటాయని స్పష్టం చేశారు. తెలంగాణలో పంటలు అద్భుతంగా పండుతున్నాయని అన్నారు. ఎక్కడిక్కడ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే గన్నీ సంచులను అందుబాటులో ఉంచామని, అవసరమైతే సంచులను తెప్పిస్తున్నామని అన్నారు. మిగతా 2లో

## యాదాద్రి ఆలయ గోపురాలు స్వర్ణమయం..

### బంగారు రేకుల అమరిక పనులకు దేవస్థానం శ్రీకారం



యాదాద్రి : ప్రపంచ అద్భుత ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతున్న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయం త్వరలో కొత్త రూపు సంతరించుకోనున్నది. దేవాలయ విమానం గోపురం స్వర్ణమయం కానున్నది. ప్రధాన ఆలయ దివ్య విమాన గోపురానికి బంగారు రేకుల అమరిక పనులకు దేవస్థానం శ్రీకారం చుట్టింది. మిగతా 2లో

# ఏపీ ప్రజలు ఇచ్చిన విజయాన్ని ఎప్పుడు మరిచిపోను

గత ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన విజయాన్ని తాను ఎన్నడూ మరిచిపోనని, ఏపీ చరిత్రలో ఎప్పుడూ చూడని ప్రజాతీర్పు వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజల తిరుగుబాటు కనిపించిందని తెలిపారు. "నాలుగు దశాబ్దాలుగా నన్ను ఆదరించారు. అందరికంటే ఎక్కువ సార్లు నన్ను ప్రజలు సీఎం చేశారు. ఎన్నో ఇబ్బందులు పెట్టారు.. జైలుకు కూడా పంపారు.

## గెలిచినా.. ఓడినా ఇక్కడే ఉంటా

### అప్పుల ఊబిలో తీసుకెళ్లిన జగన్
### ఇప్పుడిప్పుడే రాష్ట్రం కుదుటపడుతుంది
### ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

అమరావతి : బాంబు దాడి నుంచి శ్రీవారే నన్ను కాపాడారు. నేను ఏ తప్పూ చేయలేదు. సీఎం అయ్యాక రాష్ట్రాన్ని బాగు చేస్తారా.. చేయగలుగాతాము అనే నమ్మకం ఉందా అని పలువురు నన్ను అడిగారు. నేను పారిపోను.. పారిపోలేను. అధికారం ఉన్నా.. అధికారం లేకపోయినా ప్రజల కోసమే పనిచేశాను. ఇప్పుడు కూడా ప్రజలు తీర్పు ఇచ్చి నన్ను గెలిపిస్తే.. అభివృద్ధి చేసి తీరుతాను అని ప్రతిజ్ఞ చేసి ముందుకు వచ్చాను" అని సీఎం పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు. రాత్రికి రాత్రి ఏదీ జరిగిపోదన్నారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం వెంటిలేటర్‌పైకి వెళ్లిందన్నారు. కీలక సమయంలో ప్రజలు ఘన విజయం 2లో



# సీఎం రేవంత్ నిర్లక్ష్యానికి 42 విద్యార్థులు బలి

తన వద్దనే ఉన్నా ముఖ్యమంత్రి ఏనాడు సమీక్ష చేయడని హరీశ్‌రావు మండిపడ్డారు. పురుగులన్నం తినలేక విద్యార్థులు ఆకలితో అలమటించినా పట్టించుకోడు... ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు ఆస్పత్రుల పాలైన పట్టించుకోడు. టీచర్లు కావాలంటూ విద్యార్థులు రోడ్డెక్కినా పట్టించుకోడు... పాముకాట్లు, కుక్క కాట్లు, ఎలుక కాట్లు, కరెంటు షాకులతో ఆసుపత్రుల పాలైనా పట్టించుకోడని విమర్శించారు. మీ 11నెలల కాలంలో 42 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికైనా కళ్ళు తెరవండి అని ఎన్నిసార్లు మొత్తుకున్నా పట్టించుకోవాలని హరీశ్‌రావు కోరారు. రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం ఖరీదు 42 మంది విద్యార్థుల ప్రాణాలన్నారు. విద్యాశాఖ ప్రక్షాళన అంటూ ప్రగల్భాలు పలకడం కాదు రేవంత్ రెడ్డి.. గురుకులాల్లో కనీస సౌకర్యాలు కల్పించి, విద్యాబోధన జరిగేలా చూడండి. అభం శుభం తెలియని చిన్నారుల ప్రాణాలు కాపాడండి అని హరీశ్‌రావు కోరారు.

# వరంగల్ జిల్లాలో ఎస్బీఐ బ్యాంకుకు కన్నం..

బ్యాంక్ సిబ్బంది సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు విచారణ చేపట్టారు. భారీ దొంగతనం కేసులో నిందితుల కోసం వేట కొనసాగుతోంది.. ఈ భారీ దోపిడీ వరంగల్ జిల్లాలోని రాయపర్తి మండల కేంద్రం లోని సీబీఐ బ్రాంచ్ లో సోమవారం అర్థరాత్రి జరిగింది.. బ్యాంకులో బంగారం నిల్వ ఉన్న లాకర్లను మాత్రమే పగలగొట్టి లాకర్లలో ఉన్న బంగారాన్ని దొంగిలించారు. ఎప్పటిలాగే బ్యాంకు తెరిచిన అధికారులకు లాకర్లు పగలగొట్టి ఉండడంతో నివ్వెరబోయారు. బ్యాంకులో భారీ ఎత్తున దోపిడీ జరిగినట్లు నిర్ధారించుకొని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు విచారణ చేపట్టారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ఆధారాలను సేకరించారు. ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. అయితే.. లాకర్లలో భద్రపరచిన 19 కిలోల బంగారం మొత్తం దోపిడీకి గురి కావడం పట్ల.. ఇంటి దొంగల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సుమారు 13 కోట్ల రూపాయల విలువగల బంగారం అపహరణకు గురైనట్లు పేర్కొంటున్నారు. బ్యాంకులో దొంగతనం జరిగిన విషయం బయటకు తెలియడంతో బ్యాంకులో బంగారాన్ని కుదువపెట్టి లోన్లు తీసుకున్న బాధితులు, లాకార్లలో బద్రపర్చుకున్న వారు ఆందోళన చెందుతున్నారు.. పోలీసులు, బ్యాంక్ అధికారుల నుండి వివరాలు సేకరిస్తున్నారు.లాకర్‌లో బంగారం చోరీ విషయం తెలిసి 474 మంది ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. చోరీకి గురైన బంగారం విలువ దాదాపు 13 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు.. బాధితులు బ్యాంక్ వచ్చి ఆందోళన చేస్తుండటంతో టెన్షన్ వాతావరణం నెలకొంది.. అయితే బ్యాంక్ వెనుక భాగంలో కిటికీని గ్యాస్ కట్టర్ తో కట్ చేసిన దొంగలు లోపలికి ప్రవేశించిన వెంటనే సీసీ కెమెరా హార్డ్ డిస్క్ లను ధ్వంసం చేశారు.. లాకర్ లను పగులగొట్టి బంగారం లూటీ చేశారు.. సీసీటీవీ డీవీఆర్‌లను సైతం ఎత్తుకెళ్లారు. ఇది అంతర్ రాష్ట్ర దొంగల పనా..? లేక ఇక్కడి వారే దోపిడీకి బరితెగించారా..? అనే కోణంలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది..ఇదిలాఉంటే.. ఇదే తరహాలో కర్నాటక దవణగెరె జిల్లాలోని బ్యాంక్‌లో చోరీ జరిగింది.. ఈ దోపిడీ కూడా ఆ దొంగల ముఠా పనిగా భావిస్తున్నారు పోలీసులు.. నాలుగు స్పెషల్ టీమ్స్‌ను దర్యాప్తు కోసం రంగంలోకి దించి.. దర్యాప్తును వేగవంతం చేశారు.

# ఛాతీ ఇన్ఫెక్షన్‌తో ఆసుపత్రిలో చేరిన స్వామి రామభద్రాచార్య

డెహ్రాడూన్ : తులసీ పీఠాధీశ్వర స్వామి రామభద్రాచార్య తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఛాతీలో ఇన్ఫెక్షన్ కారణంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడింది. దీంతో చికిత్స నిమిత్తం రామభద్రాచార్యను డెహ్రాడూన్‌లోని సినర్జీ ఆస్పత్రిలో చేర్పించారు. షుగర్, హార్ట్ పేషెంట్ అయిన స్వామి రామభద్రాచార్య సాధారణ చెకప్‌కు వచ్చినట్లు ఆస్పత్రి వైద్యులు చెప్పారు. తులసీ పీఠాధీశ్వర స్వామి రామభద్రాచార్య ఛాతీ ఇన్ఫెక్షన్ తో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఆయన్ని మంగళవారం డెహ్రాడూన్‌లోని సినర్జీ ఆసుపత్రిలో చేర్చించారు. పరీక్షల అనంతరం స్వామి రామభద్రాచార్య ఆరోగ్యంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు. ఛాతిలో ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న ఆయనకు చికిత్స కొనసాగుతోందని చెప్పారు. ఏది ఏమైనప్పటికీ స్వామి రామభద్రాచార్య మధుమేహం, గుండె సంబంధిత రోగి. కనుక స్వామి రామభద్రాచార్య రొటీన్ చెకింగ్ కోసం ప్రతి ఆరు నెలలకోసారి డెహ్రాడూన్ వస్తారు. సినర్జీ ఆసుపత్రికి చెందిన డాక్టర్ కృష్ణ అవతార్ .. స్వామీ రామభద్రాచార్య విషయంపై మాట్లాడుతూ ప్రస్తుతం శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నారని.. రొటీన్ చెకప్ కోసమే వచ్చారని చెప్పారు. చికిత్స అనంతరం ఆయన ఉపశమనం పొందారని అన్నారు. సమాచారం ప్రకారం రామభద్రాచార్యకు అప్పటికే మధుమేహ సమస్య ఉంది. ఇప్పుడు మారుతున్న వాతావరణం కారణంగా.. శ్వాస తీసుకోవడంలో కొంత ఇబ్బంది మొదలైంది. దీంతో డెహ్రాడూన్‌లోని సినర్జీ ఆసుపత్రికి తీసుకెళ్లారు.. స్వామీజీ ఆరోగ్య పరిస్థితి చూసి వైద్యులు అడ్మిట్ చేశారు. అన్ని పరీక్షలు చేసిన అనంతరం సినర్జీ హాస్పిటల్ %వీణ% డాక్టర్ కృష్ణ అవతార్ స్వామీ ఆరోగ్యం విషయంపై మాట్లాడుతూ ఛాతీ ఇన్ఫెక్షన్ కారణంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉందని చెప్పారు. ఆసుపత్రిలో చేరిన అనంతరం ఆయన ఉపశమనం పొందారు. అంతేకాదు ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య సమస్యలను చెక్ చేస్తామని.. ఇప్పుడు ఆ సమయం ఆసన్నం అయిందని చెప్పారు. స్వామీ ఆరోగ్యాన్ని పరిశీలించిన వైద్యులు అంతా సవ్యంగానే ఉందని ప్రకటించారు. త్వరలో డిశ్చార్జ్ చేస్తామని అన్నారు. మరోవైపు రామభద్రాచార్యులు అనారోగ్యానికి గురయ్యారనే వార్త తెలియడంతో ఆయనతో అనుబంధం ఉన్న భక్తులు ఆందోళనకు దిగారు.

# కేసీఆర్ పాలనలో విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడాం

## కాంగ్రెస్ పాలనలో అనాథలుగా మారారు : మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్ : కేసీఆర్ హయాంలో అటు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను, ఇటు గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని నాణ్యతో కూడిన భోజనాన్ని అందించామనాని తెలిపారు. కానీ ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యార్థులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో అవసరమైన పోషకాహారాన్ని కూడా అందించలేకపోతున్న పరిస్థితి ఉందన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు నాణ్యతతో కూడిన భోజనం అందడం లేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం అధ్వాన్నంగా అందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉడకని అన్నం, నీళ్ల చారు, నాణ్యత లేని పప్పును అందిస్తున్నారని తెలిపారు. వారానికి మూడుసార్లు ఇచ్చే గుడ్డు కూడా మాయమైందని గుర్తు చేశారు. విద్యార్థులకు గుడ్ల పంపిణీ ఏడాదిగా నిలిచిపోయిందని, బిల్లులు రాక నిర్వాహకులు అవస్థలు పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఇవన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు అని చెప్పారు. పేద విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తు పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని స్పష్టం అవుతోందని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎలాగూ విద్యాశాఖను పట్టించుకోడు కాబట్టి, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్లు ప్రభుత్వ పాఠశాలలు సందర్శించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నాను అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# కాంగ్రెస్ నేత చిదంబరానికి హైకోర్టులో ఊరట

ఈడీకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మనీలాండరింగ్ కేసులో చిదంబరం, ఆయన తనయుడు కార్తీ చిదంబరంపై ట్రయల్ కోర్టులో ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను పరిగణలోకి తీసుకొని నోటీసులు జారీ చేసింది. కేసు విచారణను జనవరి 22కి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ మనోజ్ కుమార్ ఓహ్రి పేర్కొన్నారు. ఈ కేసులో వివరణాత్మక ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలిపారు. చిదంబరం తరపున సీనియర్ న్యాయవాది ఎన్ హరిహరన్, అర్షదీప్ సింగ్ ఖురానా, అక్షత్ గుప్తా వాదనలు వినిపించారు. మాజీ కేంద్రమంత్రిపై ప్రాసిక్యూషన్‌కు ఎలాంటి అనుమతి లేకపోవడంతో ప్రత్యేక న్యాయమూర్తి మనీలాండరింగ్‌కు సంబంధించిన ఛార్జిషీట్‌ను పరిగణలోకి తీసుకున్నారని.. ఆయనపై వచ్చిన ఆరోపణలు అధికారిక విధులతో సంబంధం లేదని.. ఈ కేసులో ప్రాసిక్యూషన్‌కు అనుమతి అవసరం లేదని ఈడీ న్యాయవాది అభ్యంతరాలు లేవనెత్తారు. ఈ క్రమంలో మధ్యంతర ఉపశమనం కల్పించాలని.. ట్రయల్ కోర్టులో కొనసాగుతున్న విచారణపై స్టే విధించాలని చిదంబరం కోరారు. ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ కేసులో చిదంబరం, కార్తీలపై సీబీఐ, ఈడీ దాఖలు చేసిన చార్జిషీట్‌లపై ట్రయల్ కోర్టు నవంబర్ 27, 2021న విచారణ చేపట్టి, సమన్లు జారీ చేసింది. సీఆర్‌పీసీ సెక్షన్ 197 (1) ప్రకారం ప్రాసిక్యూషన్ కోసం అనుమతి పొందడం తప్పనిసరని.. ఈడీ ఇప్పటి వరకు ప్రాసిక్యూషన్‌కు అనుమతి తీసుకోలేదని చిదంబరం తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. ప్రస్తుతం, అభియోగాల పరిశీలన కోసం ట్రయల్ కోర్టు ఎదుట ప్రొసీడింగ్స్ ఫిక్స్ అయ్యాయని లాయర్ తెలిపారు. 2006లో చిదంబరం కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ ఒప్పందానికి అనుమతి లభించింది. ఆర్థిక మంత్రిగా చిదంబరం ఈ ఒప్పందాన్ని ఆమోదించేందుకు తనశక్తికి మించి ప్రయత్నించారని.. దాంతో కొందరికి లబ్ధి చేకూరిందనే ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై సీబీఐ కేసు నమోదు చేయగా.. మనీలాండరింగ్ నేపథ్యంలో ఈడీ సైతం రంగంలోకి దిగింది.

# అసెంబ్లీకి వచ్చే దమ్ముందా కెసిఆర్

ఈ నెల 30న మరోసారి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇక్కడికి వచ్చి ప్రాజెక్టులపై సమీక్షిస్తారని సీఎం చెప్పారు. దేశానికి ప్రధానిని అందించిన గడ్డ కరీంనగర్. పరిపాలన ఎలా ఉంటుందో దేశానికి చూపిన తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు అన్నారు. తెలంగాణ ఇస్తామని సోనియా గాంధీ ఇక్కడి నుంచే ప్రకటన చేశారు. తెలంగాణ బిల్లును ఆమోదింపజేయడంలో జైపాల్‌రెడ్డి కీలక పాత్ర పోషించారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే ఎంత దూరమైనా వెళ్తుంది. పొన్నం ప్రభాకర్‌ను ఎంపీగా గెలిపిస్తే తెలంగాణ రాష్ట్రం సాధించారు. బండి సంజయ్‌ను రెండుసార్లు పార్లమెంట్‌కు పంపిస్తే కేంద్ర మంత్రి అయ్యారు కానీ, కరీంనగర్ జిల్లాకు కేంద్రం నుంచి చిల్లిగవ్వ అయినా తెచ్చారా అని ప్రశ్నించారు. కరీంనగర్ అభివృద్ధి కోసం ఎప్పుడైనా పార్లమెంట్‌లో మాట్లాడారా?అంతకు ముందు 3 సార్లు భారాస ఎంపీలను గెలిపిస్తే వాళ్లు కూడా కరీంనగర్‌కు చేసిందేమీ లేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలోని ఏ రాష్ట్రం కూడా అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే 50వేల ఉద్యోగాలు ఇవ్వలేదు. 50వేల ఉద్యోగాలకు ఒక్కటి తగ్గినా ఎల్బీ స్టేడియం వేదికగా క్షమాపణ చెబుతానన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే భారాస నేతలు తట్టుకోలేక పోతున్నారు. ఈ ఏడాది తెలంగాణలో కోటి 53 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు పండించారు.. అది మా గొప్పతనం కాదా? రూ.1.83 లక్షల కోట్లు ప్రజాధనాన్ని ప్రాజెక్టుల కోసం కేసీఆర్ ఖర్చు పెట్టారు. రంగనాయకసాగర్ వద్ద హరీశ్‌రావు ఫామ్‌హౌస్ కట్టుకున్నారు. భూసేకరణ కోసం తీసుకున్న భూమిని హరీశ్‌రావు పేరు మీదకు రాయించుకున్నారు. భూ బదలాయింపులపై హరీశ్‌రావు లెక్క చెప్పాలి.. అన్ని లెక్కలు తీయిస్తున్నాం. కొండపోచమ్మ నుంచి కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు కాల్వ ద్వారా నేరుగా నీళ్లు వెళ్తున్నాయి. ప్రజలు అధికారం ఇస్తే ఇదేనా మీరు చేసింది? డ్రగ్స్ తీసుకున్న వారు ఇంట్లో దొరికితే కేసు పెట్టకూడదా? బావ తాగి తందనాలు ఆడితే.. కేటీఆర్ ఎలా సమర్థిస్తారు? విదేశీ మద్యంతో దొరికితే కేసు పెట్టకూడదా? చట్టం అందరికీ సమానమే కేటీఆర్ అని హెచ్చరించారు. కేటీఆర్ ఉరుకులాటలు గమనిస్తూనే ఉన్నా.. ఎంత దూరం ఉరుకుతారో నేనూ చూస్తా. భూ సేకరణపై కుట్ర చేసినందుకు కేటీఆర్ ఊచలు లెక్కపెడతారు. నా నియోజకవర్గంపై కేసీఆర్‌కు ఎందుకంత కక్ష? నేనేమీ లక్ష ఎకరాలు సేకరించలేదు. సేకరిస్తానన్నది 4 గ్రామాల్లో 1100 ఎకరాలు మాత్రమేనని అన్నారు. పరిశ్రమలు వస్తే మా పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని భూ సేకరణ చేస్తున్నాం. భూసేకరణకు అధికారులు వస్తే దాడి చేస్తారా? భూ సేకరణ చేయడం కేసీఆర్‌కు ఇష్టం లేదా? పరిశ్రమలు తెచ్చి మన పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వకూడదా? భారాస అధికారంలో ఉన్నప్పుడు భూములు సేకరించలేదా? అభివృద్ధి జరగాలంటే భూ సేకరణ జరగాల్సిందే. అభివృద్ధి కోసం ఎవరో ఒకరు భూమి కోల్పోవాల్సిందే. భూమి కోల్పోతున్న వారికి మూడు రెట్లు పరిహారం ఇవ్వాలని నిర్ణయించాం. చివరిగా చంద్రశేఖర్‌రావుకి ఒకటే చెబుతున్నా.. అసెంబ్లీకి రా.. సామి. 80వేల పుస్తకాలు ఏం చదివినవో మాట్లాడుదాం. ఒక్కసారి రా.. సామి.. వస్తే రోజంతా చర్చ చేద్దాం. అన్ని లెక్కలు తేలుద్దాం అని సీఎం అన్నారు. కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీదార్ బాబు, పొన్నం ప్రభాకర్,పొంగులేటి, కొండా సురేఖ, విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ ప్రజలు ఇచ్చిన విజయాన్ని ఎప్పుడు మరిచిపోను

అందించారని చెప్పారు. ఢిల్లీలో పరపతి పెరిగిందని.. కేంద్రం అన్ని విధాలుగా సహకరిస్తోందన్నారు. రాష్ట్రం ఇప్పుడిప్పుడే గాడిన పడుతోందన్నారు. 64 లక్షల మందికి పెన్షన్ అందిస్తున్నామని తెలిపారు. అధికారంలోకి రాగానే పెన్షన్లు రూ.4వేలకు పెంచామని చెప్పారు. విజయవాడ వరదల సమయంలో సీఎం సహాయనిధికి రూ.500 కోట్లు విరాళంగా వచ్చాయన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు, తప్పులు శాపాలుగా మారాయన్నారు. ఎంత తవ్వితే అన్ని తప్పులు బయటపడుతున్నాయన్నారు. వైసీపీ అప్పులతో ఏపీ వెంటిలేటర్‌పైకి వెళ్లిందని విమర్శించారు. వైసీపీ పాలనలో రూ.10 లక్షల కోట్లు అప్పులు చేశారని.. అప్పులపై లెక్కలతో సహా అసెంబ్లీలో చూపించామని అన్నారు. “వైసీపీ పాలనలో నా కుటుంబంపై ఆరోపణలు చేశారు. అధికారం కొత్త కాదు.. కేంద్ర రాజకీయాలు నాకు కొత్త కాదు. రాజకీయ జీవితంలో ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ చూడలేదు. కూడు, గూడు, గుడ్డ అనే నినాదంతో సంక్షేమం మొదలుపెట్టాం. రూ.30 తో మొదలైన పెన్షన్... ఇప్పుడు రూ.4 వేలు చేశాం” అని అన్నారు. పేదల కోసం అనేక సంస్కరణలు, పథకాలు తీసుకొచ్చామని వెల్లడించారు. సంక్షేమ పథకాలు ప్రారంభించిన ఘనత టీడీపీదే అని అన్నారు. పేదలకు పక్కా ఇళ్లు నిర్మించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. టీడీపీ పాలనలో 120 సంక్షేమ పథకాలు ప్రారంభించామని తెలిపారు. ఏపీలో సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం తనకు ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 150 రోజులు పూర్తి అయ్యిందని.. 150 రోజుల్లో తమ ప్రభుత్వం చేసిన పనులు చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రతిక్షణం ప్రజల కోసమే పరితపిస్తా అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో 101 అన్నా క్యాంటీన్‌లు ఉన్నాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని అన్నా క్యాంటీన్లు ప్రారంభిస్తామని సీఎం తెలిపారు. బెజవాడలో వరద సమయంలో రూ.500 కోట్ల విరాళాలు వచ్చాయని.. కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో ప్రజలు కూడా స్పందించారన్నారు. ఏపీలో బుక్ చేసుకున్న వారందరికీ గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం చెత్త పన్ను వేసింది కానీ.. చెత్త ఎత్తలేదని విమర్శించారు. ఏపీలో 83 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయిందని తెలిపారు. “మేం చెత్తపన్ను రద్దు చేశాం.. చెత్తను తీయిస్తున్నాం” అని తెలిపారు. అమరావతి కొనసాగి ఉంటే రాష్ట్రానికి ఆదాయం వచ్చేదని.. అయినా కూడా అమరావతికి పూర్వవైభవం తీసుకువస్తామని స్పష్టం చేశారు. పెట్టుబడులు ఆకర్షించడానికి చేయాల్సిన పనులు చేస్తున్నామన్నారు. వైసీపీ పాలనలో రోడ్లన్నీ గుంతలు పెట్టి వెళ్లారని మండిపడ్డారు. గ్రామాల్లో ఉండాలంటే ప్రజలకు కూడా విరక్తి పుట్టే పరిస్థితి వచ్చిందన్నారు. రోడ్ల గుంతలు పూడ్చడానికి రూ.860 కోట్లు విడుదల చేశామన్నారు. సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు తయారుచేస్తామని వెల్లడించారు. రోడ్ల నిర్మాణానికి వినూత్న ఆలోచనలతో ముందుకెళ్తున్నామన్నారు. రూ.75 వేల కోట్లతో ఏపీలో నేషనల్ హైవే పనులు జరుగుతున్నాయని.. రూ.30 నుంచి 40 వేల కోట్ల పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. అమరావతి రైల్వే లైన్‌కు కూడా కేంద్రం సహకరించిందని చెప్పుకొచ్చారు. ఇప్పటికే మెగా డీఎస్సీ ప్రకటించామని.. పరిశ్రమల కోసం 25 పాలసీలు తీసుకొచ్చామన్నారు. ఏపీలో రూ.85 వేల కోట్ల పెట్టుబడులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఎన్‌టీపీసీ, జెన్‌కో జాయింట్ వెంచర్‌తో విశాఖలో లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నారని.. రూ.65 వేల కోట్ల పెట్టుబడులతో రిలయన్స్ బయోగ్యాస్ రాబోతోందన్నారు. రిలయన్స్ బయోగ్యాస్‌తో రెండున్నర లక్షల మందికి ఉపాధి లభించే అవకాశం ఉందన్నారు. కరుడుగట్టిన నేరస్తులకు ఏపీలో స్థానం లేదన్నారు. ఆడబిడ్డల జోలికి వస్తే ఏం చేయాలో అది చేస్తామని.. ఆడబిడ్డల జోలికి వస్తే ఖబడ్దార్ అంటూ వార్నింగ్ ఇచ్చారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ వల్లే అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని.. నేరాలు చేస్తే తాట తీస్తామని, దోషులకు శిక్షల విషయంలో రాజీలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

# వ్యవసాయాభివృద్ధికి చేయూత

ధాన్యం కొనుగోలు విషయంలో రాజీలేదని గుర్తుచేశారు. అన్నదాతల సంక్షేమానికి పాటుపడుతున్న కాంగ్రెస్ సర్కార్‌కు రైతులందరూ అండగా ఉండాలని కోరారు. ఇకపోతే మత్స్యకారులకు ప్రభుత్వం అండగా ఉందన్నారు. మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. వారి సంక్షేమం కోసం రొయ్య పిల్లలు, చేప పిల్లల పంపిణీ పథకాన్ని అమలు చేస్తోందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేసిన విత్తనాలతో మత్స్యకారులు లబ్ది పొందుతున్నారని అన్నారు. ఈ రొయ్య పిల్లలు, చేప పిల్లలను పెంచుకొని వాటి వేట ఆధారంగా ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. ఇదిలావుంటే ఉమ్మడి జిల్లాలో ఈసారి విస్తారంగా పత్తి సాగైంది. ఇప్పుడిప్పుడే పంట చేతికి వస్తున్నది. నాలుగేళ్ల నుంచి రైతులు పత్తి సాగు విస్తీర్ణాన్ని పెంచుతూ వస్తున్నారు. గిట్టుబాటు ధరలు ఏటా పెరుగుతుండడంతో రైతులు ఈ పంటపై ఆసక్తి కనబరస్తున్నారు. సకాలంలో వర్షాలు కురవడం, భూగర్భ జలాలు పుష్కలంగా ఉండడంతో సాగుకు ఢోకా లేకుండాపోయింది. పత్తి సాగుకు తక్కువ పెట్టుబడులు అవుతుండడంతో రైతులూ ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేపడుతున్నారు. పత్తి తీత పనులు ప్రారంభం కావడంతో కూలీలకే కాదు ఆటోలు, ట్రాలీ యజమానులకూ గిరాకీ పెరిగింది. కూలీలు తీసిన పత్తిని రైతులు మార్కెట్లకు తరలిస్తున్నారు. ఆరు నెలల పాటు ఆటో, ట్రాలీ యజమానులకు డిమాండ్ ఉంటుంది. సబ్‌యార్డులు ఉన్న దూరాన్ని బట్టి ట్రాలీ యజమానులు చార్జీలు వసూలు చేస్తున్నారు. కూలీలకు ఉపాధి లభిస్తున్నది. గతేడాది కంటే ఈ సారి ధరలు తక్కువగా ఉన్నాయి. సుజాతనగర్, జూలూరుపాడు మార్కెట్లకు భారీగా పత్తి బస్తాలు తరలివస్తున్నాయి. క్రయ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మిల్లుల్లో యాజమాన్యాలు పత్తి ఆరబెట్టుకునేందుకు వీలుగా షెడ్లు ఏర్పాటు చేశారు. రైతుల కోసం తాగునీటి వసతి కల్పించారు. మద్దతు ధరకు మించి ట్రేడర్స్ ధరలు పెంచుతుండడంతో రైతులు సబ్‌మార్కెట్లలో పంటను విక్రయిస్తున్నారు. నాలుగు చోట్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ రైతులు బయట మార్కెట్‌కే మొగ్గు చూపుతున్నారు.రైతులు కూలీలకు కిలోల చొప్పున లెక్కగట్టి కూలి చెల్లిస్తున్నారు. ఒక్కో కూలీ రోజుకు రూ.500 నుంచి రూ.700 వరకు సంపాదిస్తున్నారు. సబ్‌యార్డుల్లో పత్తి లోడింగ్ చేసే కూలీలు రోజుకు రూ.వెయ్యి వరకు కూలి పొందుతున్నారు. ఒక్కో సబ్‌యార్డులో వందలాది మంది పనిచేస్తున్నారు.

# గద్దెనెక్కేందుకు ఇష్టారీతిన హామీలు

ఎక్స్ వేదికగా స్పందించారు. గద్దెనెక్కడం కోసం అడ్డగోలుగా గ్యారెంటీలు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీకి పరిపాటిగా మారిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. చేతికందినన్ని అప్పులు చేయడం.. ఆఖరికి ఉన్న ఆస్తులు జప్తు చేయించుకునే పరిస్థితికి రావడం దారుణమన్నారు. ఇది ఏ జూదగాని ఇంటి కథ కాదు.. సాక్షాత్తు హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వ తీరు అని కేటీఆర్ పేర్కొన్నారు. గ్యారెంటీలు అమలు చేయలేక, గంజాయి కూడా అమ్మకునే పరిస్థితి మొన్న! మీరు చెల్లించాల్సిన అప్పు తేల్చకపోతే, ఢిల్లీలో మీ హిమాచల్ భవన్‌ను జప్తు చేస్తాం అని హైకోర్టు నేడు తీర్పునిచ్చింది. ఎంత సిగ్గుచేటు? అని కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలను నడపడానికి బదులుగా సర్కస్‌లను నడుపుతుందన్నారు. మరి తెలంగాణలో మీరు ఆరు గ్యారెంటీలను అమలు చేయడానికి మీరు ఏం విక్రయిస్తారని రాహుల్ గాంధీని కేటీఆర్ ప్రశ్నించారు.

# రాబోయే వారం రోజులపాటు ఎముకలు కొరికే చలి

దీంతో ఉదయం పూట మార్నింగ్ వాకర్స్, ఇంటి నుంచి బయటకి వెళ్లే ఉద్యోగస్తులు వణికిపోతున్నారు. హైదరాబాద్ నగర శివారులోని ఇబ్రహీంపట్నంలో రికార్డ్ స్థాయిలో 11.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాజేంద్రనగర్‌లో 12.4, %దీఎజూ%లో 12.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వచ్చే వారం రోజుల్లో చలి తీవ్ర మరింత పెరిగే ఛాన్స్ ఉందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరించడంతో జనం వణికిపోతున్నారు. ఎముకలు కొరికే చలితో నరకం చూడటం గ్యారంటీ అని బెంబేలెత్తిపోతున్నారు. హైదరాబాద్‌తో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు తగ్గాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. అటు దక్షిణ తెలంగాణలో సాధారణ కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో చలి పులి వణికిస్తుంది. సింగిల్ డిజిట్‌కు పడిపోయింది ఉష్ణోగ్రత. కొమురంభీం జిల్లా సిర్పూర్ యులో రికార్డ్ స్థాయిలో 9.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు అయింది. గిన్నెదరి 10.3 , తిర్యాణి 10.8, కెరమెరి 12.3, వాంకిడి 12.5, ఆసిఫాబాద్ 12.7 , జైనూర్ 13.7 గా ఉష్ణోగ్రత నమోదయ్యింది. మంచిర్యాల జిల్లా జన్నారంలో 13.5, ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ 11.5, బేల 11.9, చాప్రాల 12.1, అర్లి టి 12.1 సెంటిగ్రేట్ ఉష్ణోగ్రత నమోదయింది. మరోవైపు శీతాకాలంలో సీజనల్ వ్యాధులు చుట్టుముడతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వింటర్‌లో శ్వాసకి సంబంధించిన సమస్యలు ఉక్కిరిబిక్కిరి చేస్తాయని హెచ్చరిస్తున్నారు. వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని, హెల్తీ ఫుడ్ తీసుకోవాలని సూచిస్తున్నారు. వారం రోజుల పాటు చలి తీవ్రత పెరిగే అవకాశం ఉండటంతో ఇటు హైదరాబాద్‌వాసులతో పాటు ఉత్తర తెలంగాణ ప్రజలు వణికిపోతున్నారు. సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉండటంతో భయంతో బెంబేలెత్తిపోతున్నారు.

# యాదాద్రి ఆలయ గోపురాలు స్వర్ణమయం..

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని సీఎం కేసీఆర్ చరిత్రలో నిలిచి పోయేలా పునర్నిర్మాణం చేపట్టారు. మహా కుంభ సంప్రోక్షణ తర్వాత సీఎం కేసీఆర్ లక్ష్మీ నరసింహస్వామి దివ్య విమాన గోపురాన్ని125 కిలోల స్వచ్ఛమైన బంగారంతో తాపడం చేయాలని, అందుకు భక్తులందరిని భాగస్వామ్యం భావించారు. మహా కుంభ సంప్రోక్షణ తేదీ ప్రకటించిన రోజే మాజీ సీఎం కేసీఆర్ సహా 22 కిలోల బంగారం ఇచ్చే దాతల వివరాలు ప్రకటించారు. యాదగిరి గుట్ట లక్ష్మీ నరసింహస్వామి వారి దివ్య విమాన గోపురాన్ని బంగారు తాపడం కోసం మొదటగా తన కుటుంబం నుంచి కిలో 16 తులాల బంగారం విరాళంగా ప్రకటించారు. కుటుంబంతో కలిసి వచ్చిన కేసీఆర్ కిలో 16 తులాల బంగారాన్ని స్వామివారికి విరాళంగా అందజేశారు. ప్రధాన ఆలయ దివ్య గోపురం స్వర్ణ తాపడానికి మొత్తం 127 కిలోల బంగారు తాపడం కోసం రూ.65 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. స్వర్ణ తాపడానికి ఆశించినట్లుగా దాతల నుంచి స్పందన రాలేదు. దాతల నుంచి విరాళాల ద్వారా పదకొండు కిలోల బంగారం, రూ.20 కోట్ల నగదు సమకూరింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ.. ఆలయ అధికారులతో స్వర్ణ తాపడంపై సమీక్షించారు. ఆలయ హుండీల ద్వారా వచ్చిన 1300 కిలోల వెండి, నగల రూపంలో వచ్చిన బంగారాన్ని విమాన గోపురం తయారీకి వినియోగించింది. చెన్నైలోని స్మార్ట్ క్రియేషన్స్ సంస్థకు స్వర్ణ తాపడం పనులను అప్పగించారు. స్వర్ణ తాపడం కూలి పనులకు అవసరమైన ఏడు కోట్ల మొత్తాన్ని దేవస్థానం చెల్లిస్తుంది. దివ్య విమాన గోపురానికి అమర్చే బంగారు రేకులను చెన్నై నుంచి ఆలయానికి తరలించారు. బంగారు రేకులను ప్రధాన ఆలయంలో అర్చకులు, అధికారులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ గోపురానికి బంగారు రేకులు అమర్చే పనులను ప్రారంభించారు.

# తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు

ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాజధాని చెన్నై సహా తూత్తుకుడి, తిరునల్వేలి, తిరువావూరు, నాగపట్నం, కరైకల్ సహా పలు జిల్లాల్లో రాత్రి నుంచి ఎడతెరిపిలేని భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందు జాగ్రత్త చర్యగా ఐదు జిల్లాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించింది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా.. రామనాథపురం, తూత్తుకుడి, తిరునల్వేలి, తెన్కాసి, తిరువారూరు జిల్లాల్లో ఈరోజు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. మరోవైపు కన్యాకుమారి జిల్లాలోని కన్యాకుమారి, పేచిపరై ప్రాంతాల్లోనూ విద్యా సంస్థలకు అధికారులు సెలవు ప్రకటించారు. కరైకల్‌లో పాఠశాలలు, కళాశాలలను మూసివేశారు. తూత్తుకుడిలో మాత్రం కేవలం స్కూల్స్‌కు మాత్రమే సెలవు ఇచ్చారు. కళాశాలలు యథావిధిగా కొనసాగనున్నాయి.

# దేవునిపల్లి లక్ష్మి నరసింహ స్వామీ రథోత్సవంలో పాల్గొని

## ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే విజయరమణ రావు







**పెద్దపల్లి, నవంబర్ 20( ది క్రైమ్ న్యూస్ ):** పెద్దపల్లి మండలం, దేవునిపల్లి గ్రామంలో సుప్రసిద్ధమైన శ్రీ లక్ష్మి నరసింహ స్వామీ వారి రథోత్సవం మరియు జాతర మహోత్సవంలో పాల్గొని కోరిన కోర్కెలు తీర్చే లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయంలో స్థానిక పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే కి ఆలయ అర్చకులు, గ్రామస్తులు పూర్ణ కుంభంతో ఘనంగా స్వాగతం పలికారు.. తదుపరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయంలో ఆలయ అర్చకులు వేదమంత్రాల సాక్షిగా ఎమ్మెల్యే ని ఆశీర్వదించారు. తదుపరి ఎమ్మెల్యే విజయరమణ రావు కి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ, ఆలయ అర్చకులు, ఆలయ డైరెక్టర్లు, కమిటీ సభ్యులు, బొక్కల సంతోష్, తలారి సాగర్, శ్రీపతి సుమన్, మాజీ సర్పంచులు, గంట రమేష్, అదేపు వెంకటేష్, పెద్దపల్లి పట్టణ కౌన్సిలర్లు, నూగుళ్ళ మల్లయ్య, బూతగడ్డ సంపత్, బోడ్డుపల్లి శ్రీనివాస్, చిటి అశోక్, గొడ్డేటి రాజయ్య, చంద్రయ్య, గౌస్, గట్టయ్య, వెంకటేష్, అనిల్, కుమార్, భక్తులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# డంపర్ ఆపరేటర్లను పట్టించుకునే నాదులేరి ?

**- ఆర్జి రీజియన్ డి గ్రేడ్ ఈపి ఆపరేటర్ల ఆవేదన - ఆర్జీత్రీ, ఓసి టులో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన**

**- టోటల్ ఉత్పత్తిలో సింహభాగం మా శ్రమే - ఈ స్ట్రక్చర్ సమావేశాల్లో బ్యాక్ డేట్ తో సీ గ్రేడ్ ఇవ్వాలి**



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)నవంబర్ 20:** సింగరేణి ఉత్పత్తి ఉత్పాదకత సాధించడంలో డంపర్ ఆపరేటర్లుగా రాత్రింబవళ్లు అహర్నిశలు శ్రమిస్తు , నాలుగేళ్లుగా సీ గ్రేడ్ ఇవ్వాలని కాళ్లు అరిగేలా తిరుగుతున్నప్పటికీ రామగుండం రీజియన్ డి గ్రేడ్ ఆపరేటర్లను పట్టించుకునే నాధుడే కరువయ్యారని డి గ్రేడ్ ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆర్ జి త్రీ ఏరియాలోని ఓసీ టు గనిలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఆపరేటర్లు తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం డి గ్రేడ్ ఆపరేటర్లు మాట్లాడుతూ సింగరేణి చరిత్రలోనే డీ గ్రేడ్ ఆపరేటర్లకు సీ గ్రేడ్ పొందడంలో ఇంతటి జాప్యం జరిగిన సందర్భాలు లేవని వారు స్పష్టం చేశారు. ప్రస్తుతం అనగా మొన్నటి సెప్టెంబర్ నుండి మేము బి గ్రేడ్ లో ఉండాల్సిన వాళ్ళము కానీ కనీసం సీ గ్రేడు రాక తీవ్రమైన అన్యాయానికి , శ్రమ దోపిడీకి గురవుతున్నామని వారు నిట్టూర్చారు. గత నాలుగేళ్లుగా కార్మిక సంఘాల చుట్టూ, యాజమాన్యం చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నప్పటికీ రేపు, మాపు అంటూ తిప్పించుకుంటున్నారు. తప్ప మాకు న్యాయం చేయడం లేదన్నారు. సంస్థ వ్యాపతంగా అన్ని ఏరియాలలో మాకంటే తర్వాత రిక్రూట్ అయిన వాళ్లకు నిర్దేశించిన సమయానికి సీ గ్రేడ్ ప్రమోషన్ వచ్చిందన్నారు.సింగరేణి నిర్దేశించిన టోటల్ ఉత్పత్తిలో సింహభాగం ఉత్పత్తినీ సాధిస్తున్నది రామగుండం రీజియన్ ఆపరేటర్లేనని,అలాంటి మాపైన సింగరేణి యాజమాన్యం ఎందుకు సవితి తల్లి ప్రేమను కనబరుస్తుందో అర్థం కావడం లేదన్నారు. గతంలో ఆలస్యమైన ఆపరేటర్లకు బ్యాక్ డేట్ తో సీ గ్రేడ్ ప్రమోషన్లు ఇచ్చినందున మాకు కూడా 2021 సెప్టెంబర్ మాసం నుండే సీ గ్రేడ్ ప్రమోషన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బ్యాక్ డేట్ తో సీ గ్రేడ్ ఇవ్వకుంటే భవిష్యత్తులో బి గ్రేడ్ కోసం మరిన్ని సంవత్సరాలు కాలయాపన జరిగి మరో మారు తీవ్రమైన నష్టానికి , అన్యాయానికి గురికావాల్సి వస్తుందని వారు స్పష్టం చేశారు. సింగరేణి యాజమాన్యం పైన, గుర్తింపు సంఘం పైన పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా రేపటి స్ట్రక్చర్ సమావేశాల్లో బ్యాక్ డేట్ తో సీ గ్రేడ్ ఇవ్వాలని మరో మారు వారు విజ్ఞప్తి చేశారు. అటుగ వచ్చిన గుర్తింపు సంఘం ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ ఎం ఆర్సి రెడ్డి, ఐ ఎన్ టి యు సి ఫిట్ సెక్రటరీ మనోహర్ పాల్గొని ప్రసంగించగా ఈ కార్యక్రమంలో ఆపరేటర్ ప్రతినిధులు బుడిగే క్రాంతి కుమార్, పూజారి కిరణ్, చంద్రమౌళి, సంజీవ్, అజీజ్, శ్రీనివాసరావు, అశోక్, రాజశేఖర్, రాజకుమార్, షా, సత్తయ్య, రమేష్, రాజులు పాల్గొన్నారు.

# విద్యుత్ లైన్‌ల క్రింద పంట అవశేషాలకు నిప్పు పెట్టవద్దు

**- పవర్ గ్రిడ్ ఇంజనీర్ గౌతమ్**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** 400కేవి విద్యుత్ లైన్‌ల క్రింద మంటలు పెడితే పెను ప్రమాదం సంభవిస్తుందని, హై టెన్షన్ విద్యుత్ లైన్ల క్రింద ఉన్న పంట పొలాలలో పంట అవశేషాలకు నిప్పు పెట్టవద్దని పవర్ గ్రిడ్ చీఫ్ ఇంజనీర్ గౌతమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరిధిలోని 400 కేవి విద్యుత్ లైన్ ల క్రింద పంట అవశేషాలను తగలబెట్టవద్దని, పంట అవశేషాలు కాల్చే సమయంలో మంటలు చెలరేగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని అన్నారు. పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, రామగిరి, శ్రీరాంపూర్, సుల్తానాబాద్, పెద్దపల్లి, ఓదెల, పాలకుర్తి, ముత్తారం, మంథని, కమాన్ పూర్, ఎలిగేడు మండలాల్లో చాలా గ్రామాలలో 400 కేవీ విద్యుత్ లైన్ల క్రింద పంట సాగు ఎక్కువగా ఉందని తెలిపారు.పంట అవశేషాలను విద్యుత్ లైన్ ల క్రింద తగలబెట్టడం వల్ల విద్యుత్ సరఫరా అంతరాయంతో పాటు జంతువులు, మానవులకు హాని జరిగే అవకాశం ఉందని, రైతులు ఈ విషయాన్ని గమనించి పంట అవశేషాలను విద్యుత్ లైన్ ల క్రింద తగలబెట్టడం మానుకోవాలని గౌతమ్ ప్రకటనలో పేర్కొన్నారు.

# చిన్నారి గుండెకు చేయూతనివ్వండి



**రామగిరి(ది క్రైమ్ న్యూస్), నవంబర్ 20:** రామగిరి మండలం నవాబ్ పేట్ గ్రామానికి చెందిన ఈ అమ్మాయి కట్ట నరేందర్ అనే ప్రైవేట్ డ్రైవర్ కుమార్తె. ఈ అమ్మాయి గుండెకు రంధ్రం పడి ప్రస్తుతం అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. డ్రైవర్ గా పని చేస్తున్న కట్ట నరేందర్ కు ఆక్సిడెంట్ అయి నాలుగు నెలలుగా డ్యూటీకి వెళ్లడం లేదు. ప్రస్తుతం వారు దారి ఖర్చులకు కూడా ఇబ్బంది పడుతున్న పరిస్థితి. అందుకే దాతల సహకారం కోసం ఫోన్ పే,గూగుల్ పే : 9705772225 కు ఆర్థిక సహాయం చేసి మంచి మనుసుతో అమ్మాయి ప్రాణం నిలబెట్టగలరని కట్ట నరేందర్ అర్థిస్తున్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్వాగతం పలికిన ఎమ్మెల్యే కవ్వంపల్లి





**మానకొండూర్(ది క్రైం న్యూస్):** వేములవాడ పర్యటనకు బుధవారం విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖామంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి తోపాటు ముఖ్య నాయకులతో కలిసి మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ జితేందర్‌లతో కలసిరాజన్నసిరిసిల్లజిల్లాకేంద్రంలోనూతనంగాఏర్పాటుచేసినజిల్లాపోలీస్‌కార్యాలయప్రారంభోత్సవం లో పాల్గొని ఎస్పీ అఖిల్ మహజన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

## జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన నల్లవెల్లి ఆనంది



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)నవంబర్ 20:** కమాన్ పూర్ మండల కేంద్రం కు చెందిన నల్లవెల్లి ఆనంది 400 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం రోజున హనుమకొండలోని జేఎన్ఎం స్టేడియం లో జరిగిన 68వ రాష్ట్రస్థాయి 16 సంవత్సరాల విభాగంలోని 400 మీటర్స్ లో బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన నల్లవెల్లి ఆనంది ఆదిలాబాద్ జిల్లా స్పోర్ట్స్ స్కూల్లో పదో తరగతి చదువుతున్న నల్లబెల్లి ఆనంది ఈ నెలలో లక్నోలో జరిగే ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొన నుంది. ఈ సందర్భంగా కోచ్ రమేష్ ఆమెను అభినందించారు.

# విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

**-ఎన్ పి డి సి ఎల్ మంథని డి ఈ వి. ప్రభాకర్**



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)నవంబర్ 20:** విద్యుత్ సౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎన్ పి డి సి ఎల్ మంథని డి ఈ వి ప్రభాకర్ అన్నారు. బుధవారం కమాన్ పూర్ మండలంలోని గుండారంతో పాటు కమాన్ పూర్ రాజాపూర్ గ్రామాల్లో ప్రతి ఇంటి ఇంటికి తిరుగుతూ విద్యుత్ మీటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యుత్ పొదుపుగా వాడుకోవాలని కోరారు. విద్యుత్ బిల్లులు డిజిటల్ ద్వారా పేమెంట్లు చేయాలని అన్నారు. బిల్లులో పెండింగ్ లేకుండా వెంట వెంట చెల్లించాలని సంస్థకు చేయూతనివ్వాలని కోరారు. అలాగే సుమారు 3000 విద్యుత్ మీటర్లను పరిశీలించడం జరిగింది. విద్యుత్ చౌర్యంకేసులు నమోదైనట్లు డిఈ ప్రభాకర్ తెలిపారు. ఆయన వెంట పెద్దపల్లి డిఇ రవి, మంథని ఏడి కనకయ్య, గోదావరిఖని ఏడి శ్రీనివాస్, రామగుండం ఏడి రమేష్, డిపి ఏడి చంద్రవర్ధన్, డిపిఏడి విజయకుమార్, సబ్టేషన్ ఏ ఈ అశోక్, సబ్ ఇంజనీర్ శ్రవణ్ సీనియర్ ఎల్ ఐ అశోక్ ఎల్ ఐ కృష్ణ, ఓ సత్యనారాయణ రావు, లైన్ మెన్లు ఓదేలు నాగరాజు శ్రీధర్ ఏ ఎల్ ఎం లు కుమార్, శ్రీనివాస్, గోస్కుల చంద్రమౌళి, ధరమ్ సింగ్, ఆపరేటర్ పెరటి రఘుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లి వేడుకల్లో పాల్గొన్న మంత్రి సోదరుడు శీనుబాబు



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)నవంబర్ 20:** రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోదరుడు శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుదిల్ల శీను బాబు కమాన్ పూర్ మండలంలోని పలు గ్రామాల్లో పెళ్లి వేడుకల్లో పాల్గొన్నారు. కమాన్ పూర్ మండలంలోని గుండారం గ్రామంలో పిడుగు అఖిల సాయి గణేష్ కమాన్ పూర్‌లోని కిష్టం పల్లిలో కడారి సత్తయ్య కుమార్తె వివాహనికి హాజరయ్యారు. అలాగే రొంపి కుంటకు చెందిన వివాహము సెంటినరీ కాలనీలో జరగగా కోల శ్రవణ్ గౌడ్ సుష్మల వివాహానికి హాజరయ్యారు. ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, కమాన్ పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైనాల రాజు, సింగల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు, తాజా మాజీ సర్పంచులు ఆకుల ఓదెలు, కటకం రవీందర్, తోగరి అన్నపూర్ణ అశోక్, నాయకులు బర్ల శ్రీనివాస్, రంగు సత్యం, కుక్క రవి కొలిపాక రాజన్న, పిడుగు శంకర్, వడ్లకొండ మల్లేష్, వడ్లకొండ శంకర్, రాజు రెబల్ , ఆరెల్ల కిరణ్ గౌడ్, పెండ్యాల రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిని సందర్శిస్తూ పక్కాగా సమగ్ర సర్వే

**- సీపీవో రవీందర్, ఎంపీడీఓ శైలజ రాణి**

**రామగిరి(ది క్రైమ్ న్యూస్)నవంబర్ 20:** రామగిరి మండలం బేగంపేట గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న సమగ్ర సర్వేను దేశంలోనే ప్రథమంగా చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రజలను చైతన్యం చేస్తూ ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను నమోదు చేయాలని పూర్తి జాగ్రత్తతో పక్కాగా నిర్వహించాలని సీపీవో రవీందర్, రామగిరి మండల ఎంపీడీఓ శైలజ రాణి సూచించారు. బుక్ లేట్ లో ఎన్యుమరేటర్లు సేకరించి నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. సర్వేకు వచ్చే ఎన్యుమరేటర్లకు తమకు కేటాయించిన ఇండ్లను సందర్శించి ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా పకడ్బందీగా సర్వే జరపాలన్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన అనంతరం సీపీవో రవీందర్, రామగిరి మండల ఎంపీడీఓ శైలజ రాణి మాట్లాడారు. ఇలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వేలో ఏ ఒక్క ఇంటిని కూడా వదలకుండా ఎక్కడుంటే అక్కడే వివరాలు నమోదు చేయాలని సూచించారు. నియమించిన ప్రత్యేక అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో తిరగాలని అనంతరం సమగ్ర సర్వేలో వివరాలను పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా పొందుపరచాలని సీపీవో రవీందర్, రామగిరి మండల ఎంపీడీఓ శైలజ రాణి ఎన్యుమరేటర్లకు తగు సూచనలు జారీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామగిరి మండల ఎంపిడిఓ శైలజా రాణి, ఎంపీఎస్వో శైలజ, సూపర్ వైజర్ శారద, పంచాయతీ కార్యదర్శి రత్నా కర్, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.



# సంపాదకీయం

## ధాన్యం సేకరణలో ఏటా దగా !

ఏటా ధాన్యం అమ్మకాల్లో రైతులు నానా యాతన పడుతున్నారు. మద్దతు ధరలను మిల్లర్లు మింగేస్తున్నారు. దళారులు దగా చేస్తున్నారు. మార్కెట్ కమిటీలు ఉత్సవ విగ్రహాలుగా మారాయి. ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయి. దీంతో అన్నదాతలు అష్టకష్టాలు పడి పండించిన పంటలను అమ్ముకోవడంలో నానా కష్టాలు పడుతున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదు. ఏ ప్రభుత్వం వచ్చినా హడావిడి చేస్తోందే తప్ప రైతులకు అండగా నిలబడి ధాన్యం కొనేలా చేయలేకపోతోంది. కేంద్రం ఏనాడు కూడా సక్రమంగా ధాన్యం కొనేగోళ్లకు సంబంధించిన విషయాన్ని పట్టించుకోవడం లేదు. ఇకపోతే అన్నదాతల అవసరాలు, అమాయ కత్వాన్ని ఆసరాగా చేసుకొని దళారులు అందినకాడికి దండుకోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. పంటల సాగు విస్తీర్ణం, దిగుబడి అంచనా అధికారులకు ముందే తెలిసినా.. ముందుచూపు లేకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తుంది. పంట వేసిన తర్వాత సుమారు 3, 4 నెలల పాటు సమయం ఉంటుంది. కాని ఏటా పంట కొనుగోళ్లలో జాప్యం జరుగుతూనే ఉంది. ముందుచూపుతో పంట చేతికొచ్చే సమయానికే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే రైతులు నష్టపోయే అవకాశం ఉండదు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించినా.. ఎలాంటి ప్రయోజనం ఉండదని రైతులు అంటున్నారు. దీనిని పాలకులు చోద్యంగా చూస్తున్నారు. పాలకులు తమ రాజకీయ విన్యాసాలకు ప్రజలను ఎలా మోసం చేస్తారో స్పష్టంగా కనిపిస్తోంది.తెలంగాణలో జిల్లాకో ఇద్దరు ముగ్గురు మంత్రులు ఉన్నా ఇదే దుస్థితి నెలకొంది. ఎపిలోనూ ధాన్యం మద్దతు ధరల కోసం రైతులు అగచాట్లు పడుతున్నారు. తేమ ఉందనో తాలు ఉందనో ఇబ్బందులు పెడుతున్నారు. దడవాయి లాంటి పద్ధతి ఇక మరింత కృంగదీస్తోంది.ఇలా ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు ఎప్పుడూ అన్యాయమే జరుగుతోంది. ఏటా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పంటలు చేతికి వచ్చినా సజావుగా కొనుగోళ్లు జరుగుతాయన్న భరోసా లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ధాన్యం కొనుగోళ్లు జరపాలని అప్పుడే అక్కడక్కడా ఆందోళనలు చేస్తున్నారు. మార్కెట్ కమిటీలు సక్రమంగా వ్యవహరిస్తే ఇలాంటి పరిస్థితి రాదు. కానీ ధాన్యం కొనుగోళ్లపై మాటలే తప్ప స్పష్టత ఇవ్వడం లేదు. పైకి మాత్రం ఆదేశాలు వచ్చాయని హడావిడి చేస్తున్నారు. రాజకీయపార్టీల బలాబలాల ప్రదర్శనగా రైతుల సమస్యలు ఉన్నాయి. వారికి అండగా ఉంటామన్న మాటలే తప్ప చేతల్లో కానరావడం లేదు. ఇప్పుడు ధాన్యం సేకరణ విషయంలో రైతులకు మద్దతుగా బిఆర్ఎస్ ఆందోళనలకు దిగింది. అయినా మార్పు లేదు. గతంలో జాతీయ ధాన్యం సేకరణ విధానం కోసం రైతులు చేసిన పోరాటం కేంద్రంపై రాజకీయ పోరాటంగానే బిజెపి భావించింది. అయినా ధాన్యం సేకరణలో ఓ జాతీయ విధానం అన్నది నేటికీ రూపుదాల్చలేదు. కనీసం వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో అయినా ధాన్యం సేకరణపై స్పష్టమైన విధానాలు అవలంబించేలా చర్యలకు డిమాండ్ చేయాలి. ఒక్క ధాన్యం కొనుగేళ్లే కాదు.. అనేకానేక విషయాల్లో కేంద్రాన్ని నిలదీయాల్సిందే. దేశంలో ప్రధాని మోడీ విధానాల కారణంగా ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. బతకడానికే కష్టపడుతున్నారు. ధాన్యం దిగుబడులు పెరుగుతున్నా ప్రజలకు ఆహారభద్రత దక్కడంలేదు. దేశంలో నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరగుతున్నాయి. ఇటీవల బియ్యం ధరలు మళ్లీ పెరిగాయి. సన్నబియ్యం ధరలు ఏకంగా 68కి చేరువయ్యాయి. పెట్రో, డీజిల్, గ్యాస్ ధరలతో మొత్తంగా అన్ని సరకుల ధరలు పెరిగి సామాన్యులు నానాయాతనలు పడుతున్నారు.నిజానికి వ్యవసాయంపై జాతీయ విధానం రావాల్సిందే. ధాన్యం కొనుగోళ్లలో పారదర్శక విధానం రావాలి. వ్యాయసాయ దిగుమతలను తగ్గించుకుని..ఎగుమతులను పెంచుకోవాలి. వంటనూనెలను దిగుమతిని ఆపేయాలి. దేశీయంగా నూనె గింజల ఉత్పత్తికి ప్రోత్సాహం ఇవ్వాల్సిందే. ఇవన్నీ చర్చించడానికి కేంద్రం పై అన్ని రాష్ట్రాలు కలసి ఒత్తిడి తేవాలి. జాతీయ పంటల విధానం కోసం పోరాడాలి. అన్ని రాష్ట్రాల్లో ఏకాభిప్రాయం రావాలి. కానీ అలా జగరడం లేదు. ఎవరి రాజకీయ ప్రయోజనాలు వారు చూసుకుంటు న్నారే తప్ప ప్రజలను పట్టించు కోవడం లేదు. పంజాబ్‌లో ధాన్యాన్ని కొనుగోలు చేసిన తరహాలోనే దేశమంతటా ఒకే విధానాన్ని అమలు చేస్తున్నామని కేంద్రం తెలిపింది. అయితే ఇందులో ఎవరిది తప్పు..ఎవరిది కరెక్ట్ అన్నది తేల్చాలి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ నేటిదాకా ఒకే విధానం అమల్లో ఉండడం వల్ల ధాన్యం సేకరణలో మార్పులు చోటు చేసుకోవడం లేదు. రాష్ట్రాలుతమ అవసరాలకు వినియోగించుకోగా మిగిలిన బియ్యాన్ని సెంట్రల్ పూల్ కింద ఎఫ్‌సీఐకి అప్పగిస్తున్నాయని కేంద్ర అధికారులు చెబుతున్నారు. జాతీయవిధానం కావాలంటే అందుకు ప్రత్యామ్నాయంగా ఆయా రాష్ట్రాలను కలుపుకుని పోరాడాలి. వరి కొనుగోళ్ల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విమర్శల పర్వం ఇకముందు తగదు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం ఒక స్పష్టమైన వైఖరి తీసుకొని.. రైతులకు భరోసా కల్పించాలి. అనేకచోట్ల మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు వరికి ప్రత్యామ్నాయ పంటలను కూడా సాగు చేస్తున్నారు. పలు జిల్లాల్లో భారీగా ఆరుతడి పంటలను ఎక్కువగా సాగు చేశారు. ఇందులో ప్రధానంగా జొన్న, మొక్క జొన్న, శనగ, పత్తి తదితర పంటలు సాగయ్యాయి. ఈసారి వాతావరణ పరిస్థితులు అనుకూలించడం, సరిపడా నీటితడులు అందడంతో దిగు బడులు ఆశాజనకంగానే కనిపిస్తున్నాయి. ప్రతీసారి కొనుగోళ్ల పక్రియ ఆలస్యం కావడంతో సగంపంట దళారుల పాలవుతూనే ఉంది. ఈసారి కూడా అవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సగం పంట అమ్మిన తర్వాత ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉండదు. . ఇప్పటికే పంట నూర్పిడి చేసిన రైతులు.. బయట మార్కెట్‌లో దళారులను ఆశ్రయించి దిగుబడులను అమ్మేసుకుంటున్నారు. దళారులు ఇంటికే వచ్చి రైతులను మభ్యపెడుతూ తక్కువ ధరకే పంటను కొనుగోలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చివరి నిముషంలో కొనుగోళ్లు చేపట్టడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇకనైనా సకాలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, ధాన్యం సేకరణపై స్పష్టమైన విధానం అవలంబించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

## ఎనిమిదవ రోజుకు చేరిన ఏపీ అసెంబ్లీ సమావేశాలు




### ప్రశ్నోత్తరాల సమయంలో అయోమయం

అమరావతి : ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఎనిమిదవ రోజుకు చేరుకున్నాయి. సభ మొదలవగానే స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాలు చేపట్టారు. అయితే ప్రశ్నోత్తరాల విషయంలో సభలో అయోమయం నెలకొంది. ఒక శాఖకు సంబంధించిన ప్రశ్నలు వేరే శాఖలకు వెళ్లడంపై స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఉభయసభల్లో మంత్రికి ఒకే ప్రశ్న రావడంపైనా మండిపడ్డారు స్పీకర్. ఈ అయోమయానికి కారణం అధికారుల నిర్లక్షమే స్పీకర్ ఆగ్రహించారు. అధికారులు తమ శాఖకు వచ్చిన ప్రశ్నలను వేరే శాఖలకు ఎలా పంపుతారంటూ స్పీకర్ ప్రశ్నించారు. ఇళ్ళ స్థలాల, ఇళ్లు పంపిణీకి సంబంధించిన ప్రశ్న రెవెన్యూకు ఎలా వేస్తారని స్పీకర్ అడిగారు. అధికారులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అలాగే గోదావరి పుష్కరాల పనులు విషయంలో జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడుకు ప్రశ్న వెళ్లింది. ఇదే సమయంలో మండలిలో గాలేరు నగరి, హంద్రీనీవా అనుసంధాన ప్రాజెక్టుపై ప్రశ్న ఇచ్చారు. దీనిపైనా స్పీకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒకే మంత్రికి ఉభయసభల్లో ఎలా ప్రశ్న వేస్తారనే క్వశ్చన్ చేశారు. ఉభయ సభల్లో మంత్రికి ఒకే సమయంలో ప్రశ్న రావడంపై విస్మయం వ్యక్తం చేశారు. అధికారుల పనితీరుతో ప్రశ్నత్తరాల సమయంలో సభలో కాసేపు అయోమయ పరిస్థితి నెలకొంది. కాగా.. శాసనసభ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగే ప్రశ్నలకు మంత్రులు సమాధానం ఇవ్వనున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మృతిపై సంతాప తీర్మానం చేయనున్నారు. రూల్ 344 కింద కూటమి ప్రభుత్వం 150 రోజుల పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై శాసన సభలో చర్చించనున్నారు. ఈరోజు సభలో పలు బిల్లులను కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నారు. విశాఖ రుషికొండపై నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలపై స్వల్పకాలిక చర్చ జరుగనుంది. అలాగే నూతన మద్యం పాలసీపై సభలో మంత్రి కొల్లు రవీంద్ర స్టేట్‌మెంట్ ఇవ్వనున్నారు.

## భవిష్యత్ ఎజెండా సిపిఎస్ రద్దు

### ప్రధాన అంశంగా లెఫ్ట్ పార్టీల గుర్తింపు

న్యూఢిల్లీ : సిపిఎస్ రద్దు ఇప్పుడు ఎన్నికల ఎజెండాగా మారింది. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలకు లెఫ్ట్ పార్టీలతో పాటు అన్ని వర్గాలు మద్దతుగా నిలుస్తున్నాయి. మహారాష్ట్ర, జార్ఖండ్‌లో కూడా దీని ప్రభావం కనిపిస్తోంది. ఈ క్రమంలో ఉద్యోగులు ఎవరివైపు మొగ్గు చూపుతారన్న ఆసక్తి పెరిగింది. ఈ రెండు రాష్ట్రాల్లో సిపిఎస్ రద్దు అంశాన్ని ఎజెండా పైకి తెచ్చారు. ఇక్కడ బిజెపి ఓటమి పాలైతే సిపిఎస్ రద్దుకు సానుకూల పరిస్థితి ఏర్పడవచ్చు. ఇప్పుడు దేశంలో ఓపిఎస్ అమలవుతున్న రాష్ట్రాల సంఖ్య ఐదుకు చేరింది. జమిలి ఎన్నికలు వస్తే సిపిఎస్ సమస్యను ఎన్నికల ఎజెండాగా మార్చాల్సిన అవసరముంది. ఇక్కడ కూడా ప్రధానంగా ఓపిఎస్ అమలుకు మోకాలు అడ్డం పెడుతున్న పార్టీ బిజెపి. మిగతా పార్టీలపై ఒత్తిడి పెంచగలిగితే సిపిఎస్ రద్దుకు గట్టి హామీ పొందగల అవకాశం వుంది. జాతీయస్థాయిలో జమిలి ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్నది. జాతీయ ఎన్నికలతో పాటు అన్ని రాష్ట్రాల్లో శాసనసభలకు ఒకేసారి ఎ÷-నికలు నిర్వహిస్తే సిపిఎస్ వేడి తగలక మానదు. ఎన్నికల్లో ఆశించిన విధంగా సిపిఎస్ రద్దుకు కట్టుబడిన ప్రభుత్వాలు వచ్చినట్లైతే, సిపిఎస్ రద్దు విషయాన్ని ప్రధాన రాజకీయ పార్టీలు విస్మరించలేని ఒక అనివార్య పరిస్థతి ఏర్పడుతుంది. సిపిఎస్ రద్దు కావాలంటే దేశంలో ఈ సానుకూల పరిస్థితులే సమకూరాలి. ప్రస్తుత మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో సీన్ రివర్స్ కాక తప్పదని లెఫ్ట్ పార్టీలు అంచనా వేస్తున్నాయి. అయితే ఈ అంచనాలు వాస్తవ రూపం దాల్చాలంటే, జమిలి ఎన్నికలకు ముందు ఆయా రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున సిపిఎస్ వ్యతిరేక ఉద్యమం ఊపందుకోవాలి. అందు కోసం సదస్సులు, సెమినార్లు, ధర్నాలు, ఆందోళనలు అవిశ్రాంతంగా జరుగుతూనే వుండాలి. చిన్న చిన్న అవరోధాలకే ఆగిపోకూడదు. పాలక వర్గాలు తమ ప్రయోజనాలను కాపాడుకోవడం కోసం ఎంతకైనా తెగిస్తాయి. సిపిఎస్ వ్యతిరేక ఉద్యమాన్ని జగన్ ప్రభుత్వం అణచివేసిన తీరు దీనికి ఉదాహరణ. కాబట్టి జావగారిపోవడం కాదు. తట్టుకొని నిలబడాలి. అందుకు ఐక్య కార్యాచరణ అత్యవసరం. ఉద్యోగులు వారి సంఘాల మధ్య పూర్తిస్థాయి ఐక్యత సాధించడంతో పాటు కార్మిక సంఘాల సహకారాన్ని కూడా తీసుకోవాలి. వాస్తవానికి సిపిఎస్ చట్టం కాకుండా 2004 నుండి దాదాపు దశాబ్ద కాలం పాటు పార్లమెంట్‌లో పోరాడింది వామపక్షం. కాబట్టి సిపిఎస్ వ్యతిరేక ఉద్యమానికి వామపక్ష పార్టీలు, వాటి ఆధ్వర్యంలోని ప్రజాసంఘాలు నిజమైన మిత్రులు. ఈ విధమైన విశాల మద్దతు కూడగట్టగలిగితేనే ఉద్యోగుల సిపిఎస్ రద్దు కల నెరవేరుతుంది. కాబట్టి ఉద్యోగులు, వారి సంఘాలు ఈ దిశగా ఆలోచించి ఆచరణకు పూనుకోవడం నేటి కర్తవ్యం. అందుకు సిపిఎం ఎప్పటికీ పోరాడుతుందని ఆ పార్టీ నేతలు హామీ ఇస్తున్నారు.

## ఆక్వా ఎగముతలపై అంతర్జాతీయ ప్రభావం

### ధరలు తగ్గడంతో నష్టాల్లో రైతులు

ఏలూరు : ప్రభుత్వానికి ఏటా కోట్లాది రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించి పెడుతున్న రంగం ఆక్వాదే. అయితే దీనికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం లేకపోయినా మొదటి నుంచి రైతులే కష్టనష్టాలను ఎదుర్కొని సాగు చేస్తున్నారు. ఆక్వారంగం అభివృద్ధికి ప్రభుత్వం నామమాత్రం గానే చర్యలు తీసుకుంటుంది. మూడేళ్లుగా రొయ్యల మేత ధరలు పెరుగుతున్న తీరుపై ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్ష్యానికి మించి ఉత్పత్తులు సాధిస్తూ రాష్ట్రాన్ని ఆర్థికంగా ముందుకు నడిపిస్తూ విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తున్నా నాయకులకు మాత్రం పట్టడం లేదు. వ్యాధుల తీవ్రత, నీటి కొరత, మౌలిక వసతుల లేమి, నూతన పరిజ్ఞానం అందుబాటులో లేక నష్టాలపాలవుతున్నారు. ప్రస్తుతం ఆక్వా రైతులు తీవ్ర గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. విదేశాలకు ఎగుమతులు నిలిచిపోవడంతో వ్యాపారులు కొనుగోళ్లు బాగా తగ్గించడం వల్ల మార్కెట్లో రొయ్య ధర దారుణంగా పతనమైంది. విదేశాల నుంచి ఆర్డర్లు లేక ప్రాసెసింగ్ ఎ÷-లాంట్లు, కోల్డ్ స్టోరేజీలు రొయ్యల నిల్వలతో నిండిపోయాయి. రొయ్యల సాగు ఖర్చు బాగా పెరిగిపోయింది. రూ.లక్షల నష్టాలతో రొయ్య రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. జనవరి వరకు ఆగి ఫిబ్రవరి నుంచి పండుగప్ప సాగు చేయాలనే ఆలోచనలో కొంతమంది రైతులున్నారు. ఉమ్మడి జిల్లాలో రొయ్యల సాగు విస్తీర్ణం 1.2 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. వార్షిక ఉత్పత్తి నాలుగు లక్షల టన్నులు. వార్షిక ఆదాయం రూ.18 వేల కోట్లు. 24 శీతల గిడ్డంగులు ఉన్నాయి. విదేశాలకు ఆర్డర్లు తగ్గడంతో ఆక్వా మార్కెట్ కుదేలైంది. పలు దేశాల్లో రొయ్య దిగుబడులు బాగా వచ్చాయి. దీంతో మన ప్రాంతం నుంచి ఎగుమతులు తగ్గిపోయాయి. మొన్నటి వరకు అధిక వర్షాలు, ప్రస్తుతం చలి వాతావరణం కారణంగా వైరస్‌లు విజృంభించి రొయ్యల దిగుబడులు 50 శాతానికి పడిపోయాయి. ఆర్థికమాంద్యం నేపథ్యంలో యూరోపియన్ దేశాలకు ఎగుమతులు భారీగా క్షీణించాయి. ఎగుమతులు తగ్గడంతో ఆ ప్రభావం రొయ్యల మార్కెట్లపై పడింది.

## సీఎం పర్యటన సందర్భంగా స్కూళ్ల మూసివేత

### డిసెంబర్ 14వ తేదీ రెండో శనివారం సెలవు తీసివేత

రాజన్న సిరిసిల్ల : సీఎం రేవంత్ రెడ్డి వేములవాడ పర్యటన సందర్భంగా.. ప్రయివేటు బడులకు సెలవు ప్రకటించారు. ఈ మేరకు ఆయా ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యాలు అధికారికంగా పిల్లల తల్లిదండ్రులకు మేసేజ్‌లు పంపారు. ఈ నెల 20న సీఎం రేవంత్ రెడ్డి వేములవాడ పర్యటన సందర్భంగా.. మా పాఠశాల వాహనాలను సభకు పంపిస్తున్నాం. ఈ కారణంగా విద్యార్థులకు సెలవులు ప్రకటిస్తున్నాం. డిసెంబర్ 14న రెండో శనివారం రోజున సెలవు ఉండదని, ఆ రోజు పాఠశాలలు పని చేస్తాయని యాజమాన్యాలు పేర్కొన్నాయి. రాజన్న సిరిసిల్ల డీఈవో జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వస్తే స్కూళ్ళు మూయడమేంటి..? అని పిల్లల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ చేసే నిర్వాకానికి విద్యార్థులు బలవ్వాలా..? అంటూ కాంగ్రెస్ నియతృత్వ పాలన, వికృత చర్యలపై మండిపడుతున్నారు. అర్థం పర్థం లేని కాంగ్రెస్ చేష్టలతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక నిన్న హనుమకొండలో కాంగ్రెస్ సభ జరిగిన విషయం తెలిసిందే. ఈ సభ నేపథ్యంలో హనుమకొండలోని ప్రయివేటు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. గతంలో వరంగల్‌కు మోదీ, కేసీఆర్ వెళ్లినప్పుడు కూడా ఏ ఒక్క పాఠశాలకు కూడా సెలవు ప్రకటించలేదు. కానీ రేవంత్ మాత్రం తన సభలకు ప్రయివేటు స్కూళ్ల బస్సులను వాడుకోవడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. కుల గణన కోసం ఒంటి పూట బడులు నిర్వహిస్తున్న రేవంత్ ప్రభుత్వంపై పలువురు నిప్పులు చెరిగిన విషయం తెలిసిందే.


## విద్యార్థిడిని కరిచిన పాము

### ఆస్పత్రికి తరలించిన ప్రిన్సిపాల్

హైదారాబాద్ : నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం మూసీ ప్రాజెక్టు దగ్గర గల జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల వసతి గృహంలో ఉండే గణేష్ అనే విద్యార్థికి పాము కరిచింది. విషయం తెలుసుకున్న పాఠశాల ప్రిన్సిపాల్ విద్యార్థిని హాస్పిటల్‌కు తరలించగా, చికిత్స పొందుతున్నాడు. కాగా, గురుకులాలను ప్రభుత్వం గాలికి వదిలేయడంతో విద్యార్థులు ఎప్పుడు ఏం జరుగుతుందేమోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. మరికొంత మంది విద్యార్థులు గురుకులాలను వదిలి ఇంటి బాటపడుతున్నారు. సంవత్సర కాలంలోనే గురుకులాలను ఇరవేండ్ల వెనక్కి తీసుకెళ్లిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై విద్యార్థి సంఘాలు, మేధావులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## కార్తీకంలో నిత్య దీపోత్సవాలు

తిరుపతి : వైష్ణవం, శైవం, శాక్తేయం తదితర సర్వ సంప్రదాయాలకు కార్తీకమాసం శ్రేష్టమైనది. ఈ మాసంలో దైవ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వందల రెట్లు అధికంగా ఫలితం కలుగుతుందని స్వామిజీలు ఉద్ఘాటించారు. ఏటా తిరుపతిలో అత్యంత వైభవంగా కార్తీక మహాదీపోత్సవం నిర్వహిస్తారు. ఈ యేడు కూడా భారీ సంఖ్యలో భక్తులు హాజరై సామూహిక దీపారాధన చేశారు. ఇక తిరుమలతో పాటు, పద్మావతి అమ్మవారి దేవాలయ ప్రాంగణాల్లో నిత్యం దీపోతసవం కన్నుల పండువుగా సాగుతోంది. దపాన్ని వెలిగిస్తే మనలోని అజ్ఞానం అనే అంధకారం తొలగి జ్ఞానం అనే వెలుగు ప్రకాశిస్తుం దంటారు. పవిత్రమైన కార్తీక మాసంలో దీపోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.శివ కేశవుల వైశిష్ట్యం, దీపం ప్రాముఖ్యత, దీపారాధన వల్ల అజ్ఞానమనే చీకటిని పారద్రోలి ప్రజల హృదయాల్లో ఆధ్యాత్మిక జ్ఞానదీపాలు వెలిగించాలని శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ఈ సందర్భంగా భక్తులు ప్రార్థిస్తున్నారు. దైవనామాన్ని జపిస్తే దీర్ఘాయువు కలుగుతుందంటారు. దీపోత్సవంలో పాల్గొన్న భక్తులందరికీ శ్రీనివాసుని కటాక్షం కలగాలని కోరుకుంటారు. కార్తీక పౌర్ణమి రోజున భక్తులతో దీప మంత్రం మూడుసార్లు పలికిస్తూ సామూహిక లక్ష్మీ నీరాజనం సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులందరూ ఒక్కసారిగా చేసిన దీపారాధనతో తిరుపతి ప్రాంగణం వెలుగుతో నిండిపోయింది.



ఆధ్యాత్మికం

## సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న సులబ్, నర్సరీ,

# కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

### - సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. వెంకన్న

**రామగిరి(ది క్రైమ్ న్యూస్)నవంబర్ 20:** సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఎస్ సి సి డబ్ల్యూ యు – ఐ ఎఫ్ టి యు)రాష్ట్ర అధ్యక్షులు డి బ్రహ్మానందం,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. వెంకన్న ఆధ్వర్యంలో డైరెక్టర్ "పా" జి. వెంకటేశ్వర్ రెడ్డి కి మెమోరండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఎస్ సి సి డబ్ల్యూ యు – ఐ ఎఫ్ టి యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. వెంకన్న మాట్లాడుతూ సింగరేణి లో విధులు నిర్వహిస్తున్న సులబ్, నర్సరీ, కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి అన్నారు, సులబ్ కార్మికులు గత 20 సంవత్సరాలుగా కాంప్లెక్స్ లను శుభ్రం చేస్తూ ఎలాంటి హక్కులు సౌకర్యాలు లేకుండా దుర్భరమైన జీవితం అనుభవిస్తున్నారు. కనుక ఈ కార్మికులకు సింగరేణి యాజమాన్యం ఈ.ఎస్.ఐ– ఈ.పీ.ఎఫ్, లేదా సీ.ఎం. పి.ఎఫ్ సౌకర్యాన్ని అలాగే సింగరేణిలో అన్ని డిపార్ట్మెంట్ కాంట్రాక్టు కార్మికులకు చెల్లించినట్టు 8.33% బోనస్ చెల్లించాలి, అదేవిధంగా నర్సరీ కార్మికులు సింగరేణికి సంస్థకు పర్యావరణం విషయంలో రాష్ట్రంలోనే నెంబర్ వన్ సంస్థగా పేరు సాధించిపెట్టి న కార్మికులకు జి.వో ప్రకారం కనీస వేతనాలు సీ.ఎం.పి.ఎఫ్, బోనస్, వైద్య, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు.అలాగే సింగరేణి కాంటాక్ట్ కార్మికుడు ఒక్కరోజు డ్యూటీ కి అప్సెట్ అయితే 475 రూపాయలు కాంట్రాక్ట్ కార్మికుని వేతనం నుండి కాంట్రాక్టర్లు ఫైన్ ల పేరుతో కట్ చేస్తున్నారు. ఈ విధానాన్ని సింగరేణి యాజమాన్యం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే హెచ్.డి.ఎఫ్.సీ బ్యాంకు ద్వారా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు సింగరేణి యాజమాన్యం ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించినప్పటికీ సింగరేణిలో కొంత మంది అధికారులు ఇప్పటివరకు పూర్తి స్థాయిలో కాంట్రాక్టు కార్మికులకు హెచ్.డి.ఎఫ్.సీ బ్యాంకు ఖాతాలను తెరిపించలేదు. సింగరేణి అధికారులకు ఏదైనా అనుమానాలు ఉంటే



బ్యాంకు అధికారులతో మాట్లాడి క్లియర్ చేసి తక్షణమే హెచ్.డి.ఎఫ్.సీ బ్యాంకు ఖాతాలను కార్మికులకు ఇప్పించాలి అన్నారు. ఈ కార్యక్రమం లో సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ( ఎస్ సి సి డబ్ల్యూ యు – ఐ ఎఫ్ టి యు) రాష్ట్ర అధ్యక్షులు డి. బ్రహ్మానందం,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. వెంకన్న లు పాల్గొన్నారు.

# గ్రామాన్ని సందర్శించిన డి ఎల్ పి ఓ

### - పన్నూరులో పర్యటించిన మంథని డీ.ఎల్.పీ.ఓ కొమ్మెర.సతీష్ కుమార్

**రామగిరి(ది క్రైమ్ న్యూస్)నవంబర్ 20:** రామగిరి మండలం పన్నూరు గ్రామపంచాయతీలో బుధవారం మంథని డివిజనల్ పంచాయతీ అధికారి(డీ. ఎల్.పీ.ఓ) కొమ్మెర.సతీష్ కుమార్ పర్యటించారు. గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. గ్రామంలో జరుగుచున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శికి తగు సూచనలు జారీ చేశారు. నిరంతరం ఇంటింటా చెత్త సేకరణ జరగాలని సెగ్రేషన్ షెడ్‌లో సెగ్రిగేష ను ప్రక్రియ జరిగి, వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని అన్నారు. ప్లాస్టిక్ లేదా డ్రై వేస్ట్ ను అమ్మి అట్టి డబ్బులు గ్రామపంచాయతీ ఖాతా లో జమ చేయవలని సూచించారు. ఇంటి పన్ను వసూలు నవంబర్ 30, 2024 లోపు 100% పూర్తిచేసి గ్రామపంచాయతీ ఖాతాలో జమ చేయవలసినదిగా ఆదేశించినారు. ట్రేడ్ లైసెన్సులు ఈరోజు రెన్యువల్ చేయమని ఆదేశించినారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి పారిశుధ్య కార్యక్రమాలు అయిన ఫాగింగ్ చేయించడం, బ్లీచింగ్ చల్లించడం, క్లోరినేషన్ చేయించడం తదితర పనులను నిరంతరం జరగాలని ఆదేశించినారు. అనంతరం గ్రామం లో జరుగు తున్నట్లువంటి ఇంటింటి కుటుంబ సర్వే ను సందర్శించారు. ఈరోజుతో సర్వే పూర్తి చేయాలని, సర్వే చేసిన ఫారం లను మండల పంచాయతీ కార్యాలయం లో అందజేయాలని ఆదేశించారు.తదుపరి గ్రామ పంచాయతీలోని కస్తూరిభా పాఠశాలను సందర్శించి, విద్యార్థుల మంచి,చెడులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులకు తగు సూచనలు జారీ చేసారు. ఈయన వెంట ఎంపీఓ దేవకొండ. ఉమేష్, సెక్రటరీ భూక్య ప్రేమలత, కారోబార్ పెరుమాండ్ల అభి ఉన్నారు.





## లాంగ్ వాల్, బోల్టర్ మైనింగ్ పనితీరుపై చర్చ

### - నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను భద్రతతో సాధించాలి

### - డైరెక్టర్ (ప్రాజెక్ట్స్, ప్లానింగ్ అండ్ పా) జి.వెంకటేశ్వరరెడ్డి



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)నవంబర్ 20:** నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను భద్రతతో సాధించాలని సింగరేణి సంస్థ ప్రాజెక్ట్స్, ప్లానింగ్ అండ్ పర్సనల్ డైరెక్టర్ జి. వెంకటేశ్వరరెడ్డి అన్నారు.బుధవారం అడ్రియాల లాంగ్ వాల్ గనిని వారు సందర్శించారు. ముందుగా వారు అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొప్పుల వెంకటేశ్వర్లు, ప్రాజెక్ట్ ఆఫీసర్ కొలిపాక నాగేశ్వరరావుతో పాటు సంబధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో లాంగ్ వాల్, బోల్టర్ మైనింగ్ పనితీరుపై చర్చించారు. అనంతరం గనిలోపలికి వెళ్ళి లాంగ్ వాల్ ప్యానల్ పనులను పరిశీలించి, భద్రతాపరంగా తీసుకోవాల్సిన చర్యలపై పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.అనుక్షణం, భద్రతతో విధులు నిర్వహిస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను సాధించుకోవాలని అందుకు కావలసిన ప్రణాళికలను, చర్యలను చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఇంజనీర్ టి.రఘురాం, మేనేజర్ కె.జనార్ధన్, భద్రత అధికారి ఎం.రమేష్, సర్వే అధికారి నారాయణ, ఇతరఅధికారులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ సీనియర్ నాయకుడి కుటుంబాన్ని పరామర్శించిన జివి రామకృష్ణారావు



**మానకొండూర్(ది క్రైం న్యూస్ ):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం లక్ష్మీపూర్ కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాపాక రమణయ్య బుధవారం గుండెపోటుతో మరణించగా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణారావు వారి కుటుంబాన్ని పరామర్శించి తన ప్రఘాడ సానుభూతి తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తాళ్లపల్లి శేఖర్ గౌడ్, మాజీ జెడ్పిటిసి ఎడ్ల సుగుణాకర్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ ఎడ్ల సతీష్, బీఆర్ఎస్ నాయకులు పురం అనీల్ నాయకులు పరామర్శలో పాల్గొన్నారు.

## నాగేపల్లి ఎస్సీ కాలనీలో హైమాక్స్ లైటింగ్స్‌ని ప్రారంభించిన నాగేపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు





**రామగిరి(ది క్రైమ్ న్యూస్), నవంబర్ 20:** రామగిరి మండల ప్రజా పరిషత్ నిధులతో ఏర్పార్చిన హైమక్స్ లైటింగ్స్ ని రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు రామగిరి మండలంలోని నాగేపల్లి గ్రామం ఎస్సీ కాలనీ లో ఏర్పార్చిన హైమక్స్ లైట్స్ ని నాగేపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగేపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు తీగల సదయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగేపల్లి మాజీ ఉప సర్పంచ్ వేగోలపు శ్రీనివాస్, తాజా మాజీ ఉపసర్పంచ్ చిట్టెంపల్లి అనిల్, వేగొలపు రవి, వేగోలపు సంతోష్, నాడెం శ్రీనివాస్, పొన్నం తిరుపతి, బాద్రపు శ్రీనివాస్, వేగోలపు రాయమల్లు, చిందం మహేందర్, అసం శంకర్, వేగోలపు మోహన్, జెన్న శేఖర్ ,ఉండేటి రాజయ్య మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకు సెక్యూరిటీ సిస్టం పరిశీలించిన ఏసిపి...





**హుజరాబాద్ నవంబర్ 20 (ది క్రైమ్ న్యూస్):** హుజురాబాద్ పట్టణ, మండల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులను ఏసిపి శ్రీనివాస్ జి, ఇన్స్పెక్టర్ జీ తిరుమల్ సందర్శించి బ్యాంకులలో ఉండే సెక్యూరిటీ, సీసీ కెమెరాలు బ్యాంకు చుట్టుపక్కల పరిసర ప్రాంతాలను పరిశీలించి, బ్యాంకు వారితో మాట్లాడి సెక్యూరిటీ సిస్టంలో, సీసీ కెమెరాలు విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా నిరంతరం సరి చూసుకోవాలని ఏదైనా అనుమానాస్పదంగా గాని కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా కనబడితే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని తెలిపినారు. బ్యాంకుల భద్రత గురించి తగు సూచనలు చేశారు.

## భూసేకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి సహకరించాలి

### - పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌ను కలిసిన సింగరేణి డైరెక్టర్ జి.వెంకటేశ్వర రెడ్డి





**రామగిరి(ది క్రైమ్ న్యూస్), నవంబర్20:** పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను సింగరేణి సంస్థ ప్రాజెక్ట్స్, ప్లానింగ్ అండ్ పర్సనల్ డైరెక్టర్ జి.వెంకటేశ్వర రెడ్డి, కార్పోరేట్ ఎస్టేట్స్ విభాగం జనరల్ మేనేజర్ నలజాల రాధాకృష్ణతో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వెంకటేశ్వర రెడ్డి, కలెక్టర్‌ని శాలువాతో సన్మానించారు.అనంతరం సింగరేణి సంస్థ రామగుండం-వన్, త్రీ ఏరియాల ప్రాజెక్టుల విస్తరణ కోసం కావాల్సిన భూసేకరణకు సంబంధించిన విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-త్రీ జీఎం నరేంద్ర సుధాకరరావు, అర్జీ-వన్ జీఎం డి.లలిత్ కుమార్, ఏరియాఎస్టేట్స్ విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి డ్రగ్స్, మాదకద్రవ్యాల పై అవగాహన..





**జమ్మికుంట నవంబర్ 20 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పిల్లల దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని కాకతీయ హైస్కూల్ లో గంజాయి,డ్రగ్స్,మాదక ద్రవ్యాల నిర్మూలనకై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదస్సులో అధికారులు మత్తు పదార్థాలు తీసుకోవడం వలన కలిగే దుష్పరిణామాలను పిల్లలకు వివరించారు. డ్రగ్స్ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి విలువలతో కూడిన జీవితాన్ని నిర్మించుకోవాలని జీవితంలో ఉన్నత శిఖరాలను అందుకోవాలని పిల్లలకు సూచించారు. ఈ సదస్సులో ప్రొఫెషనల్ ఎక్సైజ్ సిఐ ఎం.మాధవిలత, ఎస్సై ఎం. సౌమ్య, సిబ్బంది, స్కూల్ యాజమాన్యం, టీచర్స్, నాశిముక్ భారత్ అభియాన్ అధికారి టి. మాలతి తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ అంటేనే మోసం అబద్దాలు

## - ఆరుగ్యారెంటీల పేరుతో ప్రజలను ఆగం చేసిండ్లు - ఏడాది కావస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయలే

## - పథకాల అమలులో మ్యానీఫెస్టో కమిటి చైర్మన్ విఫలం - మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**రామగిరి(ది క్రైమ్ న్యూస్)నవంబర్ 20:** సంక్షేమ పథకాలు అమలు చేస్తామంటూ ఎన్నికల్లో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, పాలకులవి 420మాటలేనని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రజావంచన దినోత్సవాల్లో బాగంగా పలిమెల మండలంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామంటూ ఇంటింటికి తిరిగి సంతకాలు పెట్టి మరీ ప్రచారం చేశారని, అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను ఆగం చేశారని ఆయన అన్నారు. వంద రోజులు పూర్తియిపోయి ఏడాది కావస్తున్నా ఆరు గ్యారెంటీలో ఒక్క మహిళల ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏ ఒక్కటైనా పూర్తిస్థాయిలో అమలు చేశారా అని ఆయనప్రశ్నించారు. ఆరు గ్యారెంటీ పథకాలతో పాటు 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అందులో ఏ ఒక్కటి అమలు చేయకుండా విజయోత్సవాలు జరుపుకోవడం ఏంటని ఆయన విమర్శించారు. ప్రజలు నమ్మి ఓట్లు వేసి అధికారం అప్పగిస్తే వాళ్లను దగా చేశారని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ మ్యానీఫెస్టో కమిటి చైర్మన్‌గా ఉన్న మంథని ఎమ్మెల్యే పథకాల అమలులో విఫలం అయ్యారని, ఆనాడు కేవలం అధికారం, పదవుల కోసమే చూశారే తప్ప పేద ప్రజల సంక్షేమంపై ఆలోచన చేయడం లేదన్నారు. కాంగ్రెస్ అంటేనే మోసం అబద్దాలు అని, గృహజ్యోతి



పేరు మీద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అని చెప్పి ప్రజలను మోసం చేశారు అని, మళ్లీ బిల్లు లు వస్తున్నాయని, కరెంటు సక్రమంగా ఉండడం లేదని ప్రజలు చెప్తున్నారని అన్నారు, సన్నరకం ధాన్యంకు బోనస్ అంటూ రైతును మభ్య పెడుతున్నారని, ఇప్పటి వరకు రైతురుణమాఫీ వంద శాతం చేయలేదన్నారు. తెలంగాణాలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామంటూ మహారాష్ట్రలో ప్రచారం చేస్తున్నారని, ఇక్కడి తరహాలోనే మహారాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు చూస్తున్నారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పాలకులు ఇచ్చిన హామీలను మర్చి విజయోత్సవాలు జరుపుకోవాలని



చూస్తున్నారని, అందుకు నిరసనగా కాంగ్రెస్ ప్రజావంచన దినోత్సవాలు జరుపుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలను, ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# పెండింగ్ స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి

## - బాలసాని లెనిన్, రేణుకుంట్ల ప్రీతం కళ్లకు గంతలతో ఏఐఎస్ఎఫ్ నిరసన

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా సమితి ఆధ్వర్యంలో పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, ఫీజురీయింబర్స్మెంట్ ను వెంటనే విడుదల చేయాలని అయ్యప్ప టెంపుల్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కళ్ళకు గంతలు కట్టుకుని తెలుగు తల్లి విగ్రహం దగ్గర నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలసాని లెనిన్, ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్ షిప్స్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే విద్యార్థులు చదువుకునేదెట్లని, రాష్ట్ర సర్కార్ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతూ విద్యార్థుల పట్ల వివక్షతను చూపుతుందని వారు మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రావటానికి విద్యార్థుల పోరాటం వారి తల్లిదండ్రుల సహాకారం ఉందన్న విషయం సిఎం రేవంత్ రెడ్డి గుర్తు పెట్టుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజురీయింబర్స్మెంట్ నిధులు రూ. 8 వేల కోట్ల రూపాయలు విడుదల చేయక పోవడంతో, రాష్ట్ర వ్యాప్తంగా 14 లక్షల మంది విద్యార్థులు అనేక



ఆర్థికపరమైన అవస్థలు ఎదుర్కొంటున్నారని, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇతర వృత్తివిద్య కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలలో డబ్బులు కట్టి టి.సి ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకోలేక ఉన్నత చదువులను మధ్యలోనే మానేయాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని, దీనితో విద్యార్థులు తీవ్ర మానసిక ఆవేదన చెందుతున్నారని అన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేయటంలో నిర్లక్ష్యం వహిస్తుందని మాట్లాడి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫీజు బకాయిలు ఒకే సారి విడుదల చేస్తామని చెప్పిన ఆనాటి పిసిసి అధ్యక్షుడు, నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిల విడుదల చేయటంలో నిర్లక్ష్యం చేయటం సిగ్గుచేటని, పాలకులు మారిన విద్యార్థుల జీవితాలు మారటం లేదని, ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్ షిప్స్ బకాయిల విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేయడం సరికాదని, విద్యాశాఖ కూడా తన వద్దే పెట్టుకున్న విద్యాశాఖకి నిధులు కేటాయించి విద్యార్థులకు ఖర్చు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థుల పట్ల వివక్ష చూపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పెండింగ్ ఫీజులను విడుదల చేయకుండా పేద విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమను కనబరుస్తుందని, సర్కారు ఫీజులు చెల్లింపులు చేయకపోతే విద్యార్థుల చదువులు కొనసాగేదెలా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యార్థుల పట్ల వివక్ష చూపిన ప్రభుత్వాలు మనుగడ సాధించలేవని అన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలను మొత్తం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్నకొండ సాయి ఆజాద్, గొడిసెల ప్రణీత్, రాకేష్, నగేష్, అవినాష్, నాగరాజు, నవీన్ రాజు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు కొరకు కౌన్సిలింగ్



**రామగిరి(ది క్రైమ్ న్యూస్), నవంబర్ 20:** రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు ఆదేశాల మేరకు రామగుండం-త్రీ, అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సెంటినరీ కాలనీలో గల క్వార్టర్ల కేటాయింపు కొరకు బుధవారం నాడు సెక్యూరిటీ కార్యాలయ ఆవరణలో క్వార్టర్ల కేటాయింపు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. మొత్తము 173 ఖాళీ క్వార్టర్లు ఉండగా, ఫ్రెష్ అలాట్మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ల కొరకు 78 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా, 22 మంది ఉద్యోగులు హాజరై, 21 మంది క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు. వారికి త్వరలోనే క్వార్టర్ల కేటాయింపు పత్రాలు ఇస్తామని ఎస్వోటుజియం జి.రఘుపతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రారెడ్డి, ఎన్.శ్రీనివాసరావు, డి.పి.ఎం. గుర్రం శ్రీహరి, క్వార్టర్ల విభాగం సిబ్బంది రమ్య, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా నిర్మాణాలు చేర్పడితే చర్యలు తప్పవు..

## - మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ అయాజ్

**జమ్మికుంట నవంబర్ 20 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో ఏక్కడ ఎలాంటి అనుమతులు లేకున్న ఇండ్లు కట్టిన, అక్రమంగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన ఉపేక్షించబోమని మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ అయాజ్ అన్నారు. బుధవారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ప్రభుత్వ మున్సిపల్ కు సంభందించిన ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన ఇంటి యజమానికి పలుమార్లు నోటీసులు ఇచ్చామని, బుధవారం రాత్రి వరకు ఆక్రమించిన భూమిని ఇంటి యజమాని కూల్చివేస్తే పక్క నిర్మాణ స్థలానికి సమస్య లేకుండా ఉంటుందని లేనియడల మున్సిపల్ జీసిబి తో కూల్చివేస్తామని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు పూర్తి కొలతలు చేసి ప్రభుత్వ భూమిని అక్రమించినట్లు తేల్చారని ఆయన అన్నారు. మున్సిపల్ పరిధిలో ఇంటి పర్మిషన్లు కావాలనుకునే వారు కార్యాలయంలో సంప్రదించాలని ఆయన అన్నారు. ప్రభుత్వ రుసుం కాకుండా ఎటువంటి లంచాలు అడిగిన మున్సిపల్ కమిషనర్ గా నాకైన, ఎసిబి అధికారులకు అయిన సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు శ్రీధర్, ప్రదీప్ కుమార్, వార్డు ఆఫీసర్ రామరాజులతో మున్సిపల్ మేనేజర్ జీ రాజిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



# పలు వివాహాది వేడుకలలో పాల్గొని ఆశీర్వదించిన శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిల్ల శ్రీనుబాబు



**ముత్తారం.నవంబర్.20.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండల కేంద్రానికి చెందిన పింగిలి దేవకి - దేవేందర్ రెడ్డిల కూతురు దివ్య - పవన్ కల్యాణ్ రెడ్డి వివాహ వేడుక స్థానిక వెంకట లక్ష్మి గార్డెన్లో బుధవారం జరగగా ఈ వేడుకల్లో శ్రీపాద ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ యువ నాయకుడు దుద్దిళ్ల శ్రీనుబాబు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం గాదం సంజీవ్- సుజాతల కూతురు ముందస్తు వివాహ వేడుకలలో పాల్గొని ఆశీర్వదించారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ,యువజన సంఘం మండల అధ్యక్షుడు బక్కతట్ల వినీత్, ముత్తారం మాజీ సర్పంచ్ తూటి రజిత రఫీ, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గాదం శ్రీనివాస్, నాయకులు దాసరి చంద్రమౌళి, తీగల సత్యనారాయణ, లక్కం ప్రభాకర్, చొప్పరి సంపత్, రాపెల్లి రామన్న, ఆకోజు అశోక్, కొండాల్ రెడ్డి, తదితరులున్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన చిలుముల లావణ్య లక్ష్మణ్



**ధర్మపురి నవంబర్ 20, (ది క్రైమ్ న్యూస్):** నూతన వారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ధర్మపురి పిఎసిఎస్ చైర్మన్ చిలుముల లావణ్య లక్ష్మణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు తిమ్మాపూర్ పిఎసిఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాయపట్నం మరియు తిమ్మాపూర్ గ్రామాల యందు పిఎసిఎస్ చైర్మన్ సాయిని సత్తయ్య తో కలిసి ధర్మపురి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చిలుముల లావణ్య లక్ష్మణ్ ప్రారంభించినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మ ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర గ్రేడ్ ఏ, రూ. 2320/- సన్న రకాలు రూ., 2320/- మరియు 500/- బోనస్ గా కలిపి 2820/-, కామన్ 2300/- లుగా ఉన్నాయని రైతుల ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద తమ ధాన్యాన్ని విక్రయించాలని తెలిపారు. రైతుల సంక్షేమం కొరకు కాంగ్రెస్ ప్రభుత్వం సాయ శక్తుల కృషి చేస్తుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా సంబంధిత అధికారులు పని చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ పాక్స్ వైస్ చైర్మన్ గటిక సత్తయ్య మరియు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు ఎండి రఫీయొద్దీన్, ఎన్నం మధుకర్ రెడ్డి మరియు కాశెట్టి రాజేష్, మరియు ప్రజా ప్రతినిధులు మండల వ్యవసాయ అధికారి సిందుజ, బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షులు కుంట సుధాకర్, మండల ఉపాధ్యక్షులు వేముల రాజేష్, ధర్మపురి టౌన్ కాంగ్రెస్ అద్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, రాందేని మొగిలి, వావిలాల ప్రకాష్, కొమురయ్య, శరత్, సతీష్, దేవవరం, మాజీ ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మడేలయ్య స్వామికి బోనాలు సమర్పించిన రజకులు



**సుల్తానాబాద్ నవంబర్ 20( ది క్రైమ్ న్యూస్):** రజకుల ఆరాధ్య దైవమైన మడేలయ్య స్వామికి ఘనంగా బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని పూసాల గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సంఘం అధ్యక్షుడు పూసాల అంజయ్య మాట్లాడుతూ ఐదేళ్లకోసారి నిర్వహించుకునే ఈ కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు కుల బంధువులతో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని అన్నారు మడేలయ్య స్వామి ఆశీస్సులు అందరి కుటుంబాలపై ఉండాలని కుల బంధువులతో కలిసి బోనాలతో మొక్కులు చెల్లించుకుంటున్నామని అన్నారు. అంతకుముందు పూసాల గ్రామ పోచమ్మ వద్ద బోనాలు సమర్పించే కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు దాసరి ఉష బుర్ర శ్రీనివాస్ లు పాల్గొని ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పూసాల రాజేష్ పూసాల సాంబమూర్తి పూసాల రాజయ్య గోశాల స్వామి పూసాల చంద్రయ్య కొల్లూరి రవి ముస్కె రాజేశం పూసాల నారాయణ పూసల నరసయ్య పూసాల రాజు తదితరులు ఉన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తాటిపర్తి శైలేందర్ రెడ్డి



**ఎండపల్లి, నవంబర్ 20(ది క్రైమ్ న్యూస్ ):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి వేములవాడ పర్యటనలో పాల్గొన్నారు. కాగా ఆయనను ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఉమ్మడి వెల్గటూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్ రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి చేపడుతున్న సంక్షేమ పథకాల అమలుపై ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధి పట్ల ప్రజలు ఆనందంగా ఉన్నారని హర్షం వ్యక్తం చేశారు.

# ఇచ్చిన హామీలు ప్రజలందరికీ అందినప్పుడే విజయోత్సవాలు చేస్తారు

## - బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణారావు



**మానకొండూర్(ది క్రైం న్యూస్ ):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణారావు మాట్లాడుతూ....వరంగల్ లో ఇందిరాగాంధీ పేరుతో ఏర్పాటు చేసిన సభ నూనె పాలులాగా ఉందని, తెలంగాణ ఉద్యమ సమయంలో కరీంనగర్ జిల్లా ఉద్యమకారులపై తుపాకీ పెట్టిన చరిత్ర రేవంత్ రెడ్డిదని అలాంటి రేవంత్ రెడ్డి కాళోజి నారాయణరావు విగ్రహావిష్కరణ చేయడం చీకటి రోజులుగానే భావిస్తున్నామన్నారు. సభలో ఇందిరా గాంధీ గురించి కేవలం మూడు నిమిషాలు మాత్రమే మాట్లాడి మిగిలిన సమయమంతా కెసిఆర్ ను తిట్టడానికే కేటాయించాడని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇందిరాగాంధీ గొప్పతనాన్ని చెప్పడానికి ఆలోచన రాని రేవంత్ రెడ్డిది కాంగ్రెస్ డిఎన్ఏ కాదని కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్న డూప్లికేట్ నాయకుడిగా భావిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఇది గుర్తించాలని సూచించారు.కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ప్రజలందరికీ అందినప్పుడే విజయోత్సవాలు చేస్తారని దరఖాస్తు స్వీకరించి ఏడాది గడుస్తున్న ఒక్క లబ్ధిదారునికి ఇల్లు ఇవ్వలేదని,లబ్ధిదారుల జాబితా తయారు చేయకుండా సభ ఎందుకు పెట్టినట్లు అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి బెల్ట్ షాపులు నడుస్తున్నాయని దమ్ము ధైర్యం ఉంటే తెలంగాణలో మద్యం నిషేధించి ప్రజలకు మేలు చేయాలని సూచించారు. అప్పులు చేయని రాష్ట్రం దేశంలో లేదని తెలంగాణలో పెద్దపెద్ద ప్రాజెక్టులు కట్టి రాష్ట్ర అభివృద్ధికోసం కెసిఆర్ అప్పులు చేశాడే కానీ నీలాగా ప్రభుత్వాన్ని నడపడానికి అప్పులు చేయలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో 42 శాతం రిజిస్ట్రేషన్లు పడిపోయి రియల్ ఎస్టేట్ మూతపడ్డ పడిందని రేవంత్ రెడ్డికి తెలివి ఉంటే రెవెన్యూను జనరేట్ చేసే ఆలోచనలో దృష్టి పెట్టాలని హితవుపలికారు. అదాని అంబానీలను తలదన్నే రీతిలో మహిళలను కోటీశ్వరులను చేయలేరుగాని వాళ్లను బికారులుగా మాత్రం చేయవద్దని కోరారు. రేవంత్ రెడ్డి తిరుపతిరెడ్డి ఇద్దరు బిల్లారంగాలని కేటీఆర్ హరీష్ రావులు కృష్ణార్జునులని రానున్న రోజుల్లో విశ్వరూపం చూపిస్తారని హెచ్చరించారు. కెసిఆర్ పెట్టిన బిఆర్ఎస్ పార్టీ తెలంగాణలో వృక్షమై నాటుకుపోయిందని, నీ పదవి నీకు నీ అదిష్టానం పెట్టిన భిక్షని, కేసీఆర్ ది 45 ఏళ్ల రాజకీయ చరిత్రని పార్టీని పెట్టి రాష్ట్రాన్ని తెచ్చిన కెసిఆర్ అంటే రేవంత్ రెడ్డికి గుండెలో దడపుడుతుందని, తెలంగాణ అంటేనే కెసిఆర్ ఆనవాలు అని కెసిఆర్ చిటికెన వేలుకు ఉన్న వెంట్రుకను కూడా రేవంత్ రెడ్డి తీయలేదని అన్నారు. నిత్యానంద స్వామిలా ఒక దీవిని కొనుక్కొని ప్రశాంతంగా ఉండాలని ప్రభుత్వం ఇచ్చిన పథకాలు అమలు చేయలేని పరిస్థితిలో ఉన్నారు కాబట్టే కేసీఆర్,కేటీఆర్, హరీష్ రావులను దూషిస్తున్నాడని తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పి సిరిసిల్ల సభలో మేము ఏమి సాధించలేదని ప్రజల ముందు క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో బిఆర్ఎస్ మండలాద్యక్షుడు తాళ్ళపెల్లి శేఖర్ గౌడ్, మాజీ జెడ్పీటీసి ఎడ్ల సుగుణాకర్, పిఏసిఎస్ వైస్ చైర్మన్ ఎడ్ల సత్తీష్, నాయకులు శాతరాజు యాదగిరి, నెల్లి మురళి,ఎరుకల శ్రీనివాస్ గౌడ్, పిట్టల మదు, పురం అనీల్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీల సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ



**సుల్తానాబాద్,నవంబర్ 20(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి మనోజ్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీసీల సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పోస్టర్ ఆవిష్కరణ చేసిన రాష్ట్ర నాయకులు, జిల్లా అధ్యక్షులు తాళ్ళపల్లి మనోజ్ గౌడ్ మాట్లాడుతూ హైదరాబాద్ లో ఈ నెల 25 న రవీంద్ర భారతిలో జరిగే బీసీల సమరభేరి కి పెద్దపల్లి జిల్లా నుండి బీసీ నాయకులు, బీసీ మేధావులు, బీసీ యువత,బీసీ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని బీసీ లా హక్కులకోసం నడుము బిగించాలని పిలుపు ఇచ్చారు. జనగణనలో కులగణన చేయాలని, పార్లమెంట్ లో బి.సి బిల్లు ప్రవేశపెట్టి, చట్ట సభల్లో బి.సి లకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలని, పంచాయతీరాజ్ సంస్థలో బి.సి రిజర్వేషన్లు 50 శాతంకు పెంచాలని, ఈ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలని. కేంద్ర విద్యా. ఉద్యోగరిజర్వేషన్లను బి.సి ల జనాభా ప్రకారం 27 శాతం నుండి 56 శాతం కు పెంచాలని, బి.సి లకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, బి.సి ల అభివృద్ధికి ప్రత్యేక స్కీములను రూపొందించాలని, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ మాదిరిగా బి.సి లకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి బి.సి యాక్టును తీసుకరావాలని, రాష్ట్రాలకు 80 మ్యాచింగ్ గ్రాంటు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి నందగోపాల్,బీసీ రక్షక దల్ ఛైర్మన్ ఉదయ్, ఉమ్మడి జిల్లా ఇన్చార్జి శ్రీమాన్ , లత పటేల్, చిగుర్ల శ్రీనివాస్, ఆకుల స్వామి వివేక్ పటేల్, మాజీ ఎంపీటీసీల ఫోరం, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుర్రం సంపత్ గౌడ్, బింగ్ రాజు, అవుల వెంకటేష్ యాదవ్, బండారి లక్ష్మన్, బీసీ సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# సుల్తానాబాద్ శివాలయాన్ని దర్శించుకున్న మంచిర్యాల భక్తబృందం



**సుల్తానాబాద్, నవంబర్ 20(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీ శివాలయాన్ని బుదవారం మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన భక్తులు దర్శించుకున్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని సోమ సూత్రం, బ్రహ్మ సూత్రం కలిగివున్న ఇక్కడి శివాలయం విశిష్టతను గుర్తించి మంచిర్యాల పట్టణానికి చెందిన అక్షయ ఫౌండేషన్ మహిళలు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో మంథని ఆర్డీవో సురేష్ సతీమణి కే. ఉష తో పాటు భక్తులు ఎం.తిరుమల, టి.స్వప్న, ఎల్. ఉషారాణి, ఎల్. తిరుమల, బి.స్వప్న, కే.వాణి తదితరులు ఉన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ అల్లెంకి సత్యనారాయణ, అర్చకులు వల్లకొండ మహేష్, రమేష్, స్థానిక భక్త బృందం నుండి సామల హరికృష్ణ తదితరులు భక్తులకు స్వాగతం పలికారు.

# ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థికి గోల్డ్ మెడల్

## - విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి...

**సుల్తానాబాద్, నవంబర్ 19 (ది క్రైమ్ న్యూస్):** విద్యార్థులను వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని ఇండియన్ పబ్లిక్ పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ ప్రిన్సిపల్ కృష్ణప్రియ అన్నారు. హైదరాబాద్ కోట్ల విజయ భాస్కరరెడ్డి స్టేడి యంలో ఆదివారం జరిగిన యూత్ రోలర్ స్కేటింగ్లో స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాల ఎం సంప్రీత్ ఎనిమిదవ తరగతి విద్యార్థి 12 సంవత్సరాల 200 ప్లస్ డి విభాగంలో బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ ప్రిన్సిపల్ కృష్ణప్రియ విద్యార్థిని పుష్పగుచ్చం అందించి అభినందించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించాలని, వారికి ఆసక్తి ఉన్న క్రీడల లో శిక్షణ తీసుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సత్యం, ఇక్బాల్, శివ, సతీష్ పాల్గొన్నారు.




# అయ్యప్ప విడిది ప్రారంభం..

## - అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ..





**సుల్తానాబాద్, నవంబర్ 20( ది క్రైమ్ న్యూస్):** సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని శాస్త్రి నగర్ లో అభయాంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో బుధవారం అయ్యప్ప విడిదిని గురుస్వాములు మిట్టపల్లి మురళి, సాయిరి మహేందర్, కాల్వ శ్రీరాంపూర్ మాజీ జడ్పిటిసి గోపగాని సారయ్య గౌడ్ ప్రారంభించారు. 15 సంవత్సరాల నుండి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం లో అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. అయ్యప్ప భక్తులకు పట్టణానికి చెందిన గంగిరెడ్డి లీలావతి గోపాల్ రెడ్డి, లక్ష్మీ ప్రసన్న రాజశేఖర్ రెడ్డి లు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి, తాసిల్దార్ మధుసూదన్ రెడ్డి లు కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయిరి పద్మ మహేందర్, మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు, వైస్ చైర్మన్ బిరుదు సమతా కృష్ణ, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, కందుకూరి ప్రకాష్ రావు (పెద్దన్న), ముస్త్యాల రవీందర్, వేగోళం అబ్బయ్య, మేర్గు వెంకటేష్, సంతోష్ రావు, గుండా మురళి, కుమార్ కిషోర్, అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

# దళితులపై కపట ప్రేమను ఆపాలి..

## - గతంలో ఎమ్మెల్సీగా దళితులకు నీవు చేసిన అన్యాయాన్ని మర్చిపోలేదు..

## - తన ఉనికిని కాపాడుకోవడం కోసం దళితులను వాడుకుంటున్నారని ఆరోపణ...

## - కౌశిక్ రెడ్డి తీరుపై నిప్పులు జరిగిన చేరిగిన ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్...



**జమ్మికుంట నవంబర్ 20 (ది క్రైమ్ న్యూస్):** దళిత జనోద్ధారకునిగా ఫోజులు కొడుతున్న కౌశిక్ రెడ్డి గతంలో తాను ఎమ్మెల్సీగా కొనసాగిన సమయంలో దళితులను నయవంచనకు గురి చేసే విధంగా రెండవ విడత దళిత బంధు నిధులను ఆపించి దళితులను అవహేళన చేసిన దుర్మార్గపు వ్యక్తిత్వం కలిగిన కౌశిక్ రెడ్డి నేడు దళితుల పట్ల కపట ప్రేమను చూపిస్తూ దళితుల సంక్షేమం కోసం నేను తప్ప తెలంగాణ రాష్ట్రంలో మరెవ్వరు పాటుపడరు అనే విధంగా వ్యవహరించడం పై నియోజకవర్గంలోని ప్రజలందరూ చీదరించుకున్న స్థానిక ఎమ్మెల్యేకౌశిక్ రెడ్డికి సిగ్గు శరం లేకపోవడం కడు దురదృష్టకరం అని ఎమ్మెల్సీ బల్మూరు వెంకట నరసింహారావు కౌశిక్ రెడ్డి తీరుపై నిప్పులు చెరిగారు .బుధవారం రోజు జమ్మికుంట పట్టణంలోని వివిధ శుభకార్యాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన బల్మూరికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో ఘన స్వాగతం పలికారు .మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి ఇందు గార్డెన్స్ లో శనిగరపు తిరుపతి కుమార్తె వివాహానికి హాజరై అనంతరం టీ టైమ్స్ లో తేనీరు సేవించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ కౌశిక్ రెడ్డి తీరును తూర్పారబట్టారు . **- ఉనికిని కాపాడుకోవడానికి కౌశిక్ రెడ్డి పాకులాట ....** గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుకోలేక కుడిదిలో పడిన ఎలుక చందంగా కౌశిక్ రెడ్డి తన ఉనికిని కాపాడుకోవడం కోసం పాకులాడుతున్నారని, నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేసి బిఆర్ఎస్ పెద్దల ఆశీర్వాదం కోసం ఓట్లు వేసి గెలిపించిన హుజురాబాద్ నియోజకవర్గం ప్రజల మనోభావాలను తాకట్టు పెట్టే విధంగా కేసిఆర్ ,కేటీఆర్ కుటుంబం పాద సేవ చేసుకుంటూ ఇష్టం వచ్చినప్పుడు ,ఇష్టం వచ్చినట్లుగా ప్రేలాపనలు పేలుతూ నియోజకవర్గ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నాడని ఇకనైనా కౌశిక్ రెడ్డి డ్రామాలు ఆపకపోతే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్యాంటు ఊడబీకి పందిరి వేస్తారని కౌశిక్ రెడ్డి తీరుపై తీవ్రంగా దుయ్యబట్టారు .కాంగ్రెస్ పార్టీ దళితుల పట్ల నిబద్ధతతో వారికి రావలసిన దళిత బంధు నిధులను అతి త్వరలోనే మంజూరు చేసి దళితుల శ్రేయస్సు కోసం పాటుపడే విధంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ్ ఎప్పటికప్పుడు జిల్లా మంత్రులతో మమేకమవుతూ ప్రజల సమస్యలను వారి దృష్టికి తీసుకు వెళుతున్నారని ,ప్రజలను కడుపులో పెట్టుకొని చూసుకుంటున్న కాంగ్రెస్పార్టీనిఓర్వలేనితనంతోకౌశిక్రెడ్డిబిఆర్ఎస్పార్టీఅధిష్టానం ఆదేశాలతోఅవాకుల చవాకులు పేలుతున్నారని ఇకనైనా కౌశిక్ రెడ్డి తీరుమారకపోతే నియోజకవర్గంలో కౌశిక్ రెడ్డి మనగాడే ప్రశ్నార్థకంగా మారుతుందని తీవ్రంగా హెచ్చరించారు.

# సిపిఎం పార్టీ జిల్లా మహాసభల పోస్టర్ విడుదల

## - సిపిఎం జిల్లా బహిరంగ సభను జయప్రదం చేయండి - సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎరవెల్లి ముత్యంరావు




**సుల్తానాబాద్, నవంబర్ 20, ( ది క్రైమ్ న్యూస్ ):** సిపిఎం పార్టీ జిల్లా మహాసభల పోస్టర్ బుదవారం సుల్తానాబాద్ మున్సిపల్ ఆఫీస్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ సిపిఎం పెద్దపల్లి జిల్లా 3వ మహాసభలు 2024 నవంబర్ 23,24 రెండు రోజులు పారిశ్రామిక ప్రాంతమైన ఎన్టీపీసీలో సీతారాం ఏచూరి ప్రాంగణంలో జరగనున్నాయని, ఈ సందర్భంగా మొదటి రోజు వేలాది మందితో ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుదని ఈ సభలకు ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్, వీరయ్య, టి, జ్యోతి, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ పాల్గొంటారు. కార్మిక, రైతు, ప్రజా పోరాటాలకు నిరంతరం అండగా నిలబడే సిపిఎం పార్టీ ప్రదర్శన బహిరంగ సభలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. 2వ రోజు అనేక ప్రజా పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న జిల్లా నలు మూలల నుండి ప్రతినిధుల సభ ఉంటుంది. ఇందులో రాష్ట్ర, జిల్లా నాయకత్వం పాల్గొంటుంది. మహాసభలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ రూపొందించబడుతుంది. గత 3 సంవత్సరాలుగా మన పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు నిర్వహించింది. గత ప్రభుత్వం పేదలకు ఇండ్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తే, ప్రభుత్వ భూములను గుర్తించి పేదలతో గుడిసెలు వేయించి గత 18 నెలలుగా భూపోరాటాన్ని నిర్వహిస్తున్నది. వివిధ రంగాల కార్మికులు, ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి నిర్వహించిన సమ్మెలు, దీక్షలు, ధర్నాలు, ప్రదర్శనల్లో సిపిఎం ప్రత్యక్షంగా పాల్గొని, కార్మికవర్గానికి అండగా నిలిచింది. బొగ్గు బ్లాకుల వేలాన్ని రద్దుచేసి, కొత్త బొగ్గు బ్లాకులన్ని సింగరేణికే కేటాయించాలని, సింగరేణి పరిరక్షణ కోసం బస్సు యాత్ర చేసి కార్మికవర్గాన్ని, ప్రజలను చైతన్యం చేసింది. ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల చారిత్రాత్మకమైన సమ్మెలు, పోరాటాలకు మద్దతు తెలిపింది. లారీ చార్జీ జరిగినప్పుడు యాజమాన్య వైఖరిని నిరసిస్తూ ఎన్టీపీసీ బంద్ లొ కీలక పాత్ర పోషించింది. మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికుల వేతనాల పెంపుదల కోసం జరిగిన అనేక సమ్మెలకు,పోరాటాలకు సిపిఎం అండగా నిలుస్తుంది. మన జిల్లాకు మంజూరైన 100 పడకల సూపర్ స్పెషాలిటీ ఈఎస్ఐ హాస్పిటల్ వెంటనే నిర్మించాలని, రామగుండం జెన్కోను విస్తరించాలని, జిల్లాలోని పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఆందోళనలు నిర్వహించింది. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాలకు ప్రజా రవాణా మెరుగుపరచాలని, జిల్లా కేంద్రంలోని ప్రమాదాల నివారణకు బైపాస్ రోడ్డు నిర్మించాలని, కూనారం రైల్వే ఓవర్ బ్రిడ్జి వెంటనే పూర్తి చేయాలని పోరాడుతుంది. నిరంతరం ప్రజా సమస్యలపై రాజీలేని సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్న సిపిఎం జిల్లా మహాసభల సందర్భంగా జరిగే ప్రజా ప్రదర్శన, బహిరంగ సభలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహంకాళి మల్లేష్, లక్ష్మణ్, చిలుముల రామ్మూర్తి, నరసింగం, పోచయ్య, మధు, లక్ష్మి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్న టీం కమిటీల నియామకం..



తీన్మార్ మల్లన్న టీం కమిటీల నియామకం.. జమ్మికుంట నవంబర్ 20 (ది క్రైమ్ న్యూస్): హుజురాబాద్ నియోజకవర్గం తీన్మార్ మల్లన్న టీం తెలంగాణ రాష్ట్రం అధ్యక్షులు మదాం రజిని కుమార్ ఉపాధ్యక్షులు భావన ఆదేశాలనుసారం హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ కొంగంటి రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు దాట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు నియమించడం జరిగింది. మల్లన్న టీంలో ఎన్నో సంవత్సరాల నుంచి చేస్తున్నటువంటి టీం సభ్యులు మండల అధ్యక్షులు గా ఎన్నుకోవడం జరిగింది. జమ్మికుంట నేదురు కుమార్ స్వామి, వీణవంక వినయ్ చందర్,కమలాపూర్ కోవరాజ్ సాగర్,ఇల్లంతకుంట దేవరాజ్ నియమించడం జరిగింది. హుజురాబాద్ మండలానికి అధ్యక్షులుగా స్టేట్ టీంలో మెంబర్ చేసినటువంటి బండ రమేష్ మృతి పట్ల వారికి తీన్మార్ మల్లన్న టీం తరఫున సంతాపం తెలియజేయడమైనది. హుజురాబాద్ మండలానికి అధ్యక్షునిగా కొంతమంది పేర్లను పరిశీలించడం జరుగుతుంది. స్టేట్ టీం ఆధ్వర్యంలో హుజురాబాద్ మండలానికి కూడా అధ్యక్షుడిని నియమించడం జరుగుతుంది. రానున్న రోజుల్లో ప్రతి మండల గ్రామంలో కమిటీలు వేయడం జరుగుతుంది. పేదలకు అందుబాటులో ఉండేలాగా రానున్న రోజుల్లో హుజురాబాద్ నియోజకవర్గం లో క్యూ న్యూస్ కార్యాలయాన్ని కూడా ఓపెన్ చేయడం జరుగుతుంది. తీన్మార్ మల్లన్న టీం అంటే పార్టీలకు అతీతంగా ఏప్పుడు పేద ప్రజలకు అండగాను. ఎక్కడైనా కూడా అన్యాయం జరిగినా అవినీతి జరిగినా మాట్లాడుతూ అక్రమాలను అన్యాయాలను వెలికితీస్తూ, తీన్మార్ మల్లన్న టీం పేదల పక్షాన ఎప్పుడు ముందు ఉంటుంది. ఇప్పుడు ఉన్నటువంటి మండల అధ్యక్షులు గాని. కొత్తగా టీంలో చేరుతున్నటువంటి. సభ్యులు గాని. పేద ప్రజల తరపున నిలబడి. పేద ప్రజలు తరపున కొట్లాడుతూ. తీన్మార్ మల్లన్న టీం యొక్క ఆదేశాలను పాటిస్తూ పనిచేయాలని హుజురాబాద్ నియోజకవర్గం తరఫున తెలియజేస్తూ ఏదైతే రానున్న రోజుల్లో ప్రతి గ్రామంలో ప్రతి గడపలో తీన్మార్ టీం సభ్యుడు ఉండేలాగా కార్యాచరణ తీసుకోబడుతుంది. రానున్న రోజుల్లో ఎస్సీ ఎస్టీ ఓబీసీ మైనార్టీల కోసం మల్లన్న కొట్లాడుతున్నాడని అన్నారు. అదే లక్ష్యంతో హుజురాబాద్ నియోజవర్గం టీం సభ్యులు కూడా వారికి అండగా నిలబడతారని తెలియజేసుకుంటూ మేమెంతో మాకు అంతా అనే నినాదంతో ముందుకు వెళ్దామని తెలియజేయడం జరిగింది. అదేవిధంగా రిజర్వేషన్లు గాని, వ్యాపారంలో గాని, పదవుల్లో గాని వారి జనాభా ప్రకారంగా అవకాశం ఇవ్వాలని మాటీం తరఫున ముందుకు వెళ్లడం కూడా జరుగుతుంది. రానున్న రోజుల్లో ఎస్సీ ఎస్టీ ఓబీసీ మైనార్టీలకు తీన్మార్ మల్లన్న టీంలో పెద్దపీట వేయడం కూడా జరుగుతుందని అన్నారు.

# యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి..

## - మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించిన పట్టణ ఎస్సై ఆరోగ్యం




**జమ్మికుంట నవంబర్ 20 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట పట్టణంలోని స్రవంతి జూనియర్ కళాశాల లో జమ్మికుంట పట్టణ సి ఐ వరగంటి రవి ఆదేశాల మేరకు ఎస్సై ఆరోగ్యం విద్యార్థిని, విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వలన వాటిల్లే నష్టాల గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు... ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రతి బుధవారం రోజు డ్రగ్స్ నిర్మూలనపై మత్తు పదార్థాల వాడకం వాటి వల్ల ఏర్పడే నష్టాలపై పోలీసులు అవగాహన సదస్సులు కల్పిస్తున్నట్లు తెలిపారు. యువత మత్తుకు బానిసలై తమ అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని, మత్తు వలన విచక్షణ కోల్పోయి ప్రమాదాలకు గురవ్వడం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడం చేస్తున్నారని, అలాంటివారిలో మార్పు తీసుకురావడానికి పోలీస్ శాఖ తరపున అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.. గంజాయి వంటి మత్తు పదార్థాలను వినియోగించడం ద్వారా యువత భవిష్యత్తు నాశనం కాకూడదనే సదుద్వేశంతో పోలీస్ శాఖ తరపున ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిషేధిత గంజాయి అక్రమ రవాణా చేసినా, విక్రయించినా, వినియోగించడం లాంటి కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.. ఎవరైనా విద్యార్థులు గాంజాకు అలవాటు అయినట్లయితే పోలీస్ శాఖకు తెలుపాలని వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని అన్నారు ఇంటర్మీడియట్ స్థాయిలో చక్కగా చదివితే భవిష్యత్తు బంగారు బాటలు వేసుకోవచ్చు అని కష్టపడి ఉన్నత ఉద్యోగాల్లో ఉన్న ఈ ప్రాంత వ్యక్తుల చరిత్ర తెలుసుకొని వారిని స్ఫూర్తిగా తీసుకొని ప్రణాళిక బద్దంగా చదవాలని విద్యార్థులకు సూచించారు.. మత్తు పదార్థాల అక్రమ రవాణా గురించి ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్రవంతి కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



# అసెంబ్లీలో ఒక గంట సమయం ఇస్తేనే జగన్ వస్తారు

## ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి



**అమరావతి, (ది క్రైమ్ న్యూస్):** వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీ ఉందని, రోజుకు ఒక గంట జగన్‌కు మాట్లాడేందుకు సమయం ఇస్తే ఆయనే సభకు వస్తారని, లేని పక్షంలో అతను రారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం అసెంబ్లీ వద్ద మీడియాతో ఆయన చిట్ చాట్‌గా మాట్లాడారు. 2017లో ఆయన పాదయాత్రకు వెళ్ళే సమయంలో బాధ్యతలు బుగ్గనకు గానీ ఇంకెవరికైనా అప్పగించి వెళ్ళాలి.. కానీ జగన్ అలా చేయలేదు... ఎందుకంటే ఆయన మినహా మిగతావారెవరూ మాట్లాడటం అతనికి ఇష్టం ఉండదని అన్నారు. అందుకనే జగన్ అసెంబ్లీకు రావడంలేదని... ఎవరిని రానివ్వడం లేదని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. మైక్ ఆయన ఒక్కడికే ఉండాలి... ఇంకెవరు మాట్లాడకూడదని ఆయన అనుకుంటారన్నారు. అందుకనే జగన్‌కు స్పీకర్ గంట సమయం మాట్లాడటానికి ఇస్తానంటే మంగళవారం అసెంబ్లీకు వస్తారన్నారు. జగన్‌ను చూసి చాలా రోజులు అవుతుంది.. కానీ ఆయన మాత్రం అసెంబ్లీకి రావడం లేదని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. దీనికి పరిష్కారం ఏంటంటే.. రోజుకు జగన్‌కు గంట మాట్లాడేందుకు సమయం ఇస్తే వస్తారన్నారు. ఇంకొ విషయం ఏంటంటే.. ఆయన ఏం మాట్లాడినా అడ్డం రాకూడదని.. ఇది జగన్ ఫిలాసఫీ అని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో జగన్ ఎప్పుడు సమస్యల కోసం పోరాడలేదని.. ఆయన మైక్ కోసమే మమ్ములను పోరాడమని చెప్పేవారని ఎమ్మెల్యే కోటంరెడ్డి వ్యాఖ్యానించారు. కాగా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యాయి. ప్రశ్నోత్తరాల సమయం కొనసాగుతోంది. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ.. అసైన్డ్ భూములు పేదల నుండి దోచేయడానికి ఎంతో ప్రయత్నం చేశారని, అసైన్డ్ భూమలు రూ. 5, రూ. 10 లక్షలకు తీసుకొని రూ. 40 , 45 లక్షలకు అమ్ముకున్నారన్నారు. పేదలు ఇవ్వనని ఎదురుతిరిగితే వారి భూములను రెడ్ మార్కులో పెట్టేశారని ఆరోపించారు. మంత్రి అనగాని సత్య ప్రసాద్ మాట్లాడుతూ.. నిరుపయోగంగా ఉన్న భూమలును పేదలకు అసైన్డ్ చేసిందని, గత ప్రభుత్వం ఎన్నికలకు ఆరు నెలల ముందు నిషిద్ద 22ఏ నుండి9 లక్షలకు పైచిలుకు తొలగించాలని చూసారన్నారు. 1977 చట్టానికి సవరణ చేసి ఇప్పడు చట్టాన్ని తెచ్చారని, 20 ఏళ్లు పూర్తి అయిన అసైన్డ్ భూములకు 10 ఏళ్ళ ఇంటి స్థలాలకు యాజమాన్య హక్కులు కల్పించారన్నారు. ఈ విషయం ముందుగానే తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాబందులు అక్కడికి వెళ్లి వారివద్దనుండి లాక్కున్నారని ఆరోపించారు. వారు ఇన్‌సైడ్ ట్రేడిరగ్‌కు పాల్పడినట్లు తెలుస్తోందన్నారు. దీనిలో 25 వేల రిజిస్ట్రేషన్లు జరిగితే దానిలో 8 వేల రిజిస్ట్రేషన్లు అక్రమంగా చేసినట్టు సమాచారమన్నారు. 9 లక్షలు పైచిలుకు ఎసైన్డు భూమల్లో 40 శాతం ఇలా అక్రమంగా జరిగినట్టు తెలుస్తోందన్నారు. ఎసైన్‌మెంట్ దారులను బెదిరించి లాక్కోవడంతో పాటు కొర్రీలు లేకుండా రిజిస్ట్రేషన్‌ల శాఖ నుండి ఆదేశాలు ఇప్పించుకున్నారని ఆరోపించారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామసభలు పెట్టి అభ్యంతరాలపై చర్చిస్తున్నామన్నారు. దోచుకున్న భూముల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. తప్పుచేసిన అధికారులకు కూడా ఈ వ్యవహారంలో పనిష్మెంట్ ఉంటుందని మంత్రి అనగాని హెచ్చరించారు. ప్రశ్నోత్తర సమయం కొనసాగుతోంది.

# వైసిసి సభ్యుల ఆరోపణలు తిప్పికొట్టిన హెూంమంత్రి

**అమరావతి, (ది క్రైమ్ న్యూస్):** ఏపీలో జగన్ ప్రభుత్వం కంటే ఈ ఐదు నెలల్ కూటమి ప్రభుత్వంలో క్రైమ్ రేటు చాలా తగ్గిందని హెూంమంత్రి అనిత స్పష్టం చేశారు. ఇది గుర్తించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యాయి. ప్రశ్నోత్తరాల సమయంలో శాసన మండలిలో మహిళల అత్యాచారాలపై వాడివేడి చర్చ జరిగింది. ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుల మధ్య వాగ్వాదం మొదల్కెంది. ఈ విషయంపై హెూంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. గతం కంటే ఎంతో మేలన్నారు. శాంతిభద్రతలపై దృష్టి పెట్టామని అన్నారు. అయతే మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ప్రశ్నించారు. దిశ చట్టం తీసుకొస్తారా, దిశ యాప్ కొనసాగిస్తారా లేదా అని వైసీపీ ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి ప్రశ్నించారు. సభ్యుల ప్రశ్నలకు మంత్రి అనిత సమాధానం ఇస్తూ వైసీపీ ప్రభుత్వ పాలనలో చాలా లోపాలు ఉన్నాయని మంత్రి అనిత తెలిపారు. దిశ చట్టం లేదు. నిర్భయ చట్టం ఉంది. నిర్భయ కింద వైసీపీ ప్రభుత్వంలో కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం నిధులిచ్చిన అమరావతిలో ఫోరెన్సిక్ ల్యాబ్ ఎందుకు నిర్మించలేదని వైసీపీ సభ్యులు నిలదీశారు. గంజాయి వినియోగం పెరగడంతో రాష్ట్రంలో నేరాలు పెరిగాయని మంత్రి అనిత వివరించారు. అయితే హెూం మంత్రి అనిత వ్యాఖ్యలను వైసీపీ సభ్యులు అడ్డుకున్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఫెయిల్ అయిందంటూ వైసీపీ నినాదాలు చేసింది. లాఅండ్ ఆర్డర్ ఫెయిల్ కారణంతోనే నీలాంటి వారు సభకు వస్తున్నారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌నుఉద్దేశించి మంత్రి అనితఅన్నారు. తన సమాధానం వినటానికి దమ్ము, ధైర్యం కావాలని మంత్రి అనిత అన్నారు. మంత్రి వ్యాఖ్యలకు నిరసనగా వైసీపీ సభ్యులు వాకౌట్ చేశారు. తర్వాత ప్రశ్నకు వైసీపీ సభ్యులు సభలోకి వచ్చారు.

# వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రసక్తే లేదు

**అమరావతి, (ది క్రైమ్ న్యూస్):** వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రసక్తే లేదని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. మండలి ప్రశ్నోత్తరాల సమయంలో దీనిపై మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడారు.గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల కారణంగా విద్యుత్ రంగ సంస్థలపై సుమారు రూ. 1.29 లక్షల కోట్ల భారం పడిరదని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత పీపీఏల రద్దు అంశం చాలా వివాదాస్పదం అయినట్లు మంత్రి పేర్కొన్నారు. కేవలం పీపీఏల రద్దు కారణంగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన పారిశ్రామికవేత్తలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయినట్లు విమర్శించారు. ప్రతీ ఏడాది వినియోగదారుల సంఖ్య 5 నుంచి 6 శాతం పెరుగుతున్నా కానీ గత ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో కొత్తగా ఒక్క మెగా వాట్ విద్యుత్‌ను కూడా ఉత్పత్తి చేసిన పాపాన పోలేదని విమర్శించారు. విద్యుత్ వ్యవస్థను గాడిన పెట్టేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కూటమి ప్రభుత్వం గ్రీన్ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీకి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఇందు కోసం ఏకంగా రాష్ట్ర ప్రభుత్వం పాలసీ తీసుకొచ్చిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఏపీ తీసుకొచ్చిన పాలసీ కారణంగా రాష్ట్రానికి పెట్టుబడులు క్రమంగా వస్తున్నాయని అన్నారు. గత ప్రభుత్వం తీసుకుని వచ్చిన చట్టం లోని లోపాలను సరిదిద్దే ప్రయత్నంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సుంకం (రెండో సవరణ), 2024 బిల్లు తీసుకువస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఈసవరణ వల్ల వినియోగదారులపై కొత్తగా అదనపు భారం గానీ, విద్యుత్ సుంకం కానీ విధించడం లేదని స్పష్టం చేశారు. ఈ బిల్లును వైసీపీ ప్రభుత్వం 2021 లోనే తీసుకుని వచ్చినా సుంకం విధించే విషయంపై ఎక్కడా స్పష్టత ఇవ్వలేదని పేర్కొన్నారు. 2014లో తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టే నాటికి విద్యుత్ అంతరాయాలు ఏపీలో ఎక్కువగా ఉండేవని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత నుంచి ఒక్క రూపాయి కూడా విద్యుత్ చార్జీలు పెంచకుండా పాలించిన ప్రభుత్వం తమదని మంత్రి పేర్కొన్నారు.

# మీ కారు మైలేజీ తగ్గిపోయిందా.. కారణమిదేనేమో ఈ టిప్స్ ట్రై చేయండి..

కారు వినియోగం అనేది నేడు సర్వ సాధారణంగా మారింది. ప్రజల ఆదాయం పెరగడంతో పాటు అవసరాలు, తక్కువ సమయంలో గమ్యస్థానాలకు చేరడం కోసం ప్రతి ఒక్కరూ కారును వాడుతున్నారు. అయితే మైలేజీ బాగా వచ్చినప్పుడు మనకు ప్రయోజనం కలుగుతుంది. ఇందుకోసం కొన్ని చిట్కాలు పాటించాలి. మహేష్ యాదవ్ అనే వ్యక్తి తన చేవ్రొలెట్ డీజిల్ కారులో సుమారు ఒక లక్ష కిలోమీటర్లు ప్రయాణించారు. తన వ్యక్తిగత అనుభవం ఆధారంగా మైలేజీ పెరగడానికి అనేక చిట్కాలు తెలిపారు. ఆయన కారు అఫీషియల్ మైలేజీ 25.4 కాగా.. ఆయన పాటిస్తున్న చిట్కాల వల్ల ఎప్పుడూ 23.5 నుంచి 27 కిలోమీటర్ల వరకూ వస్తుందని వివరించారు. టైర్ ఒత్తిడి.. మెరుగైన మైలేజీ కోసం టైర్లలో పూర్తిగా గాలిని నింపకూడదు. వాటిని దిగువన కొంచెం స్క్విష్, ఫ్లాట్ కాంటాక్ట్ ప్యాచ్‌ను సృష్టిస్తారు. టైర్ లో ఎక్కువ గాలిని నింపితే ఈ కాంటాక్ట్ ప్యాచ్ తగ్గిపోతుంది. గాలిని తక్కువగా నింపితే పెరుగుతుంది. కాబట్టి సమానంగా ఉండేలా చూసుకోవాలి. కారు ముందు ఇంజిన్ ఉండడంతో ముందు టైర్లపై ప్రెజర్ ఎక్కువగా ఉంటుంది. వెనుక టైర్లలో 35 పీఎస్ఎల్, ముందు టైర్లలో 40 చొప్పున మెయింటెన్స్ చేయాలి. అమరిక.. నిబంధనల ప్రకారం ప్రతి 5 వేల కిలోమీటర్లకు మీ కారు అలైన్‌మెంట్‌ను సరిచేయాలి. ప్రతి 10 వేల



కిలోమీటర్లకూ అలైన్‌మెంట్, టైర్ బ్యాలెన్సింగ్, రొటేషన్ పూర్తి చేయాలి. అయితే మృదువైన రోడ్లపై డ్రైవ్ చేస్తుంటే ఈ వ్యవధిని పెంచుకోవచ్చు. కానీ గుంతలు, గతుకుల రోడ్లపై వెళుతుంటే తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. టైర్ల ఎంపిక.. కార్ల మైలేజీ సక్రమంగా రావాలంటే టైర్ల ఎంపిక బాగుండాలి. టైర్ పరిమాణం కూడా సక్రమంగా ఉండాలి. మృదువైన కాంపౌండ్ టైర్లు ఎంతో అనుకూలంగా ఉంటాయి. మెరుగైన గ్రిప్‌ను పొందడానికి అధిక స్పీడ్ రేటింగ్‌తో టైర్లను కొనుగోలు చేయాలి. గేర్ మార్పులు.. మీరు ప్రతి గేర్‌లో ఎరుపు గీతను తాకే వరకు పెడల్‌ను ఫ్లోరింగ్ చేస్తుంటే ఇంధన సామర్థ్యం దెబ్బతింటుంది. కానీ మీరు 2000 ఆర్పీఎం వద్ద అప్‌షిఫ్ట్ చేసి, పెడల్‌ను అన్ని విధాలుగా పుష్ చేయడం మంచిది. మంచి మైలేజీని పొందడానికి ఇది మంచి మార్గం. డిఫెన్సివ్ డ్రైవింగ్.. డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మన చుట్టూ ఉన్న వాహనాల వేగాన్ని గమనించాలి. దానికి అనుగుణంగా వేగాన్నిపెంచడం లేదా లేన్లను మార్చడం చేసుకోవాలి. అవసరాన్నిబట్టి వేగాన్ని తగ్గించడం, కావాలనుకున్నప్పుడు పెంచడం చేయాలి. దాని వల్ల అస్తమానూ బ్రేక్ వేసే అవసరం తగ్గి, ఇంధనం ఆదా అవుతుంది. గేర్‌లో కోస్టింగ్.. మీరు గేర్‌లో వెళ్లాలా వద్దా అనేది ట్రాఫిక్ పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది. 60 మీటర్లు, అంతకంటే ఎక్కువ దూరంలో రెడ్ సిగ్నల్ ఉందనుకోండి. యాక్సిలరేటర్, క్లచ్ పెడల్ ను తొక్కకుండా అక్కడకు కారు చేరుకునే అవకాశం ఉంటే మీరు వెంటనే గేర్ ను న్యూట్రల్ లోకి మార్చండి. దీనినే గేర్ లో కోస్టింగ్ అంటారు. ఈ సమయంలో ఇంధనం వినియోగించబడదు. అయితే ముందు, వెనుక వస్తున్న ట్రాఫిక్ ను చూసి నిర్ణయం తీసుకోవాలి. ఇంజిన్ల సామర్థ్యం.. చిన్న ప్రయాణాల కోసం, చిన్న డిస్‌ప్లేస్‌మెంట్ ఇంజిన్ కారు ఉపయోగంగా ఉంటుంది. స్లో, స్టాప్ అండ్ గో ట్రాఫిక్‌లో డ్రైవ్ చేయడానికి వీలుగా ఉంటాయి. చిన్న ఇంజిన్లు తక్కువ వేగంతో మరింత సమర్థంగా పనిచేస్తాయి. కానీ హైవేలు, ఎక్స్‌ప్రెస్ వేలపై అధిక వేగంతో ఎక్కువ దూరం ప్రయాణించాలని ప్లాన్ చేస్తుంటే పెద్ద ఇంజిన్ వాహనాన్ని ఉపయోగించాలి. ఇంజిన్ హీట్.. పెట్రోల్ ఇంజిన్లకు తమ ఆపరేటింగ్ ఉష్ణోగ్రతలను పొందేందుకు 5 నుంచి 10 నిమిషాలు పడుతుంది. డీజిల్ ఇంజిన్లు కోల్డ్ స్టార్ట్ నుంచి అక్కడికి చేరుకోవడానికి 15 నుంచి 20 నిమిషాలు అవసరం. కాబట్టి ఇంజిన్ ను అస్తమానను కాకుండా ఒక్కసారే హీటెక్కేలా ప్లాన్ చేసుకోవాలి. లేకపోతే ప్రతిసారీ ఇంధనం ఖర్చవుతుంది. మంచి మైలేజీ కోసం.. ఆయిల్, ఫిల్టర్లను ప్రతి 10 వేల కిలోమీటర్లకు మార్చాలని యజమాని మాన్యువల్ చెబితే, ప్రతి 8 వేలు లేదా 9 వేల కిలోమీటర్లకు మార్చడానికి వెనుకాడవద్దు. దీని వల్ల ఇంజిన్ సమర్థంగా పనిచేసి, మంచి మైలేజీ అందిస్తుంది.

## ఏటీఎంలలో నగదు విత్ డ్రా చేసే వారికి బ్యాడ్ న్యూస్.. సర్వీస్ చార్జ్ పేరిట కొత్త బాదుడు..

ఏటీఎం సర్వీస్ చార్జీలు పెరగనున్నాయా? అంటే అవుననే సమాధానమే వస్తోంది. కస్టమర్ల నుంచి వసూలు ఇంటర్ చేంజ్ ఫీజును పెంచాలని ఏటీఎం సర్వీస్ ప్రొవైడర్లు ప్రతిపాదనలు పెట్టాయి.ఏటీఎం బిజినెస్ ను మరింత విస్తరించడానికి ప్రస్తుతం ఉన్న రేట్లను పెంచాలని వారు చూస్తున్నారు. ఇది జరిగితే ఉచిత లావాదేవీలు ముగిసిన చేసే ప్రతి లావాదేవీకి వినియోగదారులకు అదనపు ఫీజులు పడతాయి. ఇంటర్ చేంజ్ ఫీజు అంటే.. ఇంటర్ చేంజ్ ఫీజు అంటే ఏటీఎం సర్వీస్ ప్రొవైడర్ కి బ్యాంకు చెల్లించే రుసుము. ఇది వినియోగదారులు తమ కార్డుతో ఏటీఎం ద్వారా నగదు విత్ డ్రా చేసినప్పుడు ఇది పడుతుంది. ముఖ్యంగా ఒక బ్యాంకు కార్డుతో మరో బ్యాంకు ఏటీఎంలో డబ్బులు విత్ డ్రా చేసినప్పుడు ఇది వినియోగదారుడికి పడుతుంది. ఫీజు ఎంత పెంచనున్నారంటే.. ఏటీఎం ఇంటర్ చేంజ్ ఫీజును రూ. 23కు పెంచాలని ది కాన్ఫెడరేషన్ ఆఫ్ ఏటీఎం ఇండస్ట్రీ(సీఏటీఎంఐ) కోరింది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ), నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్పీసీఐ)కు విన్నవించింది. ఇది ఏటీఎం ఆపరేషనల్ చార్జీల కింద వసూలు చేయనుంది. ఇది దేశ వ్యాప్తంగా ఉన్న వివిధ ఏటీఎం సర్వీసులు ప్రభావవంతంగా పనిచేసేందుకు ఉపకరిస్తుందని చెబుతున్నారు. వాస్తవానికి ఏటీఎం ఇంటర్ చేంజ్ ఫీజు రూ. 15 ఉండగా.. దానిని 2021లో రూ. 17కి పెంచారు. గరిష్ట లిమిట్ రూ. 21గా నిర్ణయించారు. ప్రస్తుత ఏటీఎం లావాదేవీల లిమిట్స్ ఇవి.. ప్రస్తుతం సేవింగ్స్ ఖాతా దారులు దేశంలో ఆరు మెట్రో నగరాలైన ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో ప్రతి నెల ఐదు ఉచిత లావాదేవీలు అందుబాటులో ఉంటాయి. ఈ ఐదు ఉచిత లావాదేవీలు దాటితే అదనపు చార్జీలు వసూలు చేస్తారు. కాగా ఇప్పుడు ఏటీఎం చార్జీలు పెంచాలన్న ప్రతిపాదనపై ఆర్బీఐ సానుకూలంగా స్పందించినట్లు మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. వినియోగదారులపై ప్రభావం ఇది.. ఒకవేళ ఈ ప్రతిపాదనను ఆర్బీఐ అంగీకరిస్తే.. వినియోగదారులపై ఉచిత లావాదేవీల లిమిట్ దాటిన తర్వాత అదనపు చార్జీలు పడతాయి. తరచూ ఏటీఎంలలో నగదు ఉపసంహరించుకునే వారికి ఇది అదనపు భారం కాగలదు. కాగా డిజిటల్ పేమెంట్స్ బాగా పెరుగుతున్న నేపథ్యంలో ఏటీఎంల వినియోగం బాగా తగ్గింది. అందరూ సెల్ ఫోన్లతోనే యూపీఐ లావాదేవీలు చేసేస్తున్నారు. చేతిలో డబ్బులు ఉంచుకోవాలనే ఆలోచనే జనాల్లో తగ్గిపోయింది. ఈ క్రమంలో ఇప్పుడు ఈ నిర్ణయం కూడా ఏటీఎంల వినియోగంపై పెద్ద ప్రభావమే చూపుతుందని నిపుణులు చెబుతున్నారు.



## ఫండ్స్‌లో కొత్త ఇన్వెస్టర్ల జోరు


### రెండు నెలల్లో 81 లక్షల కొత్త ఖాతాలు ఆకర్షిస్తున్న రాబడులు



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ రంగంలో కొత్త ఇన్వెస్టర్ల జోరు కొనసాగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మొదటి రెండు నెలల్లోనే (ఏప్రిల్, మే) మ్యూచువల్ ఫండ్స్‌లో 81 లక్షల కొత్త ఖాతాలు (ఫోలియోలు) నమోదయ్యాయి. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) డేటాను పరిశీలించగా.. మే చివరికి నాటికి ఫోలియోలు 18.6 కోట్లకు చేరాయి. ఈ ఏడాది మార్చి చివరికి ఉన్న 17.78 కోట్ల ఫోలియోలతో పోలిస్తే 4.6 శాతం పెరిగాయి. ఏప్రిల్‌లో 36.11 లక్షల ఫోలియోలు ప్రారంభం కాగా, మే నెలలో 45 లక్షలుగా ఉన్నాయి. 2023లో నెలవారీ సగటు నూతన ఖాతాల ప్రారంభం 22.3 లక్షలుగా ఉంది. దీంతో పోల్చి చూసినప్పుడు ఏప్రిల్, మే నెలల్లో రెట్టింపు స్థాయిలో కొత్త ఖాతాలు ప్రారంభమైనట్టు తెలుస్తోంది. ఒక ఇన్వెస్టర్‌కు ఒక మ్యూచువల్ ఫండ్ పథకంలో పెట్టుబడిని సూచించేదే ఫోలియో. ఇలా ఒక ఇన్వెస్టర్ పలు రకాల పథకాల్లో ఇన్వెస్ట్ చేసినప్పుడు ఒకటికి మించిన ఫోలియోలు కలిగి ఉండడం సహజం. పెరుగుతున్న అవగాహన.. ఇన్వెస్టర్లలో అవగాహన పెంచేందుకు మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ అనుసరిస్తున్న పలు ప్రచార కార్యక్రమాలకు తోడు, ఈక్విటీల బలమైన ప్రదర్శన ఇన్వెస్టర్లను ఆకర్షిస్తున్నట్టు నిపుణులు చెబుతున్నారు. మ్యూచువల్ ఫండ్స్‌తో పోల్చి చూసినప్పుడు ఫిక్స్‌డ్ డిపాజిట్లలో రాబడులు అంత ఆకర్షణీయంగా లేకపోవడం కూడా ఇన్వెస్టర్ల ధోరణిలో మార్పునకు కారణంగా పేర్కొంటున్నారు. అలాగే పెరుగుతున్న ఆదాయం, డిజిటల్ సాధనాల ద్వారా ఆర్థిక సాధనాల్లో పెట్టుబడులకు ఉన్న సౌలభ్యం వృద్ధికి అనుకూలిస్తున్నట్టు నిపుణులు చెబుతున్నారు. కొత్తగా వస్తున్న ఇన్వెస్టర్లలో ఎక్కువ మంది డిజిటల్ ఛానళ్లను ఎంపిక చేసుకుంటున్నట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఏప్రిల్, మే నెలలో వచ్చిన 81 లక్షల కొత్త ఫోలియోలలో 61.25 లక్షలు ఈక్విటీలకు సంబంధించినవి కావడం గమనార్హం. దీంతో పరిశ్రమ వ్యాప్తంగా మొత్తం ఈక్విటీ ఫోలియోలు 12.89 కోట్లకు పెరిగాయి. మొత్తం ఫోలియోలలో ఈక్విటీల వాటా 69 శాతంగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి రెండు నెలల్లో థీమ్యాటిక్/సెక్టోరల్ విభాగంలోనే 23.19 లక్షల కొత్త ఖాతాలు ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత స్మాల్‌క్యాప్ (8.04 లక్షలు), మిడ్‌క్యాప్ ఫండ్ (7.74 లక్షలు) విభాగాల్లో కొత్త ఖాతాల ప్రారంభం ఎక్కువగా ఉంది.

## ఐటీఆర్ దాఖలు చేస్తున్నారా.. ఏ ఫారం ఎవరికంటే..

పన్ను రిటర్నులు దాఖలు (ఐటీఆర్) సరైన అవగాహన లేకుండా, నిపుణుల సలహాలు తీసుకోకుండా ఐటీఆర్ ఫైల్ చేయడం కొంచెం కష్టమని పన్ను చెల్లింపుదారులు భావిస్తుంటారు. ఐటీఆర్ గడువు ముగుస్తుంటే కంగారుపడి వాటిని ఎంచుకోవడంలో ఒక్కోసారి పొరపాట్లు చేస్తారు. అలాచేసే తప్పులను సరిదిద్దుకునే అవకాశం ఉందని గుర్తించాలి. రివైజ్డ్ రిటర్నులు దాఖలు చేయడం ద్వారా వాటిని సవరించుకోవచ్చు. కానీ, అందుకు అదనంగా సమయం కేటాయించాలి. అది కొంత చికాకు పెట్టే అంశం. అందుకే తొలిసారి ఐటీఆర్ ఫైల్ చేసినపుడే జాగ్రత్త వహిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఈతరుణంలో రిటర్నులు దాఖలు చేసేటప్పుడు ఎలాంటి ఆదాయాలు ఉన్నవారు ఏయే ఫారాలు ఎంచుకోవాలో ఈ కథనంలో తెలుసుకుందాం. సరైన ఫారం ఎంపిక ఆదాయపన్ను రిటర్నులు దాఖలు చేసే పన్నుదారులకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల విభాగం(సీబీటీటీ) మొత్తం ఏడు రకాల ఫారాలను నోటిఫై చేసింది. వీటిలో పన్నుదారులు వారి ఆదాయమార్గాలకు అనుగుణంగా ఏది సరైందో చూసి ఎంచుకోవాలి. కొత్త పన్ను శ్లాబును ఎంచుకున్నవారి వేతనం రూ. 7.5లక్షల కంటే ఎక్కువ వార్షిక వేతనం ఉండి, ఒక ఇంటిపై ఆదాయం, వడ్డీ, వ్యవసాయ రాబడి రూ.5000 కంటే తక్కువ..వంటి తదితర మార్గాల్లో అదనంగా ఆదాయం వస్తున్నప్పుడు ఐటీఆర్-1 దాఖలు చేయొచ్చు. ఐటీఆర్-2 వ్యక్తిగతంగా లేదా హిందూ అవిభాజ్య కుటుంబాలకు చెందిన పన్నుదారులు? దాఖలు చేయవచ్చు. నిబంధనల ప్రకారం వేతనం ఉండాలి. ఒకటికంటే ఎక్కువ ఇళ్లు ఉన్నవారు ఎంచుకోవాలి. ఎలాంటి వ్యాపార ఆదాయం ఉండకూడదు. వ్యవసాయ ఆదాయం ఎంతైనా ఉండవచ్చు. అయితే ఐటీఆర్ సమయంలో వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇతరమార్గాల ద్వారా వచ్చే మూలధన రాబడులపై ట్యాక్స్ చెల్లిస్తుండాలి. ఐటీఆర్ 3 వ్యక్తిగతంగా లేదా హిందూ అవిభాజ్య కుటుంబాలు, సంస్థల్లో భాగస్వామ్యం కలిగిఉన్న పన్నుదారులు? ఈ ఫారం దాఖలు చేయవచ్చు. నిబంధనల ప్రకారం వేతనం ఉండాలి. ఒకటి కంటే ఎక్కువ ఇళ్లు ఉండాలి. వ్యాపార ఆదాయం ఉండవచ్చు. ఇతరమార్గాల ద్వారా వచ్చే మూలధన రాబడులపై ట్యాక్స్ చెల్లిస్తుండాలి. ఐటీఆర్-4 నిబంధనల ప్రకారం వేతనం ఉండాలి. ఒక ఇల్లు మాత్రమే ఉండాలి. వ్యాపార ఆదాయం ఉండవచ్చు. కానీ మీ ?మొత్తం ఆదాయంలో బిజినెస్ టర్నోవర్ 8 శాతానికి మించి ఉండకూడదు. వ్యవసాయ ఆదాయం రూ.5000లోపు ఉండాలి. అయితే ఐటీఆర్ సమయంలో వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇతరమార్గాల ద్వారా వచ్చే మూలధన రాబడులపై ట్యాక్స్ చెల్లించకూడదు. పన్నుదారులు తెలుసుకోవాల్సినవి.. ఐటీఆర్-5 ఒకరికంటే ఎక్కువమంది కలిసి ఏదైనా వ్యాపారంసాగిస్తే ఈ ఫారం దాఖలు చేయవచ్చు. ఎలాంటి వేతన ఆదాయం ఉండకూడదు. ఒకటికంటే ఎక్కువ ఇళ్లు ఉండవచ్చు. వ్యాపార ఆదాయం ఉండాలి. ఇతరమార్గాల ద్వారా ఆదాయం ఉండవచ్చు. కంపెనీలు దాఖలు చేసే ఫారం ఐటీఆర్-6. ఐటీఆర్ 7 ఫారాన్ని ట్రస్టులు అవి చెల్లించిన ఆదాయాన్ని రిటర్ను చేసుకోవడానికి దాఖలు చేస్తాయి.




# వ్యాపారం




## 5 లక్షలు డిపాజిట్ చేస్తే 10 లక్షలు..

### డబ్బును రెట్టింపు చేసే పథకం ఏంటో తెలుసా?




అనేక ప్రభుత్వ పథకాలను పోస్ట్ ఆఫీస్ అందిస్తోంది. ఇది కొంత కాలం తర్వాత ప్రజలకు మంచి లాభాలను ఇస్తుంది. స్టాక్ మార్కెట్ లేదా ఇతర ప్రదేశాలతో పోలిస్తే పోస్టాఫీసు పథకాలలో రిస్క్ చాలా తక్కువ. మీరు కూడా రిస్క్ తీసుకోకుండా ఎక్కువ డబ్బు సంపాదించాలనుకుంటే, మీరు పెట్టుబడి పెట్టిన డబ్బును రెట్టింపు చేసే ఈ పథకం గురించి తెలుసుకోండి. పోస్టాఫీసు ఈ ప్రసిద్ధ పథకం కిసాన్ వికాస్ పత్ర ముఖ్యంగా ఎక్కువ లాభాలు రావడానికి ఈ పథకం ప్రారంభించారు. ఈ పథకంలో పెట్టుబడి పెట్టడం ద్వారా, డబ్బు కొన్ని నెలల్లో రెట్టింపు అవుతుంది. ఈ పథకంలో మీరు 100 గుణిజాలలో కనీసం రూ. 1000 పెట్టుబడి పెట్టవచ్చు. విశేషమేమిటంటే ఇందులో గరిష్ట పరిమితి లేదు. మీకు కావలసినంత డబ్బు పెట్టుబడి పెట్టవచ్చు. కిసాన్ వికాస్ పత్ర యోజన కింద, సింగిల్, డబుల్ ఖాతాలను తెరవవచ్చు. 10 ఏళ్లు పైబడిన పిల్లల పేరు మీద కూడా ఖాతా తెరవవచ్చు. అలాగే, ఒక వ్యక్తి ఎన్ని ఖాతాలనైనా తెరవవచ్చు. దీనికి కూడా పరిమితి లేదు. 2, 4, 6 కిసాన్ వికాస్ పత్ర యోజన కింద మీకు కావలసినన్ని ఖాతాలను తెరవవచ్చు. 7.5 శాతం వడ్డీ: పోస్ట్ ఆఫీస్ ఈ పథకం కింద, వడ్డీ త్రైమాసిక ప్రాతిపదికన నిర్ణయించబడుతుంది. ఈ పోస్టాఫీసు పథకం కింద ప్రస్తుతం 7.5 శాతం వడ్డీ ఇస్తోంది. ఈ వడ్డీ వార్షిక ప్రాతిపదికన విడుదల చేయబడుతుంది. ఎవరైనా ఈ పథకం కింద రూ. 5 లక్షలు పెట్టుబడి పెట్టడం ద్వారా రూ. 10 లక్షలు పొందవచ్చు. మెచ్యూరిటీ వరకు అంటే 115 నెలల వరకు ఈ పథకంలో కొనసాగితే, అతను 7.5 శాతం వడ్డీ ఆధారంగా రూ. 5 లక్షలు పొందుతాడు. అంటే ఇన్వెస్టర్లు మెచ్యూరిటీపై రూ.10 లక్షలు పొందుతారు.

## రైలు టికెట్‌పై ఉండే 5 అంకెలను గమనించారా..? వీటి చరిత్ర తెలిస్తే ఆశ్చర్యపోతారు



మీ డైలీ లైఫ్‌లో రైలు జర్నీ ఓ భాగమైందా.? రైలులో దూర ప్రాంతాలకు తరచూ వెళ్లి.. వస్తుంటారా.? అయితే మీకే ఈ వార్త. మీరెప్పుడైనా రైలు టికెట్‌పై ఉండే 5 అంకెలను గమనించారా.? అదేనండీ.. రైలు టికెట్‌పై ట్రైన్ నెంబర్‌ను సూచించే.. 5 అంకెలు. ఈ 5 అంకెలు.. మీరు ఎక్కే ట్రైన్ గురించి వివరాలను తెలియజేయడమే కాదు.. ఆ ట్రైన్ స్థితిగతిని.. అలాగే అది ఏ కేటగిరికి చెందినదో చెప్పేస్తుంది. ఈ 5 అంకెల్లో ఇంత ఇన్ఫర్మేషన్ ఉంది అంతే..! మీరు నమ్మలేకపోవచ్చు.. కానీ ఇది నిజం. ఈ అంకెలు 0 నుంచి 9 మధ్యలో ఉంటాయి. వాస్తవానికి 0తో ఈ నెంబర్ మొదలైతే.. ఆ రైలు స్పెషల్ కేటగిరికి చెందినది అని అర్థం. వేసవి స్పెషల్, లేదా పండుగ స్పెషల్.. లేదా ఇతర స్పెషల్ కేటగిరికి చెందిన రైలు. మొదటిగా 1 అంకెతో రైలు నెంబర్ మొదలైతే.. ఆ ట్రైన్ దూర ప్రాంతాలకు వెళ్లేది అని అర్థం. రాజధాని, జన్ శతాబ్ది, జన్ సాధర్, సంపర్క్‌క్రాంతి, గరీబ్‌రథ్, దురంతో లాంటి ట్రైన్స్ ఈ కేటగిరి కిందకు వస్తాయి. అలాగే మొదట 2 అంకెతో ట్రైన్ నెంబర్ మొదలైతే.. ఇది కూడా అత్యంత దూరం వెళ్లే రైలు అని అర్థం. ఇక నెంబర్ 3 అంకెతో మొదలైతే.. ఈ రైలు కోల్‌కతా సబ్ అర్బన్ రైలు అని అర్థం. 4 అంకెతో మొదలైతే.. న్యూఢిల్లీ, చెన్నై, సికింద్రాబాద్, అలాగే ఇతర మెట్రో నగరాల సబ్ అర్బన్ రైళ్లు ఈ కేటగిరి కిందకు వస్తాయి. 5 అంకెతో మొదలైతే అది పాసింజర్ ట్రైన్ అని అర్థం. అంకె 6తో రైలు నెంబర్ మొదలైతే అది మెము ట్రైన్. ఇక 7 అంకెతో మొదలైతే అది డెము రైలు. 8 అంకెతో మొదలయ్యే రైలు నెంబర్.. రిజర్వ్ చేసిన రైలుకు సూచిస్తుంది. 9 అంకెతో నెంబర్ స్టార్ట్ అయితే అది ముంబై సబ్ అర్బన్ రైలు. కాగా, ఈ ఐదు అంకెల్లో మొదటి అంకె రైలును సూచిస్తే.. మిగతా నాలుగు అంకెలు ఆ ట్రైన్ రైల్వే డివిజన్, జోన్‌ను సూచికను గుర్తిస్తాయి.

## ఈ బ్యాంకులో అకౌంట్ ఉందా? వెంటనే ఈ పని చేయండి.. లేకుంటే ఖాతా క్లోజ్




మీకు ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఒకటైన పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో పొదుపు ఖాతా ఉందా? అప్పుడు మీరు తప్పక తెలుసుకోవాల్సిన విషయాలలో ఇది ఒకటి. మీకు గత 3 సంవత్సరాలుగా లావాదేవీలు జరగని ఖాతాలు ఉన్నట్లయితే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా బ్యాంకును సంప్రదించడం చాలా ముఖ్యం. ఈ నెలలోనే విధివిధానాలు పూర్తి చేయాలని నిర్ణయించింది బ్యాంకు. గత మూడు సంవత్సరాలుగా ఖాతా బ్యాలెన్స్ ఎలాంటి లావాదేవీలు జరుపకుండా జీరో బ్యాలెన్స్ ఉన్న వారికి ఇది వర్తిస్తుంది. అలాంటి ఖాతాదారులకు బ్యాంకు స్వయంగా నోటీసులు పంపింది. మీరు ఖాతాలను మళ్లీ ఉపయోగించాలనుకుంటే, మీ బ్యాంక్ శాఖకు వెళ్లి ని పూర్తి చేయండి. చాలా మంది మోసగాళ్లు ఖాతాలను దుర్వినియోగం చేస్తున్నారనే సమాచారం మేరకు బ్యాంకు ఈ చర్య తీసుకుంది. 3 సంవత్సరాల పాటు నిష్క్రియంగా ఉన్న అన్ని ఖాతాలు మూసివేస్తోంది బ్యాంకు. అయితే ఖాతాను కేవైసీ చేసుకునేందుకు గుర్తింపు రుజువు తప్పనిసరి అవి పాన్‌కార్డు, ఆధార్, పాస్ పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్ అవంటివి అవసరం. అలాగే చిరునామా రుజువు కూడా అవసరం. ఆధార్, విద్యుత్ బిల్లు, నీటి బిల్లు, ఇంటి పన్ను రశీదు వంటివి చిరునామా రుజువుగా ఉపయోగించుకోవచ్చు. ఒక అయితే ఈ ఖాతాలకు కేవైసీ చేసుకునేందుకు జూన్ 1 వరకు మాత్రమే గడువుగా తీసుకుంది బ్యాంకు. మీ అకౌంట్ కేవైసీ చేయనట్లయితే ఈ పత్రాలను అందించి మళ్లీ అకౌంట్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చు. కానీ కొన్ని ఖాతాలను బ్యాంకు మూసివేయదు. అలాంటి ఖాతాలు ఏమిటో చూద్దాం. మూసివేయని ఖాతాలో ఏమిటంటే.. కొన్ని ఖాతాలకు ఈ రకమైన తగ్గింపు ఉంది. మొదటిది డీమ్యాట్ ఖాతాలు. డీమ్యాట్ ఖాతాలకు ఈ నిబంధన వర్తించదు. అలాగే ఈ బ్యాంకులో సుకన్య సమృద్ధి యోజన ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన అటల్ వంటి పథకాల కోసం తెరిచిన ఖాతాలను మూసివేయదు. ఇందులో పెన్షన్ యోజన, మైనర్ సేవింగ్స్ ఖాతా కూడా ఉన్నాయి.



# చందన



## డయాబెటిస్ ఉన్న వాళ్లు ఏ పండ్లు తినాలి?

### మధుమేహ నియంత్రణకు ఏ జాగ్రత్తలు తీసుకోవాలి?

ఏ వ్యాధి అయినా వచ్చాక నియంత్రించడం కంటే.. రాకుండా నివారించడమే మంచి మార్గమని అంటున్నారు వైద్యులు. కరోనా నేర్పిన పాఠం వల్ల వైరస్‌ల విషయాల్లో జాగ్రత్త పడినా.. బీపీ, డయాబెటిస్ వంటి విషయాల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండడంతో అవి ప్రతి ఒక్కరిలోనూ చేరుతున్నాయి. ఫాస్ట్‌ఫుడ్ తింటే డయాబెటిస్ వస్తుందా ? ప్రధానంగా డయాబెటిస్ ఉన్న వారు పాటించాల్సిన నియమాల గురించి తెలుసుకుందాం. మధుమేహం లేదా చక్కెర వ్యాధిని వైద్య పరిభాషలో డయాబెటిస్ వెల్లిటస్ అని వ్యవహరిస్తారు. మధుమేహం అంటే మనిషి రక్తంలో చక్కెరస్థాయి ఎక్కువగా అనియంత్రిత స్థితిలో ఉండడం. ఇది వ్యాధి కాదు. శరీరంలో ఇన్సులిన్ తగ్గడం వల్ల ఏర్పడే అసమానత. సాధారణంగా ఒక లీటరు రక్తంలో గ్లూకోజ్ 100 మిల్లీ గ్రాములు ఉండాలి. దానికంటే ఎక్కువగా ఉంటే మధుమేహం ఉన్నట్లు భావించాలి. సాధారణంగా పరిగడపున రక్త, మూత్ర పరీక్షలు చేసి గ్లూకోజ్ స్థాయి తెలుసుకుంటారు. మధుమేహంలో ప్రధానంగా మూడు రకాలు ఉంటాయి. టైప్-1, టైప్-2, జెస్టేషనల్. టైప్-1 మధుమేహం.. క్లోమ గ్రంథిలో బీటాకణాలు నశించి ఇన్సులిన్ స్రవించకపోవడం వల్ల ఈ రకం మధుమేహం వస్తుంది. సాధారణంగా జన్యు కారణాల వల్ల టైప్ 1 మధుమేహం వస్తుంది. ఆకలి విపరీతంగా వేయడం, ఉన్నట్టుండి బరువు తగ్గిపోవడం, బలహీనత, చిరాకు, వాంతులు, వికారం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. టైప్-2 మధుమేహం.. శరీరం సరైన స్థితిలో ఇన్సులిన్‌ను వినియోగించుకోలేనప్పుడు టైప్-2 మధుమేహం వస్తుంది. ఈ రకం మధుమేహం వయసు పైబడడం, ఊబకాయం, శారీరక శ్రమలేని జీవన విధానం మొదలైన వాటి వల్ల వస్తుంది. చూపు తగ్గిపోవడం, కాళ్ల తిమ్మిర్లు, మొద్దుబారినట్లు అనిపించడం, కాళ్ల మీద గాయం అయినప్పుడు త్వరగా మానకపోవడం, చర్మం మీద దురదలు అనిపించడం వంటి లక్షణాలు ఉంటాయి. జెస్టేషనల్ మధుమేహం..హార్మోన్లలో సంభవించే తేడాల వల్ల గర్భధారణ సమయంలో కొంతమందిలో వస్తుంది. ప్రసవానంతరం తగ్గిపోతుంది. అయితే ఇలా గర్భధారణ సమయంలో మధుమేహం వచ్చిన వారిలో సగానికి సగం మందిలో తరువాత వయస్సులో టైప్-2 మధుమేహం వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి వారు ఆహార, వ్యాయామాల విషయంలో శ్రద్ధ వహించాలి. మధుమేహం లక్షణాలు.. తరచుగా మూత్ర విసర్జన..: శరీంలో చక్కెర మోతాదు పెరిగిపోయినప్పుడు శరీరం కిడ్నీల ద్వారా దానిని బయటకు పంపే ప్రయత్నం చేస్తుంది. దాని వల్ల తరచుగా మూత్ర విసర్జన చేయాల్సి వస్తుంది. చర్మం పొడిబారిపోయి దురదలు పెట్టడం..: ఎక్కువసార్లు మూత్ర విసర్జన చేయాల్సి రావడంతో శరీరం ఎండిపోయి, చర్మం పొడిబారిపోతుంది. స్నిగ్ధత కోల్పోవడం వల్ల దురదలు వస్తాయి. రక్తంలో చక్కెర నిల్వలు ఎక్కువగా ఉండడం వల్ల వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది. బ్యాక్టీరియా వంటి సూక్ష్మక్రిములు పెరిగి అంటువ్యాధులకు ఆస్కారం ఏర్పడుతుంది. మధుమేహ నియంత్రణకు సూత్రాలు.. బరువును అదుపులో ఉంచుకోవాలి. ఊబకాయులు అయిన మధుమేహ వ్యాధిగ్రస్తులు బరువును ఎప్పటికప్పుడు చూసుకోవాలి. కఠినమైన ఆహార నియమాలు, క్రమం తప్పని వ్యాయామం, ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా చూసుకోవాలి. చురుకుగా ఉంటూ రోజూ అరగంట వ్యాయామం చేస్తే ప్రమాదాలను నియంత్రించుకోవచ్చు. మానసిక ఆందోళనను, ఒత్తిడిని తగ్గించుకోవాలి. ఫాస్ట్ ఫుడ్ పూర్తిగా నియంత్రించాలి. తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు.. మధుమేహులు కాకరకాయలు, నేరేడుపండు, మెంతులు, దంపుడు బియ్యం, ముడి బియ్యం, ఆకుకూరలు, క్యారెట్ వంటి ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలి. మామిడి పండు, ద్రాక్ష, సీతాఫలం, సపోటా, అరటిపండు, కిస్మిస్, ఖర్జూరం, ఆలుగడ్డ, పాలిష్ చేసిన బియ్యం వంటి పదార్థాలు తీసుకోవద్దు. పాస్ట్ ఫుడ్ కల్చర్ వల్ల పిల్లలనూ మధుమేహం వెంటాడుతోంది.



# అమ్మ చెప్పిన మాటే.. ఇప్పుడీ స్థాయికి!



ప్రీతిక మెహతాను వరల్డ్ ఎకనామిక్ ఫోరం 'గ్లోబల్ షార్పర్'గా గుర్తించింది. చండీగఢ్‌కు చెందిన ప్రీతిక బహుముఖ ప్రజ్ఞాశాలి. గణిత మేధావి, డేటా సైంటిస్ట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎక్స్‌పర్ట్‌గా పేరు తెచ్చుకున్న ప్రీతిక 'బటర్‌నట్ ఏఐ'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా కూడా రాణిస్తోంది. మరోవైపు మోటివేషనల్ స్పీకర్‌గా ఎంతోమందికి ధైర్యాన్ని ఇస్తోంది. మార్గనిర్దేశం చేస్తోంది. లెక్కలు అంటే చాలామంది పిల్లలకు భయం. అయితే చిన్నప్పటి నుంచి ప్రీతికకు లెక్కలు అంటే చెప్పలేనంత ఇష్టం. బొమ్మలు వేయడం అంటే కూడా ఇష్టం. పద్నాలుగు సంవత్సరాల వయసులో కోడింగ్ నేర్చుకోవడం మొదలుపెట్టింది. ఒక ప్రొడక్ట్ స్టార్టప్‌లో తొలి ఉద్యోగం చేస్తున్నప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై ఆసక్తి పెరిగింది. దాంతో ఉద్యోగాన్ని వదులుకొని న్యూయార్క్‌లోని స్టేట్ యూనివర్శిటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో మాస్టర్స్ చేసింది. ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు ఖర్చుల కోసం ఒక రెస్టారెంట్‌లో పనిచేసేది. గ్రాడ్యుయేషన్ సెర్మనీకి ప్రీతిక తల్లి అమెరికాకు వచ్చింది. తల్లిని తన ప్రొఫెసర్‌కు పరిచయం చేసింది. 'మీ అమ్మాయి బ్రైట్ స్టూడెంట్. క్లాస్‌రూమ్‌లో లోతైన ప్రశ్నలు అడిగేది. మీ కూతురికి మంచి భవిష్యత్ ఉంది' అంటూ ఆ ప్రొఫెసర్ ప్రీతికపై ప్రశంసల వర్షం కురిపించాడు. ప్రొఫెసర్ మాటలు విన్న తరువాత ప్రీతికకు తన మీద ఉన్న నమ్మకం రెట్టింపు అయింది. 'యస్. నేను సాధించగలను' అనుకుంది. బోస్టన్‌లోని 'బాంక్ ఆఫ్ అమెరికా'లో పనిచేసే అవకాశం ప్రీతికకు వచ్చింది. అయితే సొంతంగా ఏదైనా సాధించాలనే లక్ష్యంతో అధిక వేతనంతో కూడిన ఉద్యోగానికి రాజీనామా చేసింది. ప్రీతిక నిర్ణయం కుటుంబ సభ్యులతో సహా చాలామందికి నచ్చలేదు. 'బ్యాంక్ ఆఫ్ అమెరికాలో ఉద్యోగ జీవితం బాగున్నప్పటికీ నాలో ఉన్న అన్ని టాలెంట్స్‌ను ఉపయోగించుకునే అవకాశం దొరకలేదు' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంటుంది ప్రీతిక. అమెరికా నుంచి వచ్చిన తరువాత పిల్లలకు కోడింగ్ నేర్పించడానికి 'కిడ్డీకోడర్స్'ను స్టార్ట్ చేసి పన్నెండు దేశాలకు వెళ్లింది. ఆ తరువాత సాక్‌సోహో.కామ్‌తో మెన్స్ ఫ్యాషన్ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది.'మెన్స్ ఫ్యాషన్ ఇండస్ట్రీలో మంచి అవకాశాలు ఉన్నాయని రిసెర్చ్ ద్వారా తెలుసుకున్నాను. ఈ స్పేస్‌లో గ్లోబల్ స్టార్టప్ నిర్మించవచ్చు. దీన్ని దృష్టిలో పెట్టుకొని సాక్‌సోహో మొదలు పెట్టాను' అంటుంది ప్రీతిక.తనకు పట్టు ఉన్న డేటా, ఏఐ సబ్జెక్ట్‌లతో కస్టమర్‌ల వ్యక్తిగత అనుభవాలతో కంపెనీని బిల్డ్ చేసింది. యూఎస్‌లో చదువుకునే రోజుల్లోపార్ట్‌టైమ్ ఉద్యోగిగా ఒక ఇటాలియన్ రెస్టారెంట్‌లో పనిచేసింది. అది కస్టమర్%-%ఫేసింగ్ జాబ్ కావడం వల్ల ఎన్నో విషయాలపై అవగాహన వచ్చింది. ఆ జ్ఞానం 'సాక్‌సోహో'కు ఉపయోగపడింది. డైరెక్ట్%-%టు%-%కన్స్యూమర్ ఫ్యాషన్ బ్రాండ్ 'సాక్‌సోహో' తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయకేతనం ఎగరేసింది ప్రీతిక. 'మనపై మనకు ఉన్న నమ్మకమే శక్తి. దానితో ఎన్ని విజయాలైనా సాధించవచ్చు' అంటుంది ప్రీతిక మెహతా. మార్గనిర్దేశం..'ఉన్నత స్థానానికి చేరుకున్న మహిళలకు తమ స్థాయిని కా?డుకోవడానికి రెట్టింపు కష్టపడాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో లక్ష్యసాధనకు సంబంధించి అమ్మాయిలకు మార్గనిర్దేశం చేయడానికి వారికి సమయం దొరకదు' అంటున్న ప్రీతిక ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎంత బిజీగా ఉన్నప్పటికి లక్ష్యసాధన విషయంలో అమ్మాయిలకు మార్గనిర్దేశం చేయడానికి ఎన్నో సమావేశాల్లోపాల్గొంది. ఎంటర్‌ప్రెన్యూర్‌గానే కాదు మోటివేషనల్ స్పీకర్‌గా కూడా మంచి పేరు తెచ్చుకుంది. 'థింక్. లెర్న్. డిసైడ్ విత్ యువర్ ఓన్ హెడ్ అండ్ హార్ట్' అనేది ఎన్నో సమావేశాలలో ప్రీతిక నుంచి వినిపించే మాట.అమ్మ చెప్పిన మాట..చదువుకునే రోజుల్లో ఎందరో విజేతల కథలు నాకు స్ఫూర్తి ఇచ్చాయి. అదే సమయంలో 'ప్రతి రంగంలో పురుషులతో పోల్చితే మహిళా విజేతలు ఎందుకు తక్కువగా ఉన్నారు?' అని ఆలోచించేదాన్ని. ఈ ఆలోచనలతోనే నా వంతుగా ఏదైనా సాధించాలనే పట్టుదల పెరిగింది. చిన్నప్పుడు స్కూల్ మార్చమని ఇంట్లో గొడవ చేశాను. దీనికి కారణం క్లాసులో 80 మంది స్టూడెంట్స్ ఉండడం. 'ఇంత మంది మధ్య నేను టాపర్‌గా ఎలా ఉండగలను' అన్నాను.'ఇరవైమందిలో ఎలాగైతే టాపర్‌గా నిలిచావో 80 మందిలో కూడా టాపర్‌గా నిలవాలి' అని అమ్మ చెప్పింది. వందమందిలో రాణించగలిగినప్పుడు వెయ్యిమందిలో కూడా రాణించగలం అనే సత్యం బోధపడింది. మనలో సామర్థ్యం ఉన్నప్పుడు సంఖ్య ముఖ్యం కాదు. ఒకవైపు భవిష్యత్ లక్ష్యాలు. మరోవైపు ఇరుగు పొరుగు వారి సూటిపోటి మాటలు. 'ఈ డ్రెస్‌తో బయటికి వెళతావా?' 'అబ్బాయిలా పొడుగ్గా పెరుగుతున్నావేమిటి?'... ఇలాంటి నాన్‌సెన్స్ మైండ్‌సెట్ కామెంట్స్ చిరాకు కలిగించేవి కానీ నా భవిష్యత్ లక్ష్యాలను నీరుగార్చలేకపోయాయి. మన దేశంలోనే కాదు అమెరికాలోనూ వృత్తిజీవితంలో లింగవివక్షతను ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయి. అయితే అలాంటి వాటికి చిన్నబుచ్చుకోకుండా టాలెంట్‌తోనే సమాధానం చె?్పను.

## రైజింగ్ స్టార్: 16 ఏళ్లకే రూ.100 కోట్ల ఏఐ స్టార్టప్




పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్టు టెక్ పరిశ్రమలోకి తన ఘనతను చాటుకుందో 16 ఏళ్ల బాలిక. డెల్వ్.ఏఐ స్టార్టప్‌తో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. రూ.100 కోట్ల విలువతో సక్సెస్ రూల్స్‌ను తిరగరాసింది ఈ యువ పారిశ్రామిక వేత్త. ఈ సంస్థ పరిశోధన కోసం డేటా వెలికితీతకు సంబందించిన సేవలను అందిస్తుంది. ఇప్పుడు తన సంస్థలో పది మందికి ఉపాధి కల్పిస్తోంది. ప్రాంజలి అవస్థి 2022లోని ప్రారంభించింది. ఈ స్టార్టప్ ఇప్పటికే రూ.100 కోట్ల (12 మిలియన్ల డాలర్లు) విలువను కలిగి ఉంది. డెల్వ్.ఏఐ లింక్డ్ఇన్ ప్రొఫైల్ ఇప్పటికే 10 మంది ప్రత్యేక నిపుణుల బృందాన్ని కలిగి ఉండటం విశేషం. పాఠశాలల్లో కంప్యూటర్ సైన్స్ విద్యను ప్రోత్సహించడం ద్వారా ఆమె తండ్రి అవస్థి ఉన్నతికి పునాది వేశారు. ఈ ప్రోత్సాహంతోనే ఆమెను కేవలం ఏడు సంవత్సరాల వయస్సులో కోడింగ్ ప్రారంభించింది. ఆమెకు 11 ఏళు ్లన్నపుడు కుటుంబం భారతదేశం నుంచి ఫ్లోరిడాకు మారింది. 13 ఏళ్ల వయసులో ఫ్లోరిడా ఇంటర్నేషనల్ యూనివర్శిటీకి చెందిన రీసెర్చ్ ల్యాబ్స్‌లో ఆమె ఇంటర్న్‌షిప్ ద్వారా వ్యాపార ప్రపంచంలోకి ఆమె ప్రవేశించింది. ఇంటర్న్‌షిప్ సమయంలో, కోవిడ్ మహమ్మారి కారణంగా వర్చువల్ హైస్కూల్‌లో చదువుతున్నప్పుడు ప్రాంజలి మెషిన్ లెర్నింగ్ ప్రాజెక్టలలోకి ప్రవేశించింది. ఓపెన్ బీటా విడుద లైన క్రమంలోనే ఈ వెంచర్ కూడా మొదలైంది. హైస్కూల్ విద్యార్థిని లూసీ గువో, బ్యాకెండ్ క్యాపిటల్‌కు చెందిన డేవ్ ఫాంటెనోట్ నాయకత్వంలో మియామిలో %ఆ×% స్టార్టప్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్‌లోకి అడుగుపెట్టింది. తరువాత ఆన్ డెక్, విలేజ్ గ్లోబల్ నుంచి పెట్టుబడులను పొందడంలో యాక్సిలరేటర్ ప్రోగ్రామ్ అవస్థికి సహాయపడింది. ఆ తర్వాత ఆమె వ్యాపార ప్రయాణం ప్రారంభమైంది. ప్రాంజలి అవస్తి తన కంపెనీని జనవరి 2022లో స్థాపించింది. దాదాపు రూ3.7 కోట్లతో ప్రారంభ నిధులను సేకరించింది. కేవలం ఒక ఏడాదిలోనే రూ100 కోట్లకు చేరింది.

## బరువు తగ్గాలని రైస్‌కి దూరంగా ఉంటున్నారా? ఫిట్‌నెస్ కోచ్ ఏమంటున్నారంటే..

బరువు తగ్గేందుకు రకరకాల డైట్‌లు ఫాలో అవుతాం. ముఖ్యంగా రైస్‌ని దూరంగా ఉంచుతారు. ఎక్కువగా పండ్లు, చిరుధాన్యాల మీద ఆధారపడుతుంటారు. ఒక్కోసారి నచ్చిన కూర ఉన్న కూడా బరువు విషయం గుర్తించి భారంగా దూరం పెట్టేస్తాం రైస్‌ని. ఇంతకి రైస్ వల్లే బరువు పెరిగిపోతామా? దీనిపై ఫిట్‌నెస్ కోచ్‌లు ఏమంటున్నారంటే.. చాలామంది బరువు విషయంలో చాలా అపోహలు ఉన్నాయి. అ?న్నంతో బరువు ముడిపడి ఉందని నమ్ముతుంటారు. అందువల్ల అన్నం తినడం తగ్గించేస్తుంటారు. ముఖ్యంగా బరువు తగ్గే యత్నంలో అన్నంకి దూరంగా ఉంటారు. అయితే ఇది ఎంతమాత్ర నిజం కాదని తేల్చి చెబుతున్నారు ఫిట్‌నెస్ కోచ్ సిమ్రాన్. బరువు తగ్గడంలో రైస్‌ని హాయిగా తింటూనే ఎలా నియంత్రించవచ్చో వివరించారు. ఎలాంటి చింత లేకుండా హాయిగా రైస్‌ని ఆస్వాదిస్తూ తినొచ్చని చెబుతున్నారు. అందుకోసం చేయాల్సింది ఏంటో వెల్లడించారు. భోజనం తినడానికి కనీసం 10 నుంచి 12 నిమిషాల ముందు ఒక గ్లాస్ నీటిని హాయిగా తీసుకోండి. తర్వాత మంచి సలాడ్ కొద్దిగా తీసుకోండి. ఆ తర్వాత నచ్చిన భోజనం హాయిగా తినండి. ప్రతి ముద్దను ఆస్వాదిస్తూ తినండి. అలాగే పెరుగు అన్నం కూడా స్కిప్ చెయ్యొద్దు మంచిగా లాగించేయండని చెబుతున్నారు ఫిట్‌నెస్ కోచ్ సిమ్రాన్. అంతేగాదు అన్నం తినడం వల్ల మధుమేహం రాదని, కేవలం అతిగా తినటం వల్ల వస్తుందని చెప్పారు. అలాగే యాక్టివ్‌గా ఉండేందుకు యత్నించండి, సమతుల్య ఆహారం బాగా తినండి, కాస్త కామన్ సెన్స్‌తో వ్యవహరిస్తూ నెట్టింట్‌లో చెప్పే ప్రతి చిట్కాను ఫాలో అవ్వకండి అని చెబుతున్నారు. అన్న తినడం వల్ల బరువు పెరుగుతాం అనే భావనను వదిలించుకోండి. శరీరం హెల్తీగా ఉండాలంటే మనస్ఫూర్తిగా అన్నం తినాలనే విషయాన్ని గ్రహించండి.

## ఆ ఆహార పదార్థాలకు దూరంగా ఉంటే బరువు తగ్గుతారు! పోషకాహార నిపుణులు



బరువు తగ్గే ప్రయాణంలో చాలా మంది పలు రకాల వర్కౌట్‌లు, డైట్‌పై దృష్టిపెడతారు. కానీ ఎలాంటి ఆహారం తీసుకుంటే బరువు తగ్గుతున్నాం అనేదాన్ని గమనించరని పోషకాహార నిపుణురాలు ఖ్యాతి రూపాని అంటున్నారు. మన తీసుకునే ఆహారంలో ఆరోగ్యకరంగా ఉండే ఆహారాలు మన బరువు తగ్గేందుకు ఆటంకం కలిగిస్తాయని చెబుతున్నారు. అలాంటి వాటిని ఎంత మేర వరకు తీసుకుంటే బెటర్ అనేది అంచనా వేసి తీసుకోవాలని తెలిపారు. అలాగే ఎక్కువ కేలరీల ఆహారం తీసుకున్న రోజు కచ్చితంగా బాగా హెల్తీగా ఉండే ఆహారాలను తీసుకోకుండా ఉండటం వంటి జాగ్రత్తలు పాటిస్తే బరువు ఈజీగా తగ్గుతారని చెబుతున్నారు. ఈ సందర్భంగా తన వెయిట్ లాస్ జర్నీలో తాను ఎలాంటి ఆరోగ్యకరమైన ఆహారాలను దూరం పెట్టడం వల్ల ఎంత తొందరగా బరువు తగ్గగలిగానే అనే విషయాలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేసుకున్నారు. ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు తీసుకోవడం, బరువు తగ్గడానికి తినడం అనేవి రెండు వేర్వేరు పరిస్థితులని నొక్కి చెప్పారు. వాటితో సరిగా వ్యవహరించాలని, అన్ని ఆరోగ్యకరమైన ఆహారాలు తక్కువ కేలరీలు లేదా కొవ్వు రహిత పదార్థాలుగా భావించడం బరువు తగ్గే ప్రయత్నాలకు ప్రధాన ఆటంకాలని అన్నారు. అంతేగాదు క్యాలరీలు మనల్ని ఎలా తికమకకు గురిచేస్తాయో కూడా వివరించారు. మన ఆహారంలో కొవ్వులు కీలకమైనవే కానీ ఇవి కార్బోహైడ్రేట్లు లేదా ప్రోటీన్‌తో పోలిస్తే గ్రాముకు రెట్టింపు క్యాలరీలను ప్యాక్ చేస్తాయి. ఉదాహరణకు ఒక గ్రాము కొవ్వు 9 కేలరీలను ఇస్తుంది. అయితే ఒక గ్రాము కార్బోహైడ్రేట్లు లేదా ?ప్రోటీన్ 4 కేలరీలను మాత్రమే ఇస్తుంది. ఇలాంటప్పుడు విజయవంతంగా బరువు తగ్గాలనుకుంటే సముతుల్యత పాటిస్తూ..తక్కువ కేలరీలు, ఫైబర్లు?, ప్రోటీన్లు అధికంగా ఉండేలా, కొవ్వు లేకుండా చేసుకోవాలని చెబుతున్నారు. సింపుల్‌గా చెప్పాలంటే ఒక టేబుల్ స్పూన్ వెన్నలో 50 కేలరీల కంటెంట? మొత్తం మీకు ఒక యాపిల్‌తో విభేదిస్తుంది. ఎందుకుంటే..? ఇందులో ఏకంగా 90 కేలరీలు ఉంటాయి, పైగా కొవ్వు ఉండదు, ఫైబర్ పుష్కలంగా ఉండి ఎక్కువ సేపే ఆకలి లేకుండా చేస్తుంది. అందువల్ల వెయిట్ లాస్ జర్నీలో బరువుని ఆటంకపరిచే ఐదు ఆరోగ్యకరమైన ఆహారాల గురించి సవివరంగా వెల్లడించారు పోషకాహార నిపుణులు ఖ్యాతి రూపానీ. అవేంటంటే.. అవోకాడో: ఆరోగ్యకరమైన కొవ్వులు కోసం తరుచుగా సూపర్‌ఫుడ్‌గా పేర్కొన్నప్పటికీ..కేలరీల పంచ్ ప్యాక్‌ని అందిస్తుంది. ఇవి 100 గ్రాముల అవోకాడోకి సుమారు 200 కేలరీలు, 19 గ్రాముల కొవ్వులు ఉంటాయి. అందువల్ల దీన్ని డైట్‌లో చేర్చుకునేటప్పుడూ మితంగా ఉండేలా చూసుకోవటం ముఖ్యం. స్మూతీస్: ఈ స్మూతీస్‌లో మంచి తృణధాన్యాలు, వెన్న, పాలతో లోడ్ చేసే కేలరీల లోడ్. దీన్ని ఆస్వాదించేటప్పుడూ కూడా జాగురుకతతో వ్యవహరించాలి. సమతుల్యంగా తీసుకోవాలి. నట్ బట్టర్: ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు సమృద్ధిగా ఉన్నప్పటికీ నట్ బట్టర్ శరీరానికి అదనపు కేలరీలను అందించేస్తుంది. చెప్పాలంటే వంద గ్రాములకు సుమారు 600 కేలరీలను పొందుతాం కాబట్టి తీసుకునేటప్పుడూ ఆ రోజు వర్కౌట్‌ల రీత్యా ఎంతమేర బెటర్ అనేది అంచనా వేసి మితంగా తీసుకుంటే మంచిది. వేయించిన స్నాక్స్: వేయించిన అ?ల్పాహారం అంటే అరటిపండు చిప్స్ వంటి రకరకాల ఐటెమ్స్ విషయంలో కేలరీల కంటెంట్‌పై దృష్టిపెట్టాలని చెబుతున్నారు. ఇవి బాగా రుచిగా ఉండటంతో ఒకేసారి ఎక్కువ మోతాదులో శరీరం కేలరీను ఈజీగా పొందుతుంది. షుగర్ ఫ్రీ స్వీట్స్: షుగర్-ఫ్రీ స్వీట్స్ కదా పెద్ద క్యాలరీలు ఉండవని చాలామంద పొరపడతారు. ఇవి కొవ్వు రహితం మాత్రం కాదు. వంద గ్రాముల షుగర్ ఫ్రీ స్వీట్స్‌లో దాదాపు 317 కేలరీలు ఉంటాయని చెబుతున్నారు పోషాకాహార నిపుణురాలు ఖ్యాతి రూపానీ. అందువల్ల ఇలాంటి హెల్తీ ఆహారాలను తీసుకునే విషయంలో కాస్త జాగురకతతో వ్యవహరిస్తూ మితంగా తీసుకుంటే తక్కువ సమయంలోనే ఈజీగా బరువు తగ్గుతారని అంటున్నారు.

# చెంచా కాదు.. చేతులతో తింటే శరీరానికి ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలో తెలుసా..?



కాలంతోపాటు ఆహారపు అలవాట్లలో కూడా అనేక మార్పులు వచ్చాయి. నేటి బిజీ లైఫ్‌లో ప్రతి ఒక్కరూ యాంత్రిక జీవనానికి అలవాటు పడిపోయారు. కడుపు నిండా తిండి, కంటి నిండా నిద్ర కూడా కరువైంది. ఏది పడితే అది తినేస్తున్నారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని దూరంపెట్టి, ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్‌తో కడుపు నింపేసుకుంటున్నారు. అది కూడా నిలబడి, పరిగెడుతూ స్పూన్లు, ఫోక్‌స్పూన్‌ల మీద ఆధారపడుతున్నారు. చేతులు ఎంగిలి కాకుండా, పెదాలకు అంటకుండా స్పూన్‌తో తినడం చాలామందికి అలవాటుగా మారింది. ఇలా తినటం స్టేటస్ సింబల్‌గా భావించేవారు చాలా మంది ఉన్నారు. చేతులతో ఆహారం తినేవారిని చీప్‌గా చూస్తుంటారు. కానీ, ఆ పద్ధతిలో ఆహారం తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదేనా..? దీనిపై నిపుణులు ఏమంటున్నారు..? తదితర వివరాలు మీ కోసం.. స్పూన్లు, ఫోక్ స్పూన్లు కాకుండా.. ఆహారాన్ని చేతులతో తినడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఈ రోజుల్లో చాలా మంది తినడానికి చెంచా ఉపయోగిస్తున్నారు. దీని వల్ల తిన్న ఆహారం జీర్ణం కావడం కష్టమవుతుంది. అయితే చేతులతో తినడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకుందాం. 1. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది: చేతులతో తినే సమయంలో ముందుగా ఆహారాన్ని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకుంటాం. ఇది ఆహారం త్వరగా జీర్ణం కావడానికి సహాయపడుతుంది. ఇది జీర్ణక్రియను సులభతరం చేస్తుంది. పోషకాలను బాగా గ్రహించడంలో సహాయపడుతుంది. 2. రుచిని పెంచుతుంది: చేతులతో ఆహారం తినేవారిలో ఆహారాన్ని చేయి తాకగాన్నే న నాడుల ద్వారా మెదడు, పొట్టకు సంకేతాలు చేరుతాయి. దీని వల్ల జీర్ణరసాలు, ఎంజైములు విడుదలై జీర్ణక్రియ సక్రమంగా సాగుతుంది. చేతులతో తినే సమయంలో ఆహారాన్ని నేరుగా చేతిలోకి తీసుకుని నోటిలో పెట్టుకుంటాం. అప్పుడు ముక్కుద్వారా ఆ వాసన ఆహారం రుచిని మరింత పెంచుతుంది. ఇది చెంచాతో తినేటప్పుడు అనుభవించదు. 3. నియంత్రణల పరిమాణం: మన చేతులతో తినేటప్పుడు మనం తినే ఆహారాన్ని సహజంగా కొలుస్తాము. చెంచాతో తింటే అతిగా తినే అవకాశం ఉంది. చెంచాతో అతిగా, వేగంగా తినడం వల్ల శరీరంలోని రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే ప్రమాదం కూడా ఉంది. ఇది టైప్ -2 డయాబెటిస్‌కు దారితీస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. 4. స్పర్శ ద్వారా అనుభూతి: మనం మన చేతులతో తినేటపుడు ఆహారం ఆకృతి, ఉష్ణోగ్రతను పసిగట్టవచ్చు. ఇది ఆహారంతో మరింత సన్నిహిత సంబంధాన్ని ఏర్పరుస్తుంది. అంతేకాదు.. మన చేతులు, కడుపు, పేగులు కొన్ని మంచి బ్యాక్టీరియాలను కలిగి ఉంటాయి. ఇవి మనల్ని వ్యాధుల నుంచి కాపాడతాయి. 5. సాంస్కృతిక ప్రాముఖ్యత: చేతులతో భోజనం చేయడం చాలా మందికి ఆచారం. ఇది కుటుంబం కలిసి తినడం సామాజిక కోణాన్ని మెరుగుపరుస్తుంది. 6. మనసుకు మంచిది: చేతులతో భోజనం చేయడం వల్ల ఏకాగ్రత పెరిగి ఒత్తిడి తగ్గుతుంది. దీంతో మనసుకు ఆనందం కలుగుతుంది. వీలైనంత వరకు చేతులతో తినండి. ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. చేతుల్లో హానిచేయని బ్యాక్టీరియా ఉండడం వల్ల తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. పర్యావరణంలోని వివిధ హానికారక సూక్ష్మజీవుల నుంచి శరీరాన్ని కాపాడుతుందని కూడా నిపుణులు చెబుతున్నారు. కాబట్టి ఎప్పుడూ చెంచాతో కాకుండా చేతులతో తినండి.



# గుండెకు మేలు చేసే ఉల్లి కాడలు..

## రక్తప్రసరణ సజావుగా సాగాలంటే వీటిని తినాల్సిందే



ఉల్లిపాయలో అనేక సుగుగుణాలు ఉంటాయి. అందుకే ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదనే నానుడి ప్రజాజీవనంలో స్థిరపడి పోయింది. ఉల్లిపాయలే కాదు ఉల్లి కాడలు కూడా ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాల్లో అగ్రస్థానంలో ఉన్నాయి. ప్రతి మార్కెట్‌లో ఉల్లి కాడలు తక్కువ ధరకే లభ్యమవుతుంటాయి. ఉల్లి కాడలను ఇతర కూరగాయలతో కూడా జోడించి వంటలు చేయొచ్చు. ఆకర్షణీయంగా కనిపించడమేకాకుండా రుచి కూడా అద్భుతంగా ఉంటుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం..ఉల్లి కాడలు హృద్రోగులకు, వృద్ధులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఉల్లి కాడల్లో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి గుండెకు ఎంతో మేలు చేస్తాయి. దీన్ని కూరలో వేసుకుని తింటే గుండె జబ్బులు తగ్గుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అలాగే ఉల్లి కాడల్లో ఉండే క్వెర్సెటిన్ అనే పదార్థం యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఈ యాంటీఆక్సిడెంట్ ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతుంది. అలాగే గుండె జబ్బుల వంటి తీవ్రమైన సమస్యల నుంచి ఉపశమనం పొందుతుంది. ఇందులో విటమిన్ సి, ఫోలిక్ యాసిడ్, ఫైబర్ ధమనులను ఆరోగ్యంగా ఉంచి గుండె ఆరోగ్యాన్ని కాపాడుతాయి. ఉల్లి కాడలను తినడం వల్ల రక్తంలోని కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. అంటే, శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువగా ఉంటే, దానిని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇందులో అధికంగా సల్ఫర్ ఉంటుంది. ఇది రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు శరీర నొప్పిని తగ్గిస్తాయి. నిత్యం ఉల్లి కాడలను ఆహారంలో భాగంగా తీసుకుంటే శరీరంలో రక్తప్రసరణ సజావుగా జరుగుతుంది. ఇది శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.

# అంత డేంజరా..? ఫ్రిజ్‌లో పెట్టిన పుచ్చకాయ తింటే.. శరీరంలో ఏమవుతుందంటే..!



సమ్మర్ సీజన్ మొదలైంది. ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 10దాటిందంటే.. సూర్యుడు ప్రతాపం మొదలవుతుంది. ఇంట్లోంచి బయటకు అడుగు పెట్టామంటే.. చాలు ఉక్కపోత చెమట పట్టడం సహజం. బయటకు వెళ్లాక బట్టలన్నీ చెమటతో తడిసిపోతున్నాయి. మన శరీరం నుండి పోషకాలు కోల్పోవడమే దీనికి కారణం. అయితే దీన్ని బ్యాలెన్స్ చేసేందుకు చాలామంది వేసవిలో పుచ్చకాయ ఎక్కువగా తింటుంటారు. పుచ్చకాయలో లైకోపీన్, యాంటీ ఆక్సిడెంట్ ఎలిమెంట్స్, విటమిన్ ఎ, విటమిన్ సి, పొటాషియం, అమినో యాసిడ్స్ అధికంగా ఉంటాయి. అలాగే బరువు తగ్గాలని ప్రయత్నించే వారికి కూడా ఈ పండు బాగా ఉపయోగపడుతుంది. ఇందులో క్యాలరీలు చాలా తక్కువ కాబట్టి, ఈ పండును తీసుకోవడం వల్ల మన పొట్ట ఎక్కువ సమయం నిండుగా ఉంటుంది. ఈ పండు వేసవిలో ఎండ వేడిమి నుండి మన శరీరాన్ని చల్లగా ఉంచుతుంది. అలాగే ఇందులో 92శాతం నీరు ఉంటుంది. కాబట్టి ఇది మన శరీరానికి ఎక్కువ వాటర్ కంటెంట్ అందిస్తుంది. తాజా పుచ్చకాయలో సిట్రులిన్ అనే ముఖ్యమైన అమైనో ఆమ్లం ఉంటుంది. ఈ సిట్రులైన్ నైట్రిక్ ఆక్సైడ్ 6 ను ఉత్పత్తి చేస్తుంది. ఫలితంగా రక్తపోటు అదుపులో ఉంటుంది. పుచ్చకాయలో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఫలితంగా, పుచ్చకాయ శరీరంలో చక్కెర పరిమాణాన్ని నియంత్రిస్తుంది. డైటింగ్ చేసేవారికి కూడా పుచ్చకాయ చాలా మంచిది. కానీ కొందరు పుచ్చకాయను రిఫ్రిజిరేటర్ లో ఉంచి తింటారు. కానీ ఇలా చేయడం వల్ల పోషక విలువలు తగ్గుతాయని మీకు తెలుసా..సాధారణంగా కొంతమంది మార్కెట్ నుండి పండ్లను కొనుగోలు చేసి ఇంటికి తెచ్చిన తర్వాత వాటిని ఫ్రిజ్‌లో ఉంచుతారు. అయితే పండ్లను కోసి ఫ్రిజ్‌లో ఉంచే అలవాటు ఉంటే మాత్రం వెంటనే దానిని వదిలేయండి. ముఖ్యంగా పుచ్చకాయను ఫ్రిజ్‌లో పొరపాటున కూడా పెట్టకూడదు. పుచ్చకాయను రిఫ్రిజిరేటర్‌లో ఉంచడం కంటే గది ఉష్ణోగ్రత వద్ద ఉంచడం మంచిదని పరిశోధనలు చెబుతున్నాయి. ఎంత ఎండలోనైనా పుచ్చకాయ చాలా చల్లగా ఉంటుంది. తినడానికి రుచికరమైనది. కానీ కట్ చేసిన పుచ్చకాయను ఫ్రిజ్ లో ఉంచితే ఫుడ్ పాయిజన్ అయ్యే అవకాశం ఉంది. సాధారణంగా కోసిన పుచ్చకాయపై బ్యాక్టీరియా పెరగడం ప్రారంభమవుతుంది. ఇది ఆరోగ్యానికి చాలా హానికరం.

# గసగసాలు గట్టిగా తినండి.. మధుమేహం నుండి గుండె జబ్బుల వరకు పరార్..!



గసగసాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వేసవిలో గసగసాలు తినడం వల్ల ఆరోగ్యానికి చాలా ప్రయోజనాలు కలుగుతాయి. ఎందుకంటే ఇవి చల్లటి గుణాన్ని కలిగి ఉంటాయి. అద్భుత ఔషధ గుణాలు కలిగి ఉన్న గసగసాలు తినటం ద్వారా పీచు, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, జింక్, విటమిన్లు సమృద్ధిగా లభిస్తాయి. అనేక వ్యాధుల నుండి రక్షిస్తుంది. నాడీ వ్యాధులు, మధుమేహం, గుండె జబ్బులు వంటి వివిధ రకాల ఆరోగ్య సమస్యలను దూరం చేయడంలో గసగసాలు ఉపయోగపడతాయి. గసగసాలు తినడం వల్ల పొట్టకు చల్లదనం చేకూరుతుంది. ఇది ఎసిడిటీ, మలబద్ధకం సమస్య నుంచి ఉపశమనం కలిగిస్తుంది. గసగసాలు తినడం వల్ల శరీరంలో రక్తం కొరత తీరుతుంది. ఇవి ఎముకలను దృఢంగా చేస్తాయి. వేసవిలో తినడం వల్ల శరీరానికి లెక్కలేనన్ని ప్రయోజనాలు కలుగుతాయి. గసగసాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇక్కడ తెలుసుకుందాం. మెదడు సామర్థ్యం: మెదడుకు నరాల, రక్త కణాల ప్రవాహాన్ని నియంత్రించే సామర్థ్యం గసగసాలకు ఉంది. మెదడులోని నాడీ కణాలు ఉత్తేజితం కావడం వల్ల మెదడు సామర్థ్యం పెరుగుతుంది. కాబట్టి పాలలో ఉడకబెట్టిన గసగసాలు తింటే పిల్లల్లో జ్ఞాపకశక్తి మెరుగవుతుంది. పెద్దలు గసగసాల పాలను తాగడం వల్ల ప్రయోజనం పొందుతారు. ఎముకల ఆరోగ్యం: గసగసాలలో కాల్షియం, కాపర్ పుష్కలంగా ఉంటాయి. ఈ రెండు పోషకాలు ఎముకల ఆరోగ్యానికి ముఖ్యమైనవి. అలాగే ఎముకల మధ్య బంధన కణజాలాన్ని బలపరుస్తుంది. దీంతో కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం పొందవచ్చు. రక్త ప్రసరణ: గసగసాలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది హానికరమైన చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో, శరీరంలో మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచడంలో సహాయపడుతుంది. గసగసాలలో ఐరన్ కూడా పుష్కలంగా ఉంటుంది. అందువల్ల, ఇది రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. నిద్రలేమి: నిద్రలేమితో బాధపడేవారు రాత్రిపూట గసగసాలు ఎక్కువగా తీసుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చు. ఒత్తిడిని తగ్గిస్తుంది. మనస్సును ప్రశాంతంగా ఉంచుతుంది. ఆందోళనను తగ్గిస్తుంది. ప్రశాంతమైన నిద్రను ప్రోత్సహిస్తుంది. రోగనిరోధక శక్తి:మన రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి విటమిన్ సి ఎంత ముఖ్యమైనదో జింక్ కూడా అంతే ముఖ్యం. గసగసాలలో జింక్ పుష్కలంగా ఉంటుంది. దీనిని రెగ్యులర్ గా తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. థైరాయిడ్ సమస్య:థైరాయిడ్ గ్రంధికి జింక్ చాలా ముఖ్యమైన పోషకం. ఇది థైరాయిడ్ హార్మోన్లను సమతుల్యం చేస్తుంది. కాబట్టి, థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు జింక్ పుష్కలంగా ఉండే గసగసాలను తీసుకోవచ్చు. నోటి పుండు:తరచుగా నోటిపూత వచ్చినప్పుడు గసగసాలు తింటే ఉపశమనం లభిస్తుంది. యాంటీ బాక్టీరియల్ కాకుండా, గసగసాలు శరీరాన్ని చల్లబరుస్తాయి. రాత్రి పూట గసగసాలు మెత్తగా చేసి పాలలో మరిగించి తాగాలి. ఇది ఆరోగ్యానికి అన్ని విధాలుగా మేలు చేస్తుంది.

# బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా నివారించే అద్భుత పండు ఇది.. మహిళలు తప్పక తినాల్సిందే




మహిళల్లో అధికంగా వచ్చే అనారోగ్య సమస్యల్లో బ్రెస్ట్ క్యాన్సర్ ముఖ్యమైనది. అయితే బ్రెస్ట్ క్యాన్సర్ నివారణకు తీసుకునే అనేకానేక చర్యల్లో ఆహారం ఒకటి. సరైన ఆహారం తింటే శరీరంలో క్యాన్సర్ కారకాలు ఉత్పత్తి కాకుండా నివారించవచ్చు. బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా నివారించే ఆహారాల్లో పుచ్చకాయ ముఖ్యమైనది. ఇది రుచికి ఎంత కమ్మగా ఉంటుందో, దాని వల్ల చాలా ప్రయోజనాలు కూడా అంతే అధికంగా ఉన్నాయి. పుచ్చకాయలో 90 శాతం నీరు ఉంటుంది. కాబట్టి శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడంలో ఈ పండు ప్రధాన పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా పుచ్చకాయలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వివిధ వ్యాధులను దూరం చేస్తాయి పుచ్చకాయ క్యాన్సర్‌ను నివారించడంలో కూడా సహాయపడుతుంది. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ (కణాలను నాశనం చేసే క్రియాశీల అణువులు) తొలగించడంలో సహాయపడతాయి. అందుకే పుచ్చకాయ వివిధ క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గిస్తుందని నిపుణులు అంటున్నారు. పుచ్చకాయలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్-సి రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా ఇది ఫ్రీ రాడికల్స్‌ను తొలగించడం ద్వారా క్యాన్సర్ నివారించడంలో సహాయపడుతుంది. ప్రత్యేకంగా ఇది రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. పుచ్చకాయలో ఉండే లైసోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్ సూర్యుని అతినీలలోహిత కిరణాల నుంచి చర్మాన్ని రక్షిస్తుంది. ఫలితంగా పుచ్చకాయ సన్ టాన్ తొలగించడమే కాకుండా, చర్మ క్యాన్సర్‌ను కూడా నివారిస్తుంది. పుచ్చకాయలో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. కాబట్టి ప్రతిరోజూ పుచ్చకాయ తినడం వల్ల కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. దృష్టి మెరుగుపడుతుంది. అంతేకాకుండా ఈ సీజనల్ వివిధ రకాల ఇన్ఫెక్షన్ల నుంచి కళ్లను రక్షిస్తుంది. నీటి కంటెంట్‌తో పాటు, పుచ్చకాయలో తగినంత మొత్తంలో విటమిన్-బి6 ఉంటుంది. ఇది మెదడును ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. రోజూ పుచ్చకాయ తినడం వల్ల వేసవితాపం నుంచి కాపుడుకోవచ్చు. పుచ్చకాయలో ఎక్కువగా నీరు ఉంటుంది. కేలరీల కంటెంట్ చాలా తక్కువగా ఉంటుంది. కాబట్టి శరీర బరువును తగ్గించుకోవాలనుకుంటే, ప్రతిరోజూ మీ ఆహారంలో ఈ పండును తీసుకోవచ్చు.

# ఆలివ్ ఆయిల్‌తో అద్భుతాలు..! ఇలా వాడితే మధుమేహం పరార్..



మధుమేహం అనేది ఒక దీర్ఘకాలిక అనారోగ్య సమస్య. ఈ వ్యాధి ఒకసారి వస్తే ఎప్పటికీ నయం కాదు. ఎందుకంటే దీనిని పూర్తిగా నయం చేసే చికిత్స ఇంతవరకు అందుబాటులోకి రాలేదు. చాపకింద నీరులా సోకే మధుమేహం రాకుండా ఉండాలంటే ఆరోగ్యంపట్ల అప్రమత్తంగా ఉండటం అవసరం. రక్తంలో గ్లూకోజ్ పెరిగినప్పుడు మనిషికి మధుమేహం వస్తుంది. గ్లూకోజ్ మన శరీరానికి శక్తి ప్రధాన వనరుగా పరిగణించబడుతుంది. శరీరం గ్లూకోజ్‌ని తయారు చేయగలదు. ఇన్సులిన్ అనేది ప్యాంక్రియాస్ ఉత్పత్తి చేసే హార్మోన్. ఇది గ్లూకోజ్ కణాలలోకి ప్రవేశించడానికి సహాయపడుతుంది. మధుమేహం బాధితుల్లో శరీరం తగినంత ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయదు..లేదంటే ఇన్సులిన్‌ను సరిగ్గా ఉపయోగించదు. అటువంటి పరిస్థితిలో గ్లూకోజ్ రక్తంలో పేరుకుపోతుంది. కణాలకు చేరుకోలేకపోతుంది. మధుమేహం మొత్తం శరీరాన్ని ప్రభావితం చేస్తుంది. ఇది మూత్రపిండాలు, నాడీ వ్యవస్థ, గుండె ఆరోగ్యాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. మధుమేహాన్ని నియంత్రించడానికి, నిపుణులు ఆరోగ్యకరమైన జీవనశైలిని, మంచి ఆహారాన్ని సిఫార్సు చేస్తారు. మధుమేహాన్ని నియంత్రించడంలో ఆలివ్ ఆయిల్ ఎంత ప్రభావవంతంగా ఉంటుందో తెలుసుకుందాం మధుమేహాన్ని నియంత్రించడానికి ఆలివ్ ఆయిల్ ప్రయోజనాలు: ఆలివ్ ఆయిల్ రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది డయాబెటిక్ రోగులకు మేలు చేస్తుంది. ముఖ్యంగా టైప్ 2డయాబెటిస్ రోగులకు ఇది అద్భుతంగా పనిచేస్తుంది. ఆలివ్ నూనెలో అనేక రకాల పోషకాలు ఉన్నాయి. ఆలివ్ ఆయిల్ యాంటీఆక్సిడెంట్లకు మంచి మూలం. అధిక చక్కెర కారణంగా ఆక్సీకరణ ఒత్తిడి పెరుగుతుంది. అదే సమయంలో, యాంటీఆక్సిడెంట్లు దాని స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. ఇదిడయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అంతే కాదు మధుమేహం వల్ల శరీరంలో చాలా సార్లు వాపు వస్తుంది. ఆలివ్ ఆయిల్ గుణాలు శరీరంలో మంటను తగ్గించి, సెల్ డ్యామేజ్‌ను నివారిస్తాయి. 1టేబుల్ స్పూన్ ఆలివ్ నూనెలో 14 గ్రాముల మొత్తం కొవ్వు ఉంటుంది. కానీ ఫైబర్, చక్కెర ఉండదు. ఇది విటమిన్లు మంచి మూలం. ఆలివ్ నూనెలో ఫైటోస్టెరాల్స్ ఉంటాయి. ఇదిగుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సహాయపడుతుంది. ఇదిమన ఆహారం నుండి కొలెస్ట్రాల్ శోషణను నిరోధిస్తుంది. గుండె జబ్బులతో సంబంధం ఉన్న చెడు కొలెస్ట్రాల్ మొత్తాన్ని తగ్గిస్తుంది. మీరు ఒక రోజులో ఎంత తింటారు అనేది ముఖ్యం. మీరు రోజుకు 3 నుండి 4 టీస్పూన్ల ఆలివ్ నూనెను మాత్రమే తీసుకోవాలి. ఆలివ్ ఆయిల్ ఇతర ప్రయోజనాలు..ఆలివ్ ఆయిల్ మంటను తగ్గిస్తుంది. ఆలివ్ నూనె ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తుంది. ఆలివ్ ఆయిల్ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. ఇది రక్తం గడ్డకట్టే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఆలివ్ నూనె రక్తపోటును తగ్గిస్తుంది.

# నేలపై పడుకుంటే ఇన్ని లాభాలా..? తెలిస్తే బెడ్‌కు గుడ్ బై చెప్పేస్తారు..!



కాలం మారింది.. దాంతో పాటుగానే ప్రజల జీవన విధానాలు మారిపోతున్నాయి. సౌకర్యాల విషయానికి వస్తే చాలా మంది ప్రజలు లగ్జరీ లైఫ్ కోసం పరుగులు పెడుతున్నారు.కానీ నేటికీ నేలపై పడుకునే పాత సంప్రదాయం ఇప్పటికీ సరైనదని మరోసారి నిరూపించబడింది ఈ ఆధునిక యుగంలో అందరూ మంచాలు, సుతిమెత్తటి బెడ్‌లను వాడుతున్నారు. కానీ, అలాంటి మంచాన్ని వదిలి నేలపై పడుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసా..? ఆ లాభాలు తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. నేలపై పడుకోవడం వల్ల కలిగే అసంఖ్యాక ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. నేల మీద పడుకోవడం వల్ల మానసిక ఆరోగ్యం: మనస్తత్వవేత్తలు నేలపై పడుకోవడం వల్ల శరీరం రిలాక్సేషన్, నేలతో అనుబంధం ఏర్పడుతుందని అంటున్నారు. నేలపై పడుకోవడం వల్ల శరీర భంగిమ సరైన రీతిలో ఉంటుంది. అదే బెడ్‌పై పడుకున్నప్పుడు మనం నిద్రించే సమయంలో కుంగి ఉంటాయి. ఇది అసౌకర్యాన్ని కలిగిస్తుంది. నేలపై పడుకోవడం వల్ల వెన్నెముక నిటారుగా ఉంటుంది. మనం నేలపై పడుకున్నప్పుడు మన శరీరం పూర్తిగా రిలాక్స్ అవుతుంది. మనం పూర్తి విశ్రాంతి తీసుకుంటాము. ఇది వెన్నునొప్పిని తగ్గిస్తుంది. వెన్నెముకపై ఒత్తిడి తగ్గించుకునేందుకు పిల్లోను వాడుకోవచ్చు. నడుము భాగంలో పలుచని పిల్లోను పెట్టుకుని నిద్రించాలన్నది వైద్యుల సూచన. నేలపై పడుకోవడం వల్ల కలిగే ఆధ్యాత్మిక ప్రయోజనాలు: నేలపై పడుకోవడం వల్ల మన శరీరానికి కావలసిన సహజమైన విశ్రాంతి లభిస్తుంది. ఇది మన వీపును నిటారుగా ఉంచుతుంది. కండరాలను రిలాక్స్ చేస్తుంది. మీరు ఫ్లాట్ ఫ్లోర్‌లో పడుకున్నప్పుడు, మీ మనస్సులోని ఆందోళనలు కూడా తగ్గుతాయి. నేటి బీజీ లైఫ్ అత్యధిక ఒత్తిడితో కూడిన యుగంలో నేలపై నిద్రపోవడం మనల్ని ప్రకృతికి దగ్గర చేస్తుంది. భూమితో అనుసంధానం చేయడం ద్వారా మనం మరింత సమతుల్యత, ప్రశాంతతను పొందవచ్చు. నేలపై పడుకోవడం వల్ల మంచి నిద్రపడుతుంది. అదే విధంగా నిద్రలో సహజ శరీర కదలిక ఉంటుంది. పరుపులు, దిండ్ల ఒత్తిడి ఉండదు. మంచి రక్త ప్రసరణ ఉంటుంది. వేసవిలో నేలపై పడుకోవడం వల్ల శరీరానికి కాస్త చల్లగా అనిపిస్తుంది. నేల చల్లదనానికి, శరీర ఉష్ణోగ్రత నెమ్మదిగా తగ్గిపోతుంది. దీనివల్ల మరింత గాఢంగా నిద్ర పోవచ్చు. అంతేకాదు, చాలా మంది ఆఫీసు, ఇంటి పనితో అలసిపోతుంటారు. బాడీ పెయిన్స్ తో బాధ పడుతుంటారు. ఆ పెయిన్స్ ఉన్న వారు బెడ్ కి గుడ్ బై చెప్పి నేల మీద పడుకోవడం అలవాటు చేసుకోండి. ఆ హాయిని మీరు ఆస్వాదిస్తారు.



## రామ్‌పోతినేని సరసన నటిస్తున్న భాగ్య శ్రీ బోర్సే

టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి ఫేం పీ మహేశ్ బాబు డైరెక్షన్‌లో సినిమా చేస్తున్నాడని తెలిసిందే. ఈ మూవీ పూజా కార్యక్రమాన్ని నవంబర్ 21న నిర్వహిస్తున్నట్టు ప్రకటిస్తూ మేకర్స్ విడుదల చేసిన ప్రీ లుక్‌లో సైకిల్‌ను తోసుకుంటూ వెళ్తూ క్యూరియాసిటీ పెంచుతున్నాడు రామ్. 22గా వస్తోన్న ఈ మూవీకి సంబంధించి తాజాగా హీరోయిన్‌ను పరిచయం చేశారు మేకర్స్. ఈ చిత్రంలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. అందమైన ప్రయాణంలో భాగమవుతున్న భాగ్యశ్రీబోర్సేకు స్వాగతం పలుకుతూ మేకర్స్ విడుదల చేసిన స్టిల్ నెట్టింట వైరల్ అవుతోంది. టాలీవుడ్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తోంది. రవితేజ నటించిన మిస్టర్ బచ్చన్‌తో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పిన భాగ్య శ్రీ బోర్సే.. ఈ సినిమాలో అందాలు ఆరబోసినా బాక్సాఫీస్ వద్ద సినిమా ఢీలా పడిపోయింది. మరి రామ్ సినిమాతోనైనా బ్రేక్ వస్తుందేమో చూడాలంటున్నారు సినీ జనాలు.



## సుమంత్ పెళ్లి కామెంట్ల.. మీనాక్షి చౌదరి రియాక్షన్

ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ లీడింగ్‌లో కొనసాగుతోంది మీనాక్షి చౌదరి. సుశాంత్ నటించిన ఇచ్చట వాహనములు నిలపరాదు సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది. ఈ భామ ఇటీవలే లక్కీ భాస్కర్ సినిమాతో సూపర్ హిట్ కొట్టింది. ఈ భామ అక్కినేని సుశాంత్‌ను పెళ్లి చేసుకోబోతుందని ఇండస్ట్రీ సర్కిల్‌లో వార్తలు హల్ చల్ చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలపై మీనాక్షి చౌదరి క్లారిటీ ఇచ్చేసింది. మెకానిక్ రాకీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో భాగంగా ఈ విషయమై మాట్లాడుతూ.. తాను కూడా ఈ పుకార్లను విన్నానని చెప్పింది. వెడ్డింగ్ అంటూ వస్తోన్న వార్తలను కొట్టిపారేస్తూ.. తాను ప్రస్తుతం సింగిల్‌గానే ఉన్నానని స్పష్టం చేసింది. అంతేకాదు సలార్ 2లో తాను భాగస్వామ్యం అవుతున్నట్టు వస్తున్న వార్తల్లో కూడా నిజం లేదని చెప్పింది. తన పర్సనల్, ప్రొఫెషనల్ లైఫ్‌లో ఏదైనా ముఖ్యమైన విషయముంటే అందరితో షేర్ చేసుకుంటానంది. మీనాక్షి చౌదరి ఇటీవలే మట్కాతో ప్రేక్షకుల ముందుకు రాగా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. ఈ భామ మరోవైపు వెంకటేశ్-అనిల్ రావిపూడి కాంబోలో తెరకెక్కుతున్న సంక్రాంతికి వస్తున్నాం చిత్రంలో వన్ ఆఫ్ ది ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది.

## 29 వైవాహిక జీవితానికి ముగింపు

ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ తన భార్య సైరా భానుతో విడిపోతున్నట్లు ప్రకటించారు. దాదాపు 29 సంవత్సరాల వైవాహిక జీవితానికి ముగింపు పలికారు. అదే సమయంలో ఏఆర్ రెహమాన్ టీమ్‌లోని బాసిస్ట్ మోహిని దే సైతం భర్త మార్క్‌తో విడిపోతున్నట్లు ప్రకటించి అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ మేరకు సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొంది. ఏఆర్ రెహబాన్ దంపతులు విడిపోయిన విడిపోతున్నట్లుగా ప్రకటించిన కొద్దిగంటల్లోనే మోహిని సైతం డివోర్స్‌పై ప్రకటన చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. మోహిని, మార్క్ సంయుక్త ప్రకటనలో పరస్పర అవగాహన ఈ నిర్ణయానికి వచ్చామని తెలిపారు. అయినా ఇద్దరం మంచి స్నేహితులుగా ఉంటామని.. జీవితంలో భిన్నమైన విషయాలను కోరుకుంటున్నామని పేర్కొన్నారు. ముందుకు సాగేందుకు పరస్పర అంగీకారంతో విడిపోవడమే ఉత్తమమైన మార్గమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మద్దతుగా నిలిచిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. మోహిని కోల్‌కతా నివాసి కాగా.. ఆమె బాస్ ప్లేయర్. ప్రపంచవ్యాప్తంగా 40కిపైగా షోల్లో ఏఆర్ రెహమాన్‌తో కలిసి ప్రదర్శనలు ఇచ్చింది. ప్రస్తుతం ఆమె వయసు 29 సంవత్సరాలు. ఇక ఏఆర్ రెహమాన్ 1995లో సైరా భానును వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఖతీజా, రహీమా, అమీన్ అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. ముగ్గురు పిల్లలకు పెళ్లయ్యింది. వైవాహిక బంధంలో ఏర్పడిన భావోద్వేగ క్షణం తర్వాత ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు ఏఆర్ రెహమాన్ న్యాయవాది తెలిపారు. ఒకరిపై ఒకరికి అమితమైన ప్రేమ ఉన్నా.. ఉద్రిక్తలు, ఆందోళనలు వారి మధ్య గ్యాప్‌ను పెంచాయని.. ఆ అగాధాన్ని పూడ్చేందుకు ఎవరు కూడా సిద్ధంగా లేరన్నారు.





## ఓటీటీ ప్లాట్‌పాంపైకి ఒకేసారి ఇద్దరు హీరోయిస్టు

### ఆ ఇద్దరు భామలపై విరుచుపడ్డ నెటిజన్లు


సమంత, నయనతార ఇద్దరు టాప్ హీరోయిన్లే. ఇద్దరినీ తమ తమ అభిమానులు సౌతిండియా లేడీ సూపర్ స్టార్‌లుగా పిలుచుకుంటారు. అంత బాగానే ఉంది కానీ.. తాజాగా ఈ ఇద్దరు ముద్దుగుమ్మలు టాప్ ఓటీటీ ప్లాట్ ఫామ్స్‌లో ఒకరు వెబ్ సిరీస్‌తో మరొకరు డాక్యుమెంటరీతో ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ రెండిటికి పబ్లిసిటీ పీక్‌లో లభించిన రిజల్ట్ మాత్రం గొప్పగా రాలేదు. ఈ నేపథ్యంలోనే నెటిజన్లు ఈ ఇద్దరి భామలపై విరుచుకుపడుతున్నారు. ఇంతకీ ఏమైందంటే.. సమంత మయోసైటిస్‌తో ఆవేదన చెందుతూ సోషల్ మీడియాలో హైలెట్‌గా నిలుస్తున్న సమయంలోనే 'సిటాడెల్ హనీ బన్నీ' సిరీస్‌తో ముందుకొచ్చింది. అయితే ఈ సిరీస్ పెద్దగా ఎలాంటి ఇంపాక్ట్ చూపలేక పోయింది. అనారోగ్య సమస్యలున్నా సమంత ఈ సిరీస్ కోసం ఫిజికల్‌గా ఎంతో కష్టపడి పోరాట సన్నివేశాలను చేసింది. కానీ, సమంత చేసిన ఫైట్స్ సీన్స్ కంటే ఇందులోని ఆమె వరణ్ ధావన్‌తో కలిసి నటించిన ఒకటిరెండు రొమాంటిక్ సన్నివేశాల గురించిన ప్రస్తావనే ఎక్కువగా జరిగింది. దీంతో కొందరు సమంతని పబ్లిసిటీ ఫుల్, రిజల్ట్ నిల్ అంటూ ట్రోల్ చేస్తున్నారు. మరోవైపు, ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న నయనతారకి కూడా సేమ్ పరిస్థితి ఏర్పడింది. ధనుష్ కాంట్రవర్సీతో అందరి దృష్టి ఆమెపై పడింది. ఈ నేపథ్యంలోనే ఆమె నెట్ ఫ్లిక్స్ డాక్యుమెంటరీ 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' రిలీజ్ అయ్యింది. దీనికి పలు సెలబ్రిటీలు మద్దతు తెలిపిన క్రిటిక్స్, ఆడియెన్స్ మాత్రం తీసి అవతల పడేశారు. అసలు పెళ్లి క్యాసెట్‌ను ఓటీటీకి అమ్మాలన్న చీప్ ఆలోచన నయనతారకు ఎందుకు వచ్చిందని నెటిజెన్స్ ట్రోల్ చేస్తున్నారు.





## మాలీవుడ్ మల్టీస్టారర్ కోసం మమ్ముట్టి, మోహన్‌లాల్


మాలీవుడ్ నుంచి పాన్ ఇండియా స్టార్ ఇమేజ్ ఉన్న లీడింగ్ హీరోల్లో మమ్ముట్టి, మోహన్ లాల్ టాప్‌లో ఉంటారని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ స్టార్ యాక్టర్ల కాంబోలో సినిమా వస్తుందంటే క్రేజ్ ఎలా ఉంటుంది. సిల్వర్ స్క్రీన్‌పై అలాంటి సందడి కనిపించే టైం రాబోతుంది. మహేశ్ నారాయణన్ డైరెక్షన్‌లో రాబోతున్న ఈ మల్టీస్టారర్ ప్రాజెక్ట్ షూటింగ్ దశలో ఉన్న విషయం తెలిసిందే. ఈ మూవీ 150వ రోజు షూటింగ్ శ్రీలంకలో కొనసాగుతోంది. ఈ చిత్రంలో స్టార్ యాక్టర్లు ఫహద్ ఫాసిల్, కుంచకో బోబన్, నయనతార, ఆంటోజోసెఫ్, రెంజిపానికర్, షాహిన్ సిద్దిఖీ, దర్శన్ రాజేంద్రన్, ప్రకాశ్ బెలవడి ఇతర లీడ్ రోల్స్ లో నటిస్తున్నారు. శ్రీలంకలోని గ్రీనరీలో షూటింగ్ స్పాట్‌కు సంబంధించిన స్టిల్స్‌తోపాటు మమ్ముట్టి అండ్ మోహన్ లాల్ టీం ఫొటోలు నెట్టింట ట్రెండింగ్ అవుతున్నాయి.





## ముఫాసా పాత్రకు టాలీవుడ్ స్టార్ మహేశ్ బాబు

హాలీవుడ్ సూపర్ హిట్ బ్లాక్ బస్టర్స్ ప్రాజెక్టుల్లో టాప్‌లో ఉంటుంది 'ది లయన్ కింగ్'. ఈ క్రేజీ ప్రాజెక్టుకు ప్రీక్వెల్‌గా వస్తోంది 'ముఫాసా: ది లయన్ కింగ్'. ఇక ఈ మూవీ తెలుగు వర్షెన్‌లో ముఫాసా పాత్రకు టాలీవుడ్ స్టార్ మహేశ్ బాబు వాయిస్ ఓవర్ అందించిన విషయం తెలిసిందే. ఈ మూవీ డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నేపథ్యంలో మూవీ రిలీజ్ కౌంట్ డౌన్ మొదలైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ.. మహేశ్ తాజాగా ఎక్స్‌లో 'హకునా.. మటాటా' అంటూ ఆసక్తికర పోస్ట్ పెట్టారు. మరో నెల రోజుల్లో ఈ మూవీ రిలీజ్ కాబోతోందని.. ముఫాసాను చూసేందుకు సిద్ధంగా ఉండండి అంటూ రాసుకొచ్చారు. ఈ మేరకు ట్రైలర్‌ను ఈ ట్వీట్‌కు జతచేశారు. ప్రస్తుతం మహేశ్ ట్వీట్ వైరల్‌గా మారింది.






Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com